


అనంత జనశక్తి

జనం కోసమే మా అక్షరం

06.08.2026

గురువారం | అనంతపురం

సంపుటి : 11 | సంచిక: 85

పేజీలు : 08 | వెల: రూ.5

PUBLISHED BY ANANTAPUR, KADAPA, CHITTOR, VISAKHAPATNAM, SRIKAKULAM, EALLURU, TIRUPATHI, ONGOLE, VIJAYAWADA, NELLORE, PRAKASHAM, GUNTUR, KURNOOL.


# అర్హులకు అన్యాయం జరగనివ్వం

- 22ఏ భూముల పరిష్కారానికి తుది గడువు
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- ఒక్క సెంటు భూమిని కూడా 22ఏ జాబితాలో చేర్చలే
- ప్రైవేట్ భూములను నిషేధించారనే ప్రచారం అవాస్తవం

2లో..



**హైదరాబాద్, ఆగస్టు 05, అనంత జనశక్తి న్యూస్**

తెలంగాణలో 22ఏ నిషేధిత భూముల జాబితా వల్ల ఏ ఒక్క అర్హులైన పేదవాడికి, నిజమైన భూహక్కుదారుడికి అన్యాయం జరగకుండా చూడటమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. కొత్తగా అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్దేశపూర్వకంగా ఒక్క సెంటు భూమిని కూడా 22ఏ జాబితాలో చేర్చలేదని, ప్రైవేట్ భూములను నిషేధించారనే ప్రచారం పూర్తిగా అవాస్తవమని తేల్చిచెప్పారు.

# ప్రపంచ డిజిటల్ ఎకానమీలో.. యువత భాగస్వామ్యం కావాలి

- మంత్రి లోకేశ్ పిలుపు
- సాంకేతికత ఆధారిత ఆవిష్కరణలకు ప్రపంచ కేంద్రం
- ఐబీఎం ఫ్యూచర్‌నౌ సెంటర్ తోడ్పాటు



2లో..

**అమరావతి, ఆగస్టు 05, అనంత జనశక్తి న్యూస్**

ప్రపంచ డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో ఏపీ యువత భాగస్వామ్యం కావాలని మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. ప్రపంచ దిగ్గజ ఐటీ సంస్థ ఐబీఎం నూతన ఐబీఎం కన్సల్టింగ్ ఫ్యూచర్ నౌ సెంటర్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు.

# రూ.9.50 లక్షల కోట్ల పెట్టుబడులే లక్ష్యం!

- రూ.9.50 లక్షల కోట్ల మాస్టర్ ప్లాన్
- ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యం
- 'బేసిటీ'యే ప్రధాన యాంకర్
- మూలపేట నుంచి గోదావరి వరకు
- వీఈఆర్ పరిధిని విస్తరించి పూర్తిస్థాయి అభివృద్ధి
- కీలక రంగాలపై ప్రత్యేక దృష్టి
- నిధుల కన్వర్జెన్స్, వీజీఎఫ్
- అవసరమైన చోట వయబిలిటీ గ్యాప్ ఫండింగ్



**అమరావతి, ఆగస్టు 05, అనంత జనశక్తి న్యూస్**

**విశాఖపట్నం ఎకనామిక్ రీజియన్ అభివృద్ధి ప్రణాళికలపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బుధవారం రాష్ట్ర సచివాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై అధికారులకు సీఎం దిశానిర్దేశం చేశారు. వివిధ రంగాల్లో కీలకమైన ప్రాజెక్టుల ద్వారా రూ.9.50 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించేలా విశాఖపట్నం ఎకనామిక్ రీజియన్ ప్రాజెక్టు చేపట్టినట్లు తెలిపారు. రూ.3.50 నుంచి రూ.4 లక్షల కోట్ల మేర ప్రభుత్వ పెట్టుబడులు పెడుతున్నట్లు వెల్లడించారు. ప్రైవేట్ రంగం నుంచి రూ.5.30 లక్షల కోట్లు రాబట్టేలా కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు.**

బేసిటీ ప్రాజెక్ట్ యాంకర్ ప్రాజెక్టుగా పెట్టుకుని విశాఖపట్నం రీజియన్ అభివృద్ధి చేపట్టాలని ప్రభుత్వం ఆలోచిస్తోందని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. సూక్ష్మస్థాయి ప్రణాళిక ద్వారా విశాఖపట్నం రీజియన్ మొత్తం అభివృద్ధి చేయాలన్నదే వీఈఆర్ ప్రాజెక్టు లక్ష్యమని స్పష్టం చేశారు. వీఈఆర్ పరిధిలో ఉన్న ప్రతి ప్రాంతాన్ని, ప్రతి రంగాన్ని పరిగణనలోకి తీసుకుని అభివృద్ధి ప్రణాళికలను సిద్ధం చేయాలని ఆదేశించారు. ఏఐ డేటా సెంటర్ల ఎకో సిస్టం, పోర్టు ఆధారిత పరిశ్రమలు, టూరిజం, హైడ్రోజన్, క్లీన్‌టెక్ ఎనర్జీలపై దృష్టి సారించాలని అన్నారు. మూలపేట పోర్టు నుంచి రాజమహేంద్రవరం అఖండ గోదావరి ప్రాజెక్టు వరకూ వీఈఆర్ అభివృద్ధిలో భాగంగా ఉండాలని సీఎం సూచించారు. వివిధ ప్రాజెక్టులను అనుసంధానించటం ద్వారా విశాఖపట్నం ఎకనామిక్ రీజియన్ ప్రగతి సాధించాలని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. నిధుల కన్వర్జెన్స్ ద్వారా వీఈఆర్ పరిధిలో అభివృద్ధి చేపట్టాలని సూచించారు. అవసరమైన మేరకు వీజీఎఫ్ స్కీంను అమలు చేయాలని తెలిపారు. ఈ సమీక్షకు సీఎస్ సాయిప్రసాద్, ఆర్థిక, పరిశ్రమలు, పురపాలక, అటవీ, ఇంధన, పర్యాటక శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు.



# రాష్ట్ర ప్రయోజనాలు కాపాడలేదు

- హరీశ్‌రావు తప్పుడు ప్రచారం మానుకోవాలి
- అధికారంలో ఉన్న ఏ రోజూ..
- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



2లో..

**హైదరాబాద్, ఆగస్టు 05, అనంత జనశక్తి న్యూస్**

తెలంగాణ ప్రాజెక్టులను ఏపీ ప్రభుత్వం 12 ఏళ్లుగా వ్యతిరేకిస్తోందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. అధికారంలో ఉన్నప్పుడు బీఆర్ఎస్ పరోక్షంగా ఆ రాష్ట్ర ప్రాజెక్టులకు మద్దతిచ్చిందని చెప్పారు. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వంపై మాజీ మంత్రి హరీశ్‌రావు తప్పుడు ప్రచారం మానుకోవాలని హితవు పలికారు.

# ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెడుతున్నారు

- చంద్రబాబు పాలనతో రోడ్డున పడ్డారు
- రైతుల పరిస్థితి దయనీయంగా ఉంది
- వైసీపీ అధ్యక్షుడు పవన్
- తూర్పు గోదావరి జిల్లాలో పర్యటన

2లో..

# నాకు 8 సెకన్లలో నిద్రపడుతుంది

ఎన్డీయే రాజ్యసభ సభ్యులతో ప్రధాని మోదీ

2లో..



# ఒక్కో మనిషిపై ఉన్న అప్పు 2 లక్షలు

- వైఎస్ షర్మిల ఆసక్తికర వ్యాఖ్యలు
- చంద్రబాబు ప్రజలకు చేసింది ఏమీ లేదు
- మేనిఫెస్టోకు మంగళంపాడేసి..

2లో..

**అమరావతి, ఆగస్టు 05, అనంత జనశక్తి న్యూస్**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై విడుదల చేసిన శ్వేతపత్రం 2024-26 ప్రగతి నివేదికపై రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. చంద్రబాబు అబద్ధాన్ని అందంగా చెప్పడంలో సీఎం చంద్రబాబు ఘనాపాటి అంటూ ధ్వజమెత్తారు. కూటమి రెండేళ్ల పాలనపై ప్రోగ్రెస్ రిపోర్టు ఈ దశాబ్దపు అతి పెద్ద జోక్ అంటూ ఎద్దేవా చేశారు.

# సమ్మక్క సాగర్ ప్రాజెక్టుపై కుట్ర జరుగుతోంది

- హరీశ్‌రావు సంచలన ఆరోపణలు
- అన్యాయం జరిగితే తెలంగాణ ఊరుకోదు
- అజెండా వచ్చి వారం రోజులు గడిచినా..
- ఎవరూ మాట్లాడటం లేదని ఫైర్

2లో..



# సంయమనంతో ఉండాలి

- జెన్ జీ నిరసనలపై సుప్రీం కోర్టు
- రాళ్లు విసిరినా కఠినంగా వ్యవహరించొద్దు
- కౌన్సెలింగ్ ఇచ్చి శాంతింపజేయడమే ప్రభుత్వాల బాధ్యత

2లో..

# 'చట్టం'తో బీసీలకు రక్షణ

- మంత్రులు సవిత, అచ్చెన్నాయుడు
- బీసీలకు మరో ఎన్నికల హామీని నెరవేర్చుతున్నాం
- బీసీ రక్షణ చట్టానికి తుదిరూపు ఇస్తున్నాం
- దేశంలోనే మొట్టమొదటిసారిగా బీసీ రక్షణ చట్టం తీసుకొస్తున్న ఏపీ : సవిత
- బీసీలను కులం, వృత్తుల పేరుతో దూషిస్తే కఠిన చర్యలు

2లో..




**విజయవాడ ఆగస్టు 05, అనంత జనశక్తి ప్రతినిధి**

బీసీ రక్షణ చట్టంతో వెనుబడిన వర్గాలు గౌరవప్రదంగా సామాజిక జీవనం కొనసాగించేలా రక్షణ కల్పిస్తున్నామని, కులం, వృత్తుల పేరుతో దూషిస్తే కఠినంగా శిక్షించేలా చట్టం రూపొందిస్తున్నామని మంత్రులు ఎస్.సవిత, అచ్చెన్నాయుడు తెలిపారు. ఈ చట్టంపై మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీల అభిప్రాయాలు తీసుకున్నామని, త్వరలో జిల్లా స్థాయిలోనూ బీసీ సంఘాల ప్రతినిధుల నుంచి సలహాలు తీసుకుంటామని తెలిపారు.

# పక్క రాష్ట్రాల్లో చేసిన పూజలపై క్లారిటీ ఇవ్వాలి

- హరీశ్‌రావుకు మహేశ్ గౌడ్ సవాల్
- పూజల వివరాలను మీడియాకు వెల్లడించకుండా
- ఎందుకు గోప్యంగా ఉంచారు?

2లో..



**హైదరాబాద్, ఆగస్టు 05, అనంతజనశక్తి న్యూస్**

తమిళనాడు, కర్ణాటకల్లో చేసిన పూజలపై మాజీ మంత్రి హరీశ్‌రావు స్పష్టత ఇవ్వాలని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు. పూజల వివరాలను మీడియాకు వెల్లడించకుండా ఎందుకు గోప్యంగా ఉంచారని ప్రశ్నించారు. నిజామాబాద్‌లో టీఎన్జీవో ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాల వేడుకలో ఆయన పాల్గొన్నారు.

# నాకు 8 సెకన్లలో నిద్రపడుతుంది



**న్యూఢిల్లీ, ఆగస్టు 05, అనంత జనశక్తి న్యూస్**

ఎన్డీయే నుంచి కొత్తగా రాజ్యసభ కు ఎన్నికైన ఎంపీలకు ప్రధాని నరేంద్ర మోదీ పలు కీలక సూచనలు చేశారు. బుధవారం పార్లమెంట్ సమావేశాలకు ముందు అల్పాహారం సందర్భంగా ఆయన కొత్త ఎంపీలతో దాదాపు గంటపాటు సమావేశమయ్యారు. జూన్‌లో జరిగిన రాజ్యసభ ఎన్నికల తర్వాత తొలిసారిగా పార్లమెంటులో అడుగుపెట్టిన ఎంపీలలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ కూడా ఉన్నారు. వ్యక్తిగత ప్రవర్తన సహా రాజ్యసభలో ప్రతిపక్షాలతో ఎలా వ్యవహరించాలనే అంశాలపై వారికి మోదీ దిశానిర్దేశం చేశారు.
వీలైనంత వరకు సభకే ఎక్కువ సమయం కేటాయించాలని, 100 శాతం అటెండెన్స్ ఉండేలా చూసుకోవాలని ఎన్డీయే ఎంపీలకు ప్రధాని సూచించారు. సొంత పార్టీ నేతల నుంచే కాకుండా ప్రతిపక్ష ఎంపీల నుంచి కూడా మంచి విషయాలను నేర్చుకోవాలని హితవుపలికారు. తన వ్యక్తిగత దినచర్య గురించి పలువురు ఎంపీలు అడుగగా ప్రధాని స్పందించారు. తాను నిద్రకు ఉపక్రమిస్తే ఎనిమిది సెకన్లలోపే నిద్ర పట్టేస్తుందని చెప్పారు. రోజుకు కేవలం మూడు గంటలు మాత్రమే నిద్రపోతానని తెలిపారు. జీవితంలో ఉత్తమ ఫలితాలు సాధించాలంటే వర్తమానంలో జీవించడం ఎంతో ముఖ్యమని ప్రధాని అన్నారు. ఈ క్రమంలో ఉన్న సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విదేశీ పర్యటనల గురించి మాట్లాడుతూ విమానం ఎక్కిన వెంటనే తాను వెళ్తున్న దేశం కాలమానానికి తగ్గట్టుగా గడియారంలో సమయాన్ని సర్దుబాటు చేసుకుంటానని ప్రధాని తెలిపారు. దానివల్ల ఏ దేశానికి వెళ్లినా ఎటువంటి ఇబ్బంది ఉండదని చెప్పారు.

# ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెడుతున్నారు

**అమరావతి, ఆగస్టు 05, అనంతజనశక్తి న్యూస్**

తూర్పు గోదావరి జిల్లా దేవరపల్లిలో మాజీ సీఎం, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ పర్యటించారు. ఈ సందర్భంగా పొగాకు కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన జగన్.. అక్కడి పొగాకు బ్యారెల్లను పరిశీలించారు. అనంతరం పొగాకు రైతులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలు, ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన జగన్.. కూటమి ప్రభుత్వ పాలనలో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆరోపించారు. విద్య, వైద్యం, వ్యవసాయం, పారిశ్రామిక రంగాల్లో విధ్వంసకర పరిస్థితులు నెలకొన్నాయని విమర్శించారు. అన్యాయాలను ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు నమోదు చేసి కోర్టుల చుట్టూ తిప్పుతున్నారని మండిపడ్డారు.
పొగాకు రైతులు ప్రస్తుతం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారని వైఎస్ జగన్ పేర్కొన్నారు. 'సీఎం చంద్రబాబు పాలనలో రైతులు నష్టపోయారు. విద్య, వైద్యం, వ్యవసాయం, పారిశ్రామిక రంగాల్లో విధ్వంసమే కనిపిస్తోంది. అన్యాయంపై ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెట్టి కోర్టుల చుట్టూ తిప్పుతున్నారు. చంద్రబాబుది వెన్నుపోటు పార్టీ. కూటమి పాలనలో రైతులు రోడ్డున పడ్డారు. పొగాకుతో పాటు ఏ పంటకూ గిట్టుబాటు ధర లేదు. రైతుల ఆత్మహత్యలు చంద్రబాబుకు కనిపించడం లేదా?. భాధిత రైతు కుటుంబాలకు కనీసం పరామర్శ లేదు. పొగాకు రైతులు సంక్షోభంలో ఉన్నారు. గిట్టుబాటు ధర రాక వెంకటేశ్వరరావు అనే రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఆ కుటుంబాన్ని ప్రభుత్వ పెద్దలు పరామర్శించలేదు' వైఎస్ జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'వైసీపీ హయాంలో కేజీ పొగాకు ధర రూ.289గా ఉంది. కానీ ఇప్పుడు కేజీ పొగాకు ధర రూ.236 మాత్రమే పలుకుతోంది. రోజురోజుకు రైతులకు పెట్టుబడి పెరుగుతుంటే, రాబడి తగ్గుతోంది. చంద్రబాబు ప్రభుత్వం 12 శాతం పొగాకు పంటను మాత్రమే కొనుగోలు చేసింది. చంద్రబాబు ప్రభుత్వం దళారీలతో రాజీ పడింది. దళారులు సిండికేట్ గా మారి రైతుల పొట్టకొడుతున్నారు. వైసీపీ హయాంలో రైతులకు సున్నా వడ్డీకే రుణాలు ఇచ్చాం. పీఎం కిసాన్‌కు అదనంగా రైతులకు రూ.20 వేలు ఇస్తామన్నారు. వైసీపీ హయాంలో ఉన్న ఉచిత పంటల బీమాను రద్దు చేశారు' వైఎస్ జగన్ ఆరోపించారు. రైతుల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం స్పందించాలని జగన్ డిమాండ్ చేశారు.

# సంయమనంతో ఉండాలి

**అమరావతి, జులై 05, అనంత జనశక్తి న్యూస్**

'సంసద్ చలో' మార్చ్‌లో ఉద్రిక్తతలపై సుప్రీంకోర్టు తాజాగా కీలక వ్యాఖ్యలు చేసింది. ఆందోళనల వేళ పోలీసులు, భద్రతా బలగాలు సంయమనం పాటించాలని స్పష్టం చేసింది. యువత రాళ్లు విసిరినా కఠినంగా వ్యవహరించవద్దని పేర్కొంది. కౌన్సెలింగ్ ఇచ్చి శాంతింపజేయడమే ప్రభుత్వాల బాధ్యత అని సుప్రీంకోర్టు పేర్కొంది. జులై 20న 'సంసద్ చలో' మార్చ్‌లో హింసను ప్రేరేపించిన నిర్వాహకులపై చర్యలు కోరుతూ దాఖలైన పిటిషన్‌పై విచారణ సందర్భంగా కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. పిటిషనర్లు తమ వాదన వినిపిస్తూ నిరసన సమయంలో హద్దుమీరిన వారిపై చర్యలు తీసుకోకపోతే ప్రమాదకరమై ఒరవడికి నాంది పలికినట్టు అవుతుందని హెచ్చరించారు. అయితే, నిరసనకారుల సమస్యను 'వినడమే' బలమైన ఆయుధమని సుప్రీం కోర్టు వ్యాఖ్యానించింది. ప్రభుత్వం వైపు నుంచి దూకుడు ప్రదర్శిస్తే సామాజికంగా హింస మరింత పెరుగుతుందని కూడా సీజేఐ ధర్మాసనం హెచ్చరించింది. దారి తప్పిన మూకలు రాళ్లు రువ్వినా యువతను శాంతింపజేయడానికే ప్రాధాన్యం ఇవ్వాలని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే తీవ్రమైన ప్రతిస్పందన సమాజంలో మంటలను మరింత పెంచుతుందని హెచ్చరించారు. అయితే, ఇటువంటి పరిస్థితులను ఎలా అదుపు చేయాలనే విషయంలో పోలీసులకే అనుభవం, అవగాహన ఉంటాయని కూడా ధర్మాసనం అభిప్రాయపడింది. శాంతియుత నిరసనలను ప్రోత్సహించాలని, పరిస్థితి చేయి దాటకుండా చూడాలని కూడా సర్వోతన్న న్యాయస్థానం సూచించింది. పిటిషనర్ల కేసును ఈ నిరసనలకు సంబంధించిన ఇతర పిటిషన్‌లతో ట్యాగ్ చేసింది.

# పక్క రాష్ట్రాల్లో చేసిన పూజలపై క్లారిటీ ఇవ్వాలి

(మొదటి పేజీ తరువాయి)

అనంతరం మీడియాతో మహేశ్‌కుమార్ గౌడ్ మాట్లాడారు. ''పక్క రాష్ట్రాల్లో చేసిన పూజలపై హరీశ్‌రావు క్లారిటీ ఇవ్వాలి. రాష్ట్రానికి మంచి జరగాలని కోరుకోకుండా క్షుద్ర పూజలు చేయడం శ్రేయస్కరం కాదు. నాకు ఇచ్చిన లీగల్ నోటీసులపై సరైన సమయంలో సమాధానం చెబుతా. రాష్ట్రాభివృద్ధి దృష్ట్యానే దీనిపై మాట్లాడుతున్నాం. నాకు ఎవరిపైనా వ్యక్తిగత కక్ష లేదు''అని మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు.

# రాష్ట్ర ప్రయోజనాలు కాపాడలేదు

(మొదటి పేజీ తరువాయి)

**"బీఆర్ఎస్ అధికారంలో ఉన్న ఏ రోజూ రాష్ట్ర ప్రయోజనాలు కాపాడలేదు. అధికారం కోల్పోవడంతో హరీశ్‌రావు ఆరోపణలు చేస్తున్నారు. ఏపీకి అమ్ముడుపోయి ఇప్పుడు విమర్శలు చేస్తున్నారు. కట్టుకథలతో ఆరోపణలు చేయడమే ఆయన పని. తెలంగాణ ప్రాజెక్టులకు అనుమతులు ఇవ్వకూడదని ఏపీ ప్రతిసారి కోరుతూ వచ్చింది. అనుమతులు వచ్చాక కూడా సమీక్షించాలని ప్రస్తావిస్తూనే ఉంది" అని ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు.**

# అర్హు లకు అన్యాయం జరగనివ్వం

(మొదటి పేజీ తరువాయి)

**డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో 22ఏ భూములు, ప్రజావాణి ఫిర్యాదులు, హైకోర్టు ఆదేశాలపై ఉన్నతాధికారులు, పలు జిల్లాల కలెక్టర్లతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వ హించారు. అర్హులైన వారి హక్కులను కాపాడుతూనే, ప్రభుత్వ భూములను కాపాడ డమనే రెండు లక్ష్యాలతో ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా అధికారు లకు మంత్రి పొంగులేటి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. 22ఏ భూములకు సంబంధించి హైకోర్టు నిర్దేశించిన 45 రోజుల గడువులోనే దరఖాస్తులను, ఫిర్యాదు లను పరిశీలించి తుది నిర్ణయం తీసుకోవాలి. ప్రజావాణిలో వచ్చిన 22ఏ దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించి, తక్షణమే విచారణ పూర్తి చేసి పరిష్కరించాలి. తహసీల్దార్, ఆర్డీవో, కలెక్టర్ల స్థాయిలో ప్రతీ కేసును రికార్డులు, చట్టపరమైన ఆధారాల బట్టి పరిశీలించాలి. తుది నిర్ణయం తీసుకునే అధికారం జిల్లా కలెక్టర్లకే ఉంటుంది. ప్రభుత్వ భూములపై అక్రమ రిజిస్ట్రేషన్లు, ఆక్రమణలు జరగకుండా అధికారులు wనిరంతరం అప్రమత్తంగా ఉండాలి. ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా అధికారులు పారదర్శకంగా వ్యవహరి స్తూ ప్రజల హక్కులను, ప్రభుత్వ ప్రయోజనాలను సమతుల్యం చేయాలని సూచించారు.**

# 'చట్టం'తో బీసీలకు రక్షణ

(మొదటి పేజీ తరువాయి)

బీసీ ముసాయిదా రక్షణ చట్టం జాతీయ బీసీ కమిషన్ దృష్టికి తీసుకెళతామని, అక్కడ అనుమతి రాగానే అసెంబ్లీలో ఆమోదానికి ప్రవేశపెడతామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో వీలైనంత త్వరగా బీసీ రక్షణ అమలయ్యేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. విజయవాడలోని ఓ హోటల్ లో బీసీ ముసాయిదా రక్షణ చట్టంపై రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత ఆధ్వర్యంలో బీసీ సామాజిక వర్గానికి చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలతో బుధవారం కీలక సమావేశం జరిగింది. సమావేశ అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రులు మాట్లాడారు. ముందుగా మంత్రి సవిత సవిత మాట్లాడుతూ, ఎన్నికల్లో హామీ ఇచ్చిన మేరకు బీసీ రక్షణ చట్టాన్ని కూటమి ప్రభుత్వం తీసుకొస్తోందన్నారు. బీసీలకు రాజకీయ, సామాజిక, ఆర్థిక గుర్తింపే సీఎం చంద్రబాబు లక్ష్యమన్నారు. బీసీలను వేధించినా, జాతి, కుల వృత్తుల పేరుతో దూషించినా బీసీ రక్షణ చట్టం కింద శిక్షార్హులున్నారు. బీసీ రక్షణ చట్టం కేసుల్లో సత్వర పరిష్కారానికి ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. దేశంలోనే మొట్ట మొదటి సారిగా ఏపీలోనే బీసీ రక్షణ చట్టాన్ని రూపొందిస్తున్నామన్నారు. సమావేశంలో ఇతర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అందజేసిన సలహాలు సూచనలను ఇప్పటికే రూపొందించిన బీసీ ముసాయిదా రక్షణ చట్టం బిల్లులో పొందుపరుస్తామన్నారు. త్వరలో జిల్లాల్లోనూ బీసీ సంఘాల ప్రతినిధుల అభిప్రాయాలను కూడా పరిగణలోకి తీసుకుంటామన్నారు. తుది నివేదికను త్వరలో జాతీయ బీసీ కమిషన్ కు అందజేస్తామన్నారు. బీసీ కమిషన్ నుంచి గ్రీన్ సిగ్నల్ రాగానే, అసెంబ్లీలో ఆమోదానికి బీసీ రక్షణ చట్టాన్ని సభలో ప్రవేశపెడతామన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రంలో బీసీ రక్షణ చట్టం అమలుకు కృషి చేస్తామని మంత్రి సవిత వెల్లడించారు. బీసీల అభ్యున్నతే లక్ష్యంగా అన్న ఎన్టీఆర్ టీడీపీని స్థాపించారన్నారు. సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్ సైతం బీసీలను అన్ని రంగాల్లో ముందంజలో ఉంచేలా వెన్నుదన్నుగా నిలుస్తున్నారన్నారు. బీసీలు సమాజానికి బ్యాక్ బోన్లు అని వ్యక్తులు సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి




నారా లోకేశ్ అని మంత్రి సవిత తెలిపారు. బీసీ రక్షణ చట్టంతో వెనుబడిన వర్గాలు గౌరవ ప్రదంగా సామాజిక జీవనం కొనసాగించేలా రక్షణ కల్పిస్తున్నామని, కులం, వృత్తుల పేరుతో దూషిస్తే కఠినంగా శిక్షించేలా చట్టం రూపొందిస్తున్నామని మంత్రులు ఎస్.సవిత, అచ్చెన్నాయుడు తెలిపారు. ఈ చట్టంపై మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీల అభిప్రాయాలు తీసుకున్నామని, త్వరలో జిల్లా స్థాయిలోనూ బీసీ సంఘాల ప్రతినిధుల నుంచి సలహాలు తీసుకుంటామని తెలిపారు. బీసీ ముసాయిదా రక్షణ చట్టం జాతీయ బీసీ కమిషన్ దృష్టికి తీసుకెళతామని, అక్కడ అనుమతి రాగానే అసెంబ్లీలో ఆమోదానికి ప్రవేశపెడతామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో వీలైనంత త్వరగా బీసీ రక్షణ అమలయ్యేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. విజయవాడలోని ఓ హోటల్ లో బీసీ ముసాయిదా రక్షణ చట్టంపై రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత ఆధ్వర్యంలో బీసీ సామాజిక వర్గానికి చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలతో బుధవారం కీలక సమావేశం జరిగింది. సమావేశ అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రులు మాట్లాడారు. ముందుగా మంత్రి సవిత సవిత మాట్లాడుతూ, ఎన్నికల్లో హామీ ఇచ్చిన మేరకు బీసీ రక్షణ చట్టాన్ని కూటమి ప్రభుత్వం తీసుకొస్తోందన్నారు. బీసీలకు రాజకీయ, సామాజిక, ఆర్థిక గుర్తింపే సీఎం చంద్రబాబు లక్ష్యమన్నారు. బీసీలను వేధించినా, జాతి, కుల వృత్తుల పేరుతో దూషించినా బీసీ రక్షణ చట్టం కింద శిక్షార్హులున్నారు. బీసీ రక్షణ చట్టం కేసుల్లో సత్వర పరిష్కారానికి ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. దేశంలోనే మొట్ట మొదటి సారిగా ఏపీలోనే బీసీ రక్షణ చట్టాన్ని రూపొందిస్తున్నామన్నారు. సమావేశంలో ఇతర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అందజేసిన సలహాలు సూచనలను ఇప్పటికే రూపొందించిన బీసీ ముసాయిదా రక్షణ చట్టం బిల్లులో పొందుపరుస్తామన్నారు. త్వరలో జిల్లాల్లోనూ బీసీ సంఘాల ప్రతినిధుల అభిప్రాయాలను కూడా పరిగణలోకి తీసుకుంటామన్నారు. తుది నివేదికను త్వరలో జాతీయ బీసీ కమిషన్ కు అందజేస్తామన్నారు. బీసీ కమిషన్ నుంచి గ్రీన్ సిగ్నల్ రాగానే, అసెంబ్లీలో ఆమోదానికి బీసీ రక్షణ చట్టాన్ని సభలో ప్రవేశపెడతామన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రంలో బీసీ రక్షణ చట్టం అమలుకు కృషి చేస్తామని మంత్రి సవిత వెల్లడించారు. బీసీల అభ్యున్నతే లక్ష్యంగా అన్న ఎన్టీఆర్ టీడీపీని స్థాపించారన్నారు. సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్ సైతం బీసీలను అన్ని రంగాల్లో ముందంజలో ఉంచేలా వెన్నుదన్నుగా నిలుస్తున్నారన్నారు. బీసీలు సమాజానికి బ్యాక్ బోన్లు అని వ్యక్తులు సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్ అని మంత్రి సవిత తెలిపారు.

**బీసీలను వేధించిన జగన్ : మంత్రి అచ్చెన్నాయుడు**

బీసీ రక్షణ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. టీడీపీ ఆవిర్భావం నుంచి బీసీలు అండగా ఉంటూ వస్తున్నారన్నారు. వారు కుల వివక్షకు గురికాకుండా ఉండాలని భావించి బీసీ రక్షణ చట్టానికి శ్రీకారం చుడుతున్నామన్నారు. దేశంలో ఎన్నో చట్టాలున్నా బీసీల రక్షణకు చట్టం లేదన్నారు. 201419 మధ్య జగన పాలనలో బీసీలు తీవ్ర అన్యాయానికి గురయ్యారన్నారు. మంత్రి నారా లోకేశ్ పాదయాత్ర సమయంలో బీసీలు తమ కష్టాలను ఆయన దృష్టికి తీసుకొచ్చారన్నారు. ఆనాడే బీసీ రక్షణ చట్టం తీసుకొస్తామని మంత్రి నారా లోకేశ్ ప్రకటించిన విషయాన్ని మంత్రి అచ్చెన్నాయుడు గుర్తుచేశారు. ఇచ్చిన మాటకు కట్టుబడుతూ బీసీ రక్షణచట్టాన్ని తీసుకొస్తున్నామన్నారు. రెండేళ్ల నుంచి బీసీ రక్షణ చట్టం గురించి చర్చిస్తూ వస్తున్నామన్నారు. శాసనసభలో డ్రాఫ్ట్ బిల్లు ఆమోదించే ముందే కేంద్ర జాతీయ బీసీ కమిషన్ సలహాలు కూడా తీసుకుంటామన్నారు. బీసీలకు రిజర్వేషన్లు కల్పించిన ఘనత అన్న ఎన్టీఆర్ దేనన్నారు. ఆ రిజర్వేషన్లను 27 శాతానికి సీఎం చంద్రబాబునాయుడు పెంచారన్నారు. ప్రభుత్వం మారాక గత ప్రభుత్వం లో బలహీన వర్గాలపై కక్ష కట్టి రిజర్వేషన్లు తగ్గించారని మండిపడ్డారు. న్యాయస్థానాలు చెప్పాయని బీసీ రిజర్వేషన్లను తగ్గించేశారని, కాని, హైకోర్టుకు వెళ్లి గత ప్రభుత్వం న్యాయపోరాటం చేయలేదని అన్నారు. కూటమి ప్రభుత్వం రాగానే, రాజీవ్ రంజన్ మిశ్రా నేతృత్వంలో డెడికేటెడ్ బీసీ కమిషన్ వేశామన్నారు. బీసీ రిజర్వేషన్లను 34 శాతానికి పెంచేలా కృషి చేస్తామని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. అంతకుముందు మంత్రి సవిత నేతృత్వంలో జరిగిన సమావేశంలో పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తమ అభిప్రాయాలను తెలియజేశారు. బీసీ రక్షణ చట్టం పటిష్టంగా ఉండేలా రూపొందించాలని సూచించారు. బీసీలను వృత్తులపరంగా, కులాల పరంగా దూషించుకుండా ఉండేలా చట్టం అమలు చేయడంతో పాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో మంత్రులు అనగాని సత్యప్రసాద్, కొలుసు పార్థసారథి, కొల్లు రవీంద్ర, కొండపల్లి శ్రీనివాస్, న్యాయ శాఖ మంత్రి ఎన్ ఎండీ ఫరూక్, ప్రభుత్వ విప్ లు కాల్వ శ్రీనివాసులు, బొమ్మిడి నాయకర్, పలువురు ఎమ్మెల్యేలు గుమ్మనూరు జయరాం, గల్లా మాధవి, కాగితపు కృష్ణప్రసాద్, పితాని సత్యనారాయణ, గౌతు శిరీషా, చదలవాడ అరవింద బాబు, కూన రవికుమార్, కందికుంట వెంకటప్రసాద్, బొగ్గు రమణమూర్తి, గొండు శంకర్, మామిడి గోవిందరావు సహా ఇతర ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కర్రి పద్మశ్రీ, గాదె శ్రీనివాసులు నాయుడు, బీద రవిచంద్రయాదవ్, రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి సత్యనారాయణ, డైరెక్టర్ మల్లికార్జున రావు, పలువురు న్యాయనిపుణులు, ఇతర అధికారులు పాల్గొన్నారు. వర్చువల్ లో మంత్రులు సత్యకుమార్ యాదవ్, అనిత, రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య, బీద మస్తాన్ రావు, ఎమ్మెల్యే లోకం నాగమాధవి పాల్గొని పలు సలహాలు సూచనలు అందజేశారు.

# ఒక్కో మనిషిపై ఉన్న అప్పు 2 లక్షలు

(మొదటి పేజీ తరువాయి)

ప్రగతి నివేదిక కాదది.. పూర్తిగా గతి తప్పిన నివేదిక అంటూ మండిపడ్డారు. నాలుగు సూత్రాల పాలన అపహాస్యం.. అభివృద్ధి బూటకం.. సంపద సృష్టి మోసం.. సమతుల్యత పచ్చి అబద్ధం.. సంక్షేమం టోకరా అంటూ విమర్శించారు. 'విధ్వంసం నుంచి మరింత అగాధంవైపు.. అధిక అప్పుల నుంచి ఇంకాస్త అంధకారం వైపు' ఇదే కూటమి ప్రభుత్వ రెండేళ్ల ప్రగతి నివేదిక అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు.
ఆంధ్రప్రదేశ్‌లో రెండేళ్ల కూటమి పాలన 24 మోసాలమయమన్నారు వైఎస్ షర్మిల. సూపర్ సిక్స్ సూపర్ ఫ్లాప్ అయ్యాయని.. ఎన్నికల హామీలకు పంగనామాలు పెట్టారని సెటైర్లు పేల్చారు. మ్యానిఫెస్టోకి మంగళం పాడారని.. అమలు చేశామని చెప్పే పథకాలు అరకొరగానే ఉన్నాయన్నారు. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను పక్కన బెట్టి, చెల్లని రూపాయితో చిల్లు రాజకీయం తప్పా రెండేళ్లుగా చంద్రబాబు ఉద్ధరించింది శూన్యం అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అందుకే బాబు షూరిటీ భవిష్యత్ కి లేదిక గ్యారెంటీ అంటూ ఎద్దేవా చేశారు. భరోసా పేరు చెప్పి సగానికి సగం పెన్షన్లలో కోతలు పెట్టారని విమర్శించారు షర్మిల. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు 50 ఏళ్లకే పెన్షన్ ఇస్తామని హామీ ఇచ్చి నెరవేర్చలేదన్నారు. 3 వేల నిరుద్యోగ భృతి, లేని పక్షంలో 20 లక్షల ఉద్యోగాలు అంటూ 50 లక్షల మంది నిరుద్యోగులను మోసం చేశారన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఆడబిడ్డకి నెలకు రూ.1500 ఇస్తామని 2 కోట్ల మంది మహిళలను నమ్మించి నయవంచన చేశారని ధ్వజమెత్తారు. దీపం పథకం రాష్ట్రంలోని సగం కుటుంబాలకే పరిమితం చేశారని.. గొప్పలు చెప్పుకుంటున్న సుఖీభవ పథకం కింద 40 లక్షల మంది రైతులకు టోకరా పెట్టారన్నారు. ఇచ్చేదాంట్లో కేంద్రంతో సంబంధం లేకుండా అని మాట మార్చి.. 20 వేలు ఇస్తామని PM కిసాన్ సమ్మాన్ నిధితో అన్యాయంగా లింక్ పెట్టారన్నారు. ఇంట్లో ఎంత మంది బిడ్డలుంటే అన్ని రూ.15 వేలు అని హామీ ఇచ్చి, 20 లక్షల మంది బిడ్డలకు దారుణ మోసం చేస్తున్నారన్నారు షర్మిల. ఇస్తున్న వారికి రూ.2 వేలు చొప్పున తగ్గించి ఎన్నికల్లో హామీని గాలిలో కలిపారన్నారు. ఆరోగ్యశ్రీకి 4 వేల కోట్లు, ఫీజు రీయింబర్స్ పథకానికి 10 వేల కోట్లు బకాయిలు పెట్టి, 6 వేల కోట్లు ఖర్చు చేశామని గొప్పలు చెప్పుకోవడం కూటమి సర్కారుకే చెల్లిందన్నారు. '32 వేల కోట్ల మేర సబ్సిడీలు విద్యుత్ కింద ప్రజలకు ఇస్తే మరి 15 వేల కోట్ల మేర ట్రూ అప్ భారాన్ని ఎందుకు మోపినట్లు ?. 12 వందల కోట్లు ధరల స్థిరీకరణ నిధి పెడితే, రాష్ట్ర రైతాంగం పండించిన పంటలను రూపాయికి అమ్ముకోలేక చెత్తకుప్పలో ఎందుకు పారబోసినట్లు ? 20 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి పరుగులు పెడితే, అభివృద్ధిలో అట్టడుగున, అప్పుల్లో ప్రథమ స్థానంలో ఎందుకున్నట్లు ? తలసరి ఆదాయం పెంచడం పక్కన పెడితే గత 12 ఏళ్లుగా టీడీపీ, వైఎ




స్సార్‌సీపీలు కలిసి ఒక్కో తలపై పెట్టిన అప్పు సరాసరి 2 లక్షలు. 202426 మధ్య ముఖ్యమంత్రి చంద్రబాబు సాధించిన ప్రగతి మళ్లీ అరచేతిలో వైకుంఠమే. పెట్టుబడుల పేరుతో జిమ్మిక్కులే. అమరావతి ముసుగులో మాయాజాలమే. అభివృద్ధి అజెండాతో మరో 3 లక్షల కోట్ల అప్పులే. ఎన్నికల హామీల పేరుతో మాటల గారడీలే. ఇదే కూటమి ప్రభుత్వ రెండేళ్ల అభివృద్ధి శ్వేతపత్రం' అంటూ షర్మిల ట్వీట్ చేశారు.

# సమ్మక్క సాగర్ ప్రాజెక్టుపై కుట్ర జరుగుతోంది

**హైదరాబాద్, ఆగస్టు 05, అనంతజనశక్తి న్యూస్**

ప్రాజెక్టులకు అన్ని రకాల అనుమతులు లభించిన తర్వాత వాటిని సమీక్షించి రద్దు చేసిన చరిత్ర దేశంలో ఎక్కడా లేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత తన్నీరు హరీశ్ రావు వ్యాఖ్యానించారు. కేసీఆర్ హయాంలో సాధించిన తెలంగాణ ప్రాజెక్టుల అనుమతులను రద్దు చేసే దిశగా గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు అజెండా రూపొందుతుంటే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దానికి పరోక్షంగా సహకరిస్తున్నారని ఆరోపించారు. ఒక ఉద్యమకారుడిగా ఈ పరిణామాలను చూస్తుంటే తనకు కడుపు రగులుతోందని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం 2022 ఆగస్టు 25న ఎంతో కష్టపడి సమ్మక్క సాగర్ ప్రాజెక్టుకు అనుమతులు సాధించిందని హరీశ్ రావు గుర్తుచేశారు. అయితే ఇప్పుడు ఆ సమ్మక్క సాగర్ ప్రాజెక్టుకు ఉరి వేసేందుకు పెద్ద ఎత్తున కుట్ర జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. కర్ణాటకలో ముగ్గురు ముఖ్యమంత్రుల భేటీ సందర్భంగా 47 టీఎంసీల సమ్మక్క సాగర్ ప్రాజెక్టును వదులుకోవాలని ఆంధ్రప్రదేశ్ కోరగా, తెలంగాణ ప్రభుత్వం దానికి అంగీకరించిందన్నారు. సమ్మక్క సాగర్ ప్రాజెక్టు నీళ్లు వాస్తవానికి ప్రస్తుత ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సొంత నియోజకవర్గమైన హుజూర్ నగర్‌కు వెళ్తాయని, అయినా కూడా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. తాము ఈ అంశాన్ని లేవనెత్తిన రెండు రోజులకే మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కేంద్రానికి లేఖ రాయడం వారి దివాలాకోరుతనానికి నిదర్శనమని ఎద్దేవా చేశారు.
తెలంగాణ ప్రాజెక్టులకు సంబంధించిన ఏడు అనుమతులను రివ్యూ చేస్తామని కేంద్రం చెబుతున్నప్పటికీ బీజేపీ నేతలు ఏమాత్రం స్పందించకపోవడాన్ని హరీశ్‌రావు తప్పుబట్టారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి భయపడి కేంద్ర మంత్రులు





పెదవులు మూసుకుంటున్నారని, దీనిపై బీజేపీ వెంటనే స్పందించకపోతే తెలంగాణ ప్రయోజనాల కోసం మరో ఉద్యమానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. తెలంగాణలో ప్రస్తుతం చంద్రబాబు బంటు ముఖ్యమంత్రిగా ఉన్నారు కాబట్టే జీఆర్ఎంబీ అజెండాలో ఇలాంటి ప్రతిపాదనలు వస్తున్నాయని, ఒకవేళ కేసీఆర్ సీఎంగా ఉంటే ఆంధ్రప్రదేశ్ లేదా కేంద్రానికి ఇంత ధైర్యం వచ్చేదా అని ప్రశ్నించారు. ఏపీ మూలాలు ఉన్న అధికారులు తెలంగాణ ఇరిగేషన్ శాఖలో బాధ్యతలు వహిస్తుండటం వల్లే ఇలా జరుగుతోందని ఆరోపించారు. జీఆర్ఎంబీ సమావేశ అజెండా నుంచి గోదావరి, బనకచర్ల అంశాలను తొలగించాలని, ఈ అజెండాను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై పార్లమెంట్ లో ఉన్న కాంగ్రెస్ ఎంపీలు గళం విప్పాలని కోరారు. ఇరిగేషన్ విషయంలో ప్రభుత్వం రిట్, సూట్ పిటిషన్ల పేరుతో ఏడాది కాలంగా సమయం వృథా చేసిందని విమర్శించారు. రేవంత్ రెడ్డి లోపాయికారీ ఒప్పందాలతో గోదావరి, బనకచర్ల ప్రాజెక్టులకు ఒప్పుకున్నారని ఆరోపించారు. గోదావరి జలాల్లో తెలంగాణకు చట్టబద్ధంగా 960 టీఎంసీల నీటి కేటాయింపులు ఉన్నప్పటికీ, రాష్ట్ర హక్కులు కాలరాస్తుంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చూస్తూ బొమ్మలాగా కూర్చున్నారని హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు.
తెలంగాణ ప్రాజెక్టులను వ్యతిరేకించడం లేదని ఏపీ ముఖ్యమంత్రి చెబుతున్నారని, కానీ ఇటీవల తెలంగాణ ప్రాజెక్టులను అడ్డుకోవాలని కేంద్రానికి ఏపీ ప్రభుత్వం లేఖ రాసిందని హరీశ్ తెలిపారు. తెలంగాణ నీటి ప్రయోజనాలను ఏపీకి తాకట్టు పెడుతున్నారా అని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటివరకు ఒక్క ప్రాజెక్టుకు కూడా అనుమతులు తీసుకురాలేదని హరీశ్ రావు విమర్శలు గుప్పించారు.
తెలంగాణకు తాగు, సాగునీరు దూరం చేసే కుట్ర జరుగుతోందని హరీశ్ ఆరోపించారు. రాష్ట్రానికి ద్రోహం జరుగుతుంటే ముఖ్యమంత్రి రేవంత్ ఎందుకు మౌనంగా ఉన్నారని నిలదీశారు. గురు దక్షిణ చెల్లించడం కోసం రేవంత్ మౌనంగా ఉన్నారా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో చేతగాని ప్రభుత్వం ఉందని విమర్శించారు. నీటి విషయంలో అన్యాయం జరిగితే తెలంగాణ ఊరుకోదని హెచ్చరించారు. కాళేశ్వరం అనుమతులు రద్దు చేయడమంటే సగం తెలంగాణకు అన్యాయం చేయడమే అని వ్యాఖ్యానించారు.
కాంగ్రెస్ పాలనలో కృష్ణా జలాలను కూడా సరిగా వాడటం లేదని మాజీ మంత్రి విమర్శించారు. గోదావరిపై ఉన్న నీళ్లను ఎత్తిపోయడం లేదన్నారు. తెచ్చిన అనుమతులు కూడా ఇప్పుడు రద్దయ్యే ప్రమాదం ఉందని తెలిపారు. సమ్మక్క బ్యారేజీకి అనుమతి ఇవ్వొద్దని ఏపీ చెబితే GRMBలో పెట్టారని మండిపడ్డారు. బనకచర్ల, మల్లన్నసాగర్ కడతారు కానీ.. సమ్మక్క బ్యారేజీ ఎందుకు వద్దని హరీశ్ రావు ప్రశ్నించారు.

# ప్రపంచ డిజిటల్ ఎకానమీలో.. యువత భాగస్వామ్యం కావాలి

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ), డిజిటల్ సేవలు, సాంకేతికత ఆధారిత ఆవిష్కరణలకు ప్రపంచ కేంద్రంగా విశాఖపట్నం ఆవిర్భవించడాన్ని ఐబీఎం ఫ్యూచర్‌నౌ సెంటర్ తోడ్పాటును అందిస్తోందన్నారు.
సాంకేతిక పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు నాణ్యమైన ఉపాధిని సృష్టించడం, భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న ప్రతిభను అభివృద్ధి చేయడం, ఏపీ యువత ప్రపంచ డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో భాగమయ్యేలా చేసే ఒక సంపూర్ణ పర్యావరణ వ్యవస్థను నిర్మించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రి అన్నారు. ఆంధ్రప్రదేశ్ పట్ల ఐబీఎం చూపుతున్న నిరంతర నిబద్ధతను స్వాగతిస్తున్నామని చెప్పారు. ఏఐ, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ కోసం విశాఖపట్నాన్ని భారతదేశంలోని అగ్రగామి కేంద్రాలలో ఒకటిగా తీర్చిదిద్దడానికి ఐబీఎంతో కలిసి పనిచేయడానికి ఎదురు చూస్తున్నామని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు.
ఏఐ, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ ప్రాజెక్టులకు మద్దతుగా.. ప్రపంచవ్యాప్తంగా కన్సల్టింగ్ సేవలు, ఏఐ(AI) ఫస్ట్ ట్రాన్స్‌ఫర్మేషన్ ప్రాజెక్టులకు మద్దతుగా ఐబీఎం కన్సల్టింగ్ ఫ్యూచర్‌నౌ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. భారతదేశ సాంకేతిక ఆవిష్కరణలు, ప్రతిభావంతులైన మానవ వనరుల అభివృద్ధిపై సంస్థ కొనసాగిస్తున్న పెట్టుబడులకు ఇది మరో కీలక ముందడుగు కానుంది. ఈ సెంటర్ ద్వారా ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఖాతాదారులకు కన్సల్టింగ్, సాంకేతిక సేవలను అందించనుంది. ఇందులో కృత్రిమ మేధస్సు (AI), హైబ్రిడ్ క్లౌడ్, సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్, డేటా అండ్ అనలిటిక్స్, సైబర్ సెక్యూరిటీ, ఎంటర్‌ప్రైజ్ ట్రాన్స్‌ఫర్మేషన్ వంటి కీలక రంగాల్లో సేవలు అందించనున్నారు. అదేవిధంగా ఏఐ ఆధారిత క్లౌడ్ ట్రాన్స్‌ఫర్మేషన్, ప్లాట్‌ఫార్మ్ ఇంజనీరింగ్, సర్వీస్ ఇంటిగ్రేషన్, క్వాలిటీ ఇంజనీరింగ్, యూజర్ ఎక్స్‌పీరియన్స్ సేవలకు ఐబీఎం కన్సల్టింగ్ ఫ్యూచర్‌నౌ సెంటర్ ప్రధాన కేంద్రంగా పనిచేయనుంది.



అనంత జనశక్తి
జనం కోసమే మా అక్షరం


# డీలిమిటేషన్, మహిళా బిల్లుల కోసం పార్లమెంటు ప్రత్యేక సెషన్!



ప్రస్తుతం కొనసాగుతున్న పార్లమెంట్ వర్షా కాల సమావేశాలు ఆగస్టు 13న ముగియనున్నాయి. ఈ నేపథ్యంలో నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ సవరణ బిల్లుల ఆమోదం కోసం ఆగస్టు 16 నుంచి మూడు రోజుల పాటు ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలని కేంద్రం భావిస్తున్నట్లు సమాచారం. అయితే, ప్రస్తుత సమావేశాలు ముగిసిన తర్వాత పార్లమెంట్‌ను నిరవధికంగా వాయిదా వేయకపోవచ్చని అధికారిక వర్గాలు పేర్కొంటున్నాయి. అయితే, దీనిపై ఇంకా అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

ప్రతిపాదిత సవరణలు ఆమోదం పొందేందుకు అవసరమైన మూడింట రెండు వంతుల మెజారిటీని సాధించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని అధికారిక వర్గాలు పేర్కొన్నాయి. అవసరమైన సంఖ్యా బలం సమకూరిన తర్వాత ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసే అవకాశం ఉందని తెలిపాయి.

**రిజిజు అభ్యర్థనకు రాహుల్ నిరాకరణ**

పార్లమెంట్ వర్షా కాల సమావేశాల్లో ప్రతిష్టంభన కొనసాగుతోంది. బుధవారం ప్రతిపక్షాల నినాదాల మధ్య లోక్‌సభ ప్రారంభమైన కొన్ని నిమిషాలకే వాయిదా పడింది. దీంతో పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ని ఆయన ఛాంబర్‌లో కలిశారు. డీలిమిటేషన్ బిల్లు, మహిళా రిజర్వేషన్ సవరణ బిల్లులకు సహకరించాలని కోరారు. అయితే, కేంద్రమంత్రి అభ్యర్థనను కాంగ్రెస్ ఎంపీ తిరస్కరించారు.

అయోధ్య రామ మందిరంలో విరాళాల చోరీ, సీజేపీ నిరసనల్లో విద్యార్థులపై పోలీసుల దుశ్చర్యలపై హోంమంత్రి అమిత్ షా ప్రకటన వెలువడే వరకు సభలో ఎలాంటి కార్యకలాపాలు జరగబోవని రాహుల్ స్పష్టం చేశారు. దీంతో పార్లమెంట్ ప్రతిష్టంభనపై చర్చించేందుకు కిరణ్ రిజిజు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, హోం మంత్రి అమిత్ షాతో సమావేశమైనట్లు సమాచారం.

# వాహనంలో కూర్చున్న ఏ వ్యక్తికైనా బీమా చెల్లించాల్సిందే

- బీమాలేని వాహనాలకు ఇంధనం విక్రయించొద్దు
- కొత్త కార్లకు 4, ద్విచక్ర వాహనాలకు 6 ఏళ్లపాటు థర్డ్‌పార్టీ ఇన్సూరెన్స్ కొనుగోలు తప్పనిసరి చేయాలి
- సుప్రీంకోర్టు స్పష్టీకరణ



రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు వాహనంలో కూర్చున్న ఏ వ్యక్తికైనా బీమా కంపెనీలు కాంప్రహెన్సివ్/ప్యాకేజ్ పాలసీ కింద పరిహారం చెల్లించాల్సిందేనని సుప్రీంకోర్టు స్పష్టంచేసింది. మోటారు వాహన ప్రమాదాల పరిహారానికి సంబంధించిన విషయాల్లో కోర్టులు అతి సాంకేతికత దృక్పథాన్ని (హైపర్ టెక్నికల్ అప్రోచ్) అనుసరించకూడదని నిర్దేశించింది. 1996 జులై 13న ప్రకాశం జిల్లా సింగరాయకొండ దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన చిత్తూరు జిల్లాకు చెందిన టి.రాము అనే వ్యక్తి కుటుంబసభ్యులకు పరిహారం చెల్లించే విషయమై మంగళవారం వెలువరించిన తీర్పులో జస్టిస్ సంజయ్‌కరోల్, జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రల ధర్మాసనం ఈ మేరకు పేర్కొంది.

దేశంలో పెద్ద సంఖ్యలో వాహనాలు థర్డ్‌పార్టీ ఇన్సూరెన్స్ లేకుండానే పరుగులు తీస్తున్నందున.. రిజిస్ట్రేషన్ సమయంలోనే కొత్తకార్లకు నాలుగేళ్లు, ద్విచక్ర వాహనాలకు ఆరేళ్లపాటు థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ తప్పనిసరిగా కొనుగోలుచేసేలా ఉత్తర్వులు జారీచేయాలని పేర్కొంది. బీమా అమల్లో ఉన్న వాహనాలకే ఇంధనం సరఫరా జరిగేలా ఐఆర్‌డీఏ పైలట్ ప్రాజెక్టును అమలుచేయాలని, కేంద్ర రహదారి రవాణా శాఖతో సంప్రదించి దీనిపై చర్యలు చేపట్టాలని సూచించింది. బీమా తీసుకునేంత వరకూ వాహనాలకు ఇంధన సరఫరా జరగకుండా చూడాలని ఆదేశించింది. మారుతి 800 కారును వెనుక నుంచి వచ్చిన లారీ బలంగా ఢీ కొనడంతో అందులో ప్రయాణిస్తున్న రాము తీవ్రంగా గాయపడి తర్వాత చికిత్స పొందుతూ మరణించారు. కుటుంబానికి ఆధారమైన వ్యక్తిని కోల్పోయినందుకు బీమా కంపెనీ నుంచి రూ.10 లక్షల పరిహారం ఇప్పించాలని కోరుతూ అతని కుటుంబసభ్యులు మోటారు వాహనాల చట్టం సెక్షన్ 166 కింద ట్రైబ్యునల్‌ను ఆశ్రయించారు.

అయితే వాహనానికి తప్పితే, వాహన యజమానికి సంబంధించిన వ్యక్తిగత రిస్క్‌ని కవర్ చేయడానికి ఎలాంటి అదనపు బీమా ప్రీమియం చెల్లించనందున పరిహారం కోరే అర్హత కుటుంబసభ్యులకు లేదంటూ ట్రైబ్యునల్ 2009లో తీర్పు వెలువరించింది. దాన్ని సవాల్‌చేస్తూ బాధితులు ఉమ్మడి హైకోర్టును ఆశ్రయించగా 2012లో వారికి అనుకూలంగా తీర్పు వెలువడింది. మృతుడి ఆదాయానికి సంబంధించిన సాక్ష్యాధారాలు లేకపోవడంతో కోర్టు అతని నెలవారీ ఆదాయాన్ని నోషనల్‌గా రూ.4,500గా లెక్కించి 7.5% వడ్డీతో రూ.10,00,500 పరిహారం చెల్లించాలని బీమా కంపెనీని ఆదేశించింది. ఆ కారుకు కాంప్రహెన్సివ్ బీమా పాలసీ ఉందని, అందులో ప్రయాణికుడిలా పయనిస్తున్న దాని యజమానికి జరిగే నష్టానికి కూడా అది వర్తిస్తుందని పేర్కొంది.

ఆ తీర్పును సవాల్‌చేస్తూ నేషనల్ ఇన్సూరెన్స్ కంపెనీ సుప్రీంకోర్టును ఆశ్రయించగా.. హైకోర్టు ఇచ్చిన తీర్పునే సర్వోన్నత న్యాయస్థానం సమర్థిస్తూ బాధిత కుటుంబానికి పరిహారం చెల్లించాల్సిందేనని స్పష్టం చేసింది. వాహన బీమాకు సంబంధించి తాము జారీ చేసిన ఆదేశాల అమలుపై అన్ని భాగస్వామ్యపక్షాలూ ఈ నెల 14 లోపు సమాధానం దాఖలుచేయాలని ధర్మాసనం స్పష్టంచేసింది. ఈ సందర్భంగా వాహన బీమాకు సంబంధించి ధర్మాసనం కొన్ని ఆదేశాలు జారీచేసింది.

బీమా లేని వాహనాలకు ఆటోమేటిక్‌గా ఈచలానాలు జారీచేయడానికి వీలుగా ఆటోమేటిక్ నంబర్ ప్లేట్ రికగ్నిషన్ (ఏఎన్‌పీఆర్) కెమెరాలను ఇన్సూరెన్స్ ఇన్ఫర్మేషన్ బ్యూరో, వాహన్ పోర్టల్‌తో అనుసంధానం చేయాలి. రియల్‌టైం ఇన్సూరెన్స్ స్టేటస్‌ను గుర్తించడానికి పోలీసులకు చేతిలో ఇమిడిపోయే పరికరాలు/యాప్‌లు సమకూర్చాలి.

బీమాలేని వాహనం ఉపయోగించేవారిపై మోటార్ వాహన చట్టం 1988లోని సెక్షన్ 196 కింద కఠిన చర్యలు తీసుకోవాలి. ప్రైవేటు వాహనాలకు నాలుగు అంచెల బీమా విధానాన్ని అమలుచేయాలి. అందులో థర్డ్‌పార్టీ బీమా తప్పనిసరిగా అమలుచేయాలి. వాహనంలో కూర్చున్నవారు/పిలియన్ రైడర్స్‌కి పరిహార కవరేజి. యజమాని/డ్రైవర్/కూర్చున్నవారికి వ్యక్తిగత ప్రమాద కవరేజి.

బీమా చేసిన వాహనానికి అయ్యే నష్టాన్ని భర్తీచేసే కవరేజీలను ఆప్షనల్‌గా అమలుచేయాలి. వినియోగదారుడు బీమా కొనుగోలుచేసేటప్పుడు ఈ ఆప్షన్లతోకూడిన ఫామ్ అందించి వారు ఎంచుకున్న ఆప్షన్ల ఆధారంగా కవరేజి కల్పించాలి. ఒకవేళ ఇందులో ఇంకా ఏమైనా మార్పులు, చేర్పులు చేయాలనుకుంటే ఐఆర్‌డీఏ ఆ మేరకు నిర్ణయం తీసుకోవచ్చు.

పైన పేర్కొన్న ఆప్షనల్ కవరేజి కోసం అమలుచేసే పాలసీలు అన్నింటిలో ఒకేతరహా పదజాలం ఉండేలా ఐఆర్‌డీఏ చర్యలు తీసుకోవాలి.

ఈ ఆప్షన్ల గురించి స్పష్టంగా తెలిసేలా వినియోగదారులకు ఐఆర్‌డీఏ సమాచార పత్రం అందించాలి. అందులో ఏవి తప్పనిసరి, ఏవి ఐచ్ఛికమో చెప్పాలి. మోటారువాహన బీమా విక్రయాల్లో ఈ నాలుగు ఆప్షన్లు తప్పనిసరిగా ఉండేలా చూడాలి.

ప్రయాణించే, వస్తువులు రవాణా చేసే వాహనాలకు బీమా ఉందో లేదోనని తనిఖీ చేసుకునే అవకాశాన్ని ప్రజలకు కల్పించాలి. ఈ ఆదేశాల అమలుపై అన్ని భాగస్వామ్యపక్షాలూ ఈ నెల 14వ తేదీలోపు సమాధానం దాఖలుచేయాలని ఈ సందర్భంగా ధర్మాసనం ఆదేశించింది.

# సైబర్ మోసాల కట్టడికి 4 వారాల్లో నిబంధనలు

- మ్యూల్ ఖాతాలపై చర్యలకూ ప్రామాణిక మార్గదర్శకాలు రూపొందించండి
- ఆర్బీఐకి సుప్రీంకోర్టు దిశానిర్దేశం



ప్రజలను నిట్టనిలువునా ముంచేస్తోన్న డిజిటల్/సైబర్ మోసాలను అరికట్టేలా అధికార యంత్రాంగాలను క్రియాశీలం చేస్తూ దేశమంతటికీ వర్తించే ఆదేశాలను సుప్రీంకోర్టు మంగళవారం జారీ చేసింది. ఈ మోసాలకు ప్రధాన కారణమవుతున్న బ్యాంకు ఖాతాలు, మ్యూల్ ఖాతాలపై తీసుకోవాల్సిన చర్యలకు సంబంధించి ప్రామాణిక నిబంధనలను నాలుగు వారాల్లోగా సిద్ధంచేసి సర్క్యులేట్ చేయాలని భారతీయ రిజర్వు బ్యాంకు(ఆర్బీఐ)కు స్పష్టం చేసింది. అన్ని రాష్ట్రాల హైకోర్టుల రిజిస్ట్రార్స్ జనరల్‌కు ప్రామాణిక నిబంధనల తుది ప్రతిని పంపించాలని తెలిపింది.

ఆర్థిక మోసాలతో ముడిపడిన సైబర్ నేరాలపై సత్వరమే స్పందించి గట్టి చర్యలు తీసుకునేలా ఆయా యంత్రాంగాలను బలోపేతం చేయాలనీ సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చి, జస్టిస్ వి.మోహన ధర్మాసనం పేర్కొంది. ఈ కేసులపై దర్యాప్తు సంస్థలు, రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ప్రభుత్వ విభాగాలూ చురుగ్గా వ్యవహరించడంతో పాటు బాధితులకు న్యాయంచేయాలని, వారు కోల్పోయిన డబ్బును తిరిగి వచ్చేలా చేయాలనీ తెలిపింది. సుప్రీంకోర్టు సుమోటోగా చేపట్టిన 'డిజిటల్ అరెస్టులు, నకిలీ పత్రాల బాధితులు' కేసు విచారణలో భాగంగా ధర్మాసనం ఈ మధ్యంతర ఉత్తర్వులిచ్చింది. కేంద్ర ప్రభుత్వం తరఫున అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి సమర్పించిన స్థాయీ నివేదికలపై సంతృప్తి వ్యక్తం చేసింది. సైబర్‌నేరాల కట్టడి చర్యల్లో పురోగతి ప్రశంసనీయమని తెలిపింది. సైబర్ నేరాల కట్టడి యంత్రాంగాల పరిధిని విస్తృతం చేయాలని, వాటి వేగాన్ని పెంచడంతో పాటు నిరంతర అనుశీలన అవసరమనీ సూచించింది.

కేంద్ర హోంశాఖ పరిధిలో 'నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్'ను అందుబాటులోకి తీసుకొచ్చి 'గ్రీవెన్స్ రిడ్రెస్సల్ మాడ్యూల్', 'మనీ రెస్టోరేషన్ మాడ్యూల్'ను ఏర్పాటు చేయాలని ధర్మాసనం తెలిపింది. వీటి గురించి ప్రజలకు తెలిసేలా ప్రచారం చేయాలని పేర్కొంది. తద్వారా బాధితులు సత్వర న్యాయంపొందేలా చూడాలని పేర్కొంది. స్టేట్ సైబర్ కోఆర్డినేషన్ సెంటర్స్ ఏర్పాటు, ఈజీరో ఎఫ్ఐఆర్‌ల నమోదు విషయంలో 18రాష్ట్రాలు మాత్రమే చర్యలు తీసుకున్నాయని ధర్మాసనం పేర్కొంది.

# అనలాగ్ పనీర్‌పై మహారాష్ట్రలో నిషేధం..



- ఎలా తయారు చేస్తారో తెలుసా?

అనలాగ్ పనీర్‌తయారీ, విక్రయాలపై మహారాష్ట్ర ప్రభుత్వం నిషేధం విధించింది. ఈ నిషేధాజ్ఞలను ఉల్లంఘిస్తే.. ఆరు నెలల జైలు, రూ.లక్ష జరిమానా విధించనుంది. ఈ పనీర్ తినడం వల్ల మరణం సంభవిస్తే.. శిక్ష తీవ్రత పెరుగుతుందని వెల్లడించింది. యావజ్జీవ కారాగారశిక్ష, రూ.10 లక్షల జరిమానా ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపింది. కల్తీపాల ఉత్పత్తుల అమ్మకాలను అరికట్టడమే లక్ష్యంగా ఆహార భద్రతా సంస్థ ఈ ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఛత్తీస్‌గఢ్ తర్వాత అనలాగ్ పనీర్‌పై ఈ ఆంక్షలు విధించిన రెండో రాష్ట్రంగా మహారాష్ట్ర నిలిచింది. ఈ నిషేధం వార్తతో అసలు పనీర్, అనలాగ్ పనీర్‌కు మధ్య తేడా ఏంటని నెటిజన్లు చర్చిస్తున్నారు. తయారీలో వాడే వస్తువుల ఆధారంగా సాధారణ పనీర్‌తో పోలిస్తే ఇది చౌకగా లభిస్తుంది. ఇందులో పాలను ఉపయోగించరు. పామాయిల్ వంటి వెజిటేబుల్ ఆయిల్‌ను ఉపయోగిస్తారు. దాంతో పాటు స్టార్చ్, పాలపొడిని వాడుతుంటారు. చూడటానికి అసలు పనీర్‌వలే కనిపించినప్పటికీ.. దాంతో పోలిస్తే సగం ధరకే దొరుకుతుంది. దీనిగురించి వినియోగదారులకు సరైన సమాచారం ఇవ్వకుండా అసలైన పాల ఉత్పత్తి లాగే అనలాగ్ పనీర్‌ను విక్రయిస్తుండటంపై అధికారులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే మహారాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఈ పరిణామాలతో నకిలీ పనీర్‌పై నెట్టింట ఆందోళన వ్యక్తమవుతోంది. మరి దాన్ని గుర్తించడమెలా..?

మొత్తంగా ఒకే రంగులో కాకుండా వివిధ రంగుల్లో ఉంటే స్వచ్ఛమైంది కాదని అర్థం. ముదురు పసుపు రంగులో ఉన్నా అనుమానించాల్సిందే. ఒక పనీర్ ముక్కను నలిపిచూస్తే.. కొద్దిగా మెత్తగా తగులుతుంది. రబ్బర్‌లా సాగిందంటే స్వచ్ఛత లేనట్లే.

స్వచ్ఛమైనదానికి కొద్దిగా పాల మిఠాయి వాసన వస్తుంది. అలా కాకుండా పుల్లటి వాసన వస్తే ఆలోచించాలి. పనీర్ ముక్కను నీళ్ల గ్లాసులో వేస్తే.. మునిగి, చెక్కుచెదరకుండా ఉండాలి. కల్తీది అయితే కరిగిపోతుంది లేదా విరుగుతుంది. పెనం మీద వేడి చేసినప్పుడు అసలైనది ఆకారం మారదు. కొద్దిగా తేమ బయటకు వస్తుంది. కల్తీ పనీర్ అయితే వేడిచేయగానే కరిగిపోతుంది. ఎక్కువ మొత్తంలో నీరు బయటకు వస్తుంది.

తక్కువ ధరకు లభించే పనీర్ ఉత్పత్తుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, సాధ్యమైనంత వరకు ఇంట్లో తయారు చేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

## ఈ20పై మోదీ నివాసానికి కేజ్రీవాల్ పాదయాత్ర



ప్రధానమంత్రి నరేంద్రమోదీ నివాసం వైపు ప్రదర్శనగా బయల్దేరిన ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌తో పాటు మరో 100 మందిని ఢిల్లీ పోలీసులు మంగళవారం మార్గమధ్యంలోనే అడ్డుకున్నారు. దీంతో వారు ఫిరోజ్ షా రోడ్డులో బైఠాయించి నిరసనకు దిగారు. ఢిల్లీ మాజీ ఉపముఖ్యమంత్రి మనీశ్ సిసోదియా, ఆప్ ఎంపీ సంజయ్ సింగ్ తదితరులు దీనిలో పాల్గొన్నారు. ఈ20 ఇంధనానికి వ్యతిరేకంగా ప్రజల నుంచి 2.30 లక్షల పిటిషన్లను ఆప్ సేకరించింది. ఇథనాల్ కలిపిన ఇంధనానికి వ్యతిరేకంగా ప్రజలను కేజ్రీవాల్ తప్పుదోవ పట్టిస్తూ, రైతుల ప్రయోజనాలకు వ్యతిరేకంగా పనిచేస్తున్నారని భాజపా ఆరోపించింది.

## తీవ్ర వేదనలో దేశ విద్యార్థులు




దేశంలోని విద్యార్థులంతా తీవ్ర వేదనలో ఉన్నారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. వారికి ఉపాధి కరవైందని, పరీక్షల్లో నిష్పాక్షికతను, సక్రమం గా పనిచేసే విద్యా వ్యవస్థను కోరుకుంటున్నారని తెలిపారు. 'విద్యార్థులను క్షమిస్తున్నానని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొంటున్నారు.. నన్ను కానీ విద్యార్థులను కానీ క్షమించడానికి ఆయనెవరు? నాకు అర్థం కావడంలేదు. నన్ను, దేశ భవిష్యత్తు(విద్యార్థులు)ను క్షమించగలననే ఆలోచన ఆయనకు ఎక్కడ నుంచి వచ్చిందో?"అని రాహుల్ పేర్కొన్నారు. విద్యార్థులకు వ్యతిరేకంగా కేంద్రం పాల్పడిన తప్పులకు ప్రధాని క్షమాపణలు కోరాలని సూచించారు. ఢిల్లీలో మంగళవారం జరిగిన మాజీ ఎంపీ వైగో రాసిన 'వైగో ఇన్ పార్లమెంటు' పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు.

## ఒక్కసారిగా 300 అడుగుల కిందకు!




థాయ్‌లాండ్‌లోని ఫుకెట్ నుంచి ఢిల్లీ వస్తున్న ఎయిరిండియా విమానం మార్గమధ్యంలో తీవ్ర కుదుపులకు లోనైంది. అది ఒక్కసారిగా 300 అడుగుల ఎత్తును కోల్పోయింది. ఈ ఘటనలో 15 మంది గాయపడ్డారు. అందులో సిబ్బంది ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనపై డైరెక్టరేట్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) విచారణకు ఆదేశించింది. ఫుకెట్ నుంచి ఏ320 విమానం 134 మంది ప్రయాణికులు, 8 మంది సిబ్బందితో మంగళవారం ఉదయం బయలుదేరింది. మార్గమధ్యంలో కుదుపుల కారణంగా 11 మంది ప్రయాణికులు, నలుగురు సిబ్బంది గాయపడ్డారు. ఉదయం 11.30 గంటల సమయంలో విమానం ఢిల్లీలో సురక్షితంగా దిగింది. గాయపడిన వారిని వెంటనే ఆసుపత్రులకు తరలించారు.

## మహిళలను తిట్టకుండా.. రాజకీయాల్లో నిలబడి చూపించండి: ఖుష్బూ



నటి త్రిషపై డీఎంకే నేత ఉదయనిధి స్టాలిన్ చేసిన వ్యాఖ్యలు తమిళనాట తీవ్ర రాజకీయ దుమారం రేపాయి. ఉదయనిధి వ్యాఖ్యలపై నటి, భాజపా నాయకురాలు ఖుష్బూ మరోసారి మండిపడ్డారు. ధైర్యముంటే మహిళలను తిట్టకుండా రాజకీయం చేయాలంటూ సవాల్ విసిరారు. తాజాగా ఓ ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె ఈ అంశంతో పాటు త్రిషతో తనకున్న అనుబంధాన్ని పంచుకున్నారు. ఉదయనిధి వ్యాఖ్యలు మహిళలపై ఆయనకు ఉన్నద్వేషాన్ని తెలియచేస్తున్నాయన్న ఖుష్బూ దుయ్యబట్టారు. ఒక నాయకుడిగా ఆయన దీనికి సిగ్గుపడాలని విమర్శించారు. ''ఒక బహిరంగ వేదికపై మహిళను దూషించే జన్మహక్కు మీకు ఎవరు ఇచ్చారు? ఇది కేవలం ఉదయనిధి స్టాలిన్ విషయంలోనే కాదు.. ఇతర రాజకీయ పార్టీలలోనూ జరుగుతోంది. మీ రాజకీయ ప్రయోజనాల కోసం ఇంకెన్నాళ్లు మహిళలను నిందిస్తారు? మీ స్వార్థ ప్రయోజనాల కోసం మహిళను అడ్డుపెట్టుకుని ప్రగల్భాలు పలుకుతూ ఆమెను అవమానిస్తున్నారంటే.. మీరు ఎంత బలహీనంగా ఉన్నారో అర్థమవుతోంది. మిమ్మల్ని మీరు బలమైన నాయకుడని చెప్పే అర్హత కోల్పోయారు. మీకు ధైర్యముంటే, నిజమైన నాయకుడిగా కొనసాగాలంటే.. ఏ మహిళనూ దూషించకుండా రాజకీయాల్లో నిలబడి చూపించండి. అది చేయగలరో లేదో చూద్దాం'' అని ఖుష్బూ సవాలు విసిరారు. మహిళలను నిందించే సంస్కృతి డీఎంకే పార్టీ వారసత్వంలోనే ఉందని విమర్శించిన ఖుష్బూ.. మహిళలు రాజకీయాల్లో పావులు కారని స్పష్టం చేశారు. ''నేను ఇలాంటి మాటలు, లింగవివక్ష వ్యాఖ్యలను గతంలోనూ చూశాను. డీఎంకేలో మహిళలపై వేధింపులు జరగడం కూడా చూశాను. కానీ, ఉదయనిధి స్టాలిన్ నుంచి ఇలాంటి మాటలు ఊహించలేదు. ఆయన యువ నాయకుడు, హుందాగా ప్రతిపక్షంలో ఉంటారని భావించాను. కానీ ఆయన కూడా ఇలాంటి అసభ్యకరమైన, నీచమైన వ్యాఖ్యలు చేయడం దిగ్భ్రాంతి కలిగించింది. ఆయనలో ఇప్పటికీ పశ్చాత్తాపం లేకపోవడం మరింత విచారకరం'' అని ఖుష్బూ అన్నారు.

**త్రిష నా కుటుంబసభ్యురాలితో సమానం..**

త్రిషతో తనకున్న అనుబంధాన్ని ఖుష్బూ ఈ సందర్భంగా పంచుకున్నారు. ''త్రిష చాలా మంచి వ్యక్తి. సినీ పరిశ్రమలోకి రాకముందు నుంచి ఆమె నాకు తెలుసు. నా కుటుంబంలో ఆమె కూడా ఒక సభ్యురాలే. మా పిల్లలకూ ఆమె ఎంతో దగ్గరైంది. మా కుమార్తె పెళ్లికి నాలుగు రోజులు మా ఇంట్లోనే ఉండి అన్ని పనులు దగ్గరుండి చూసుకుంది'' అని ఖుష్బూ వివరించారు.



## ఆందోళనల మాటున అరాచకమా?

ఎప్పుడు పార్లమెంట్ సమావేశాలు ప్రారంభమవుతున్నా దేశ రాజధాని ఢిల్లీ వేడెక్కడం రివాజుగా మారింది. భారత్‌ను నియంత్రించడమే లక్ష్యంగా ఉన్న అమెరికా, బ్రిటన్ వంటి దేశాల పత్రికలలో వచ్చిన వార్తల ఆధారంగానో, ఇక్కడ జరిగిన ఒక ఘటననో చూపించి చట్టసభలను అదేపనిగా అడ్డుకోవడం కొన్ని రాజకీయ పక్షాలకు దశాబ్దకాలంగా అలవాటుగా మారింది. ఇందులో ప్రధానపాత్ర దేశాన్ని నాలుగు దశాబ్దాలు పాలించి, ఇప్పుడు అధికారం లేక తల్లడిల్లిపోతున్న కాంగ్రెస్ పార్టీదే. అవినీతికి, అధికార దుర్వినియోగానికి వ్యతిరేకంగా 2013లో అన్నా హజారే నిరశన వ్రతం చేపడితే, రాహుల్‌గాంధీ దృష్టిలో నాడు అది దేశానికి అరిష్టం. కానీ, ఆయన ఇప్పుడు సోనమ్ వాంగ్‌చుంగ్ నిరశనకు పరోక్షంగా మద్దతు ఇచ్చారు, పార్లమెంట్ ముట్టడికి వచ్చిన కాక్రోచ్ పార్టీ కార్యకర్తలకు వత్తాసు పలికారు. అంతేకాదు, ఏకంగా ప్రధానమంత్రి నివాసం ఎదుట, ఎలాంటి సమాచారం లేకుండా తానే స్వయంగా ధర్నాకు దిగారు. చైనాతో జరిగిన యుద్ధంలో భారత్ ఓడినా ప్రధాని పదవికి రాజీనామా చేయని వ్యక్తి కుటుంబం నుంచి వచ్చిన రాహుల్‌గాంధీ, ఆ చెట్టు పేరుతోనే మనుగడ సాగిస్తున్న ఈ నేత, ఇప్పుడు నీట్ నిర్వహణలో జరిగిన ఒక తప్పిదాన్ని చూపి, ప్రధాని రాజీనామా చేయాలని ధర్నాకు దిగడం ఎంత అసంబద్ధమో కదా!

నీట్ ప్రశ్నపత్రం బహిర్గతమయినందుకు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని 'విద్యార్థులు' పేరుతో ఈ ఉద్యమం ప్రారంభమయింది. ఏదైనా ప్రశ్నపత్రం బహిర్గతం కావడం ఒక తరం మీద దుష్ప్రభావాన్ని చూపేదే. అది అవ్యవస్థకు నిదర్శనం కూడా. కానీ కేవలం నీట్ ప్రశ్నపత్రం బహిర్గతమయినందుకు ప్రారంభమైన ఈ నిరసనలో, అది కూడా జెన్–జీ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ అలజడిలో నిజాయితీ ఎంత? అహింసాయుతంగా పోరాటం చేస్తామని అది చెబుతోంది కానీ, జూలై 20న 'వేలాదిమంది' జరిపిన పార్లమెంట్ ముట్టడి ప్రయత్నంలో కనిపించినది అహింసా పంథాయేనా? సోనమ్ వాంగ్‌చుక్ ఆమరణ దీక్ష శిబిరంలో కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని ఇచ్చే ఆర్టికల్ 370 పునరుద్ధరణ ప్రస్తావన ఎందుకు? దీనికీ నీట్ ప్రశ్నపత్రం లీక్‌కీ సంబంధం ఏమిటి? ప్రశ్నపత్రం బహిర్గతం కావడానికి, సీతారాములకు ముడిపెట్టి ఒక స్టాండప్ కమేడియన్ తన పైత్యాన్ని ప్రదర్శించడం ఎందుకు? ఇస్లాంను కీర్తించే గజల్స్ మారుమోగడం ఎందుకు? భరతమాత భావనను కించపరచడం ఎందుకు?

శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్‌లో జెన్–జీ ఉద్యమం వలెనే భారత్‌లోనూ యువతరం తిరగబడుతోంది అంటూ పార్లమెంట్ వేదికగా కూడా బీజేపీ ప్రభుత్వానికి బెదిరింపులు వినిపించాయి. జూలై 20 నాటి పార్లమెంట్ ముట్టడి వేళ కూడా కొందరు వీరావేశంగా టీవీ చానెళ్ల ముందు అలాగే గర్జించారు. ఇంతకీ ఆ మూడు దేశాలలో జెన్–జీ ఉద్యమం తరువాత పరిస్థితి ఏమిటి? వాంగ్‌చుక్ జంతర్ మంతర్ దగ్గర ఆమరణ దీక్షకు కూర్చున్నప్పుడే నేపాల్‌లో సమాంతరంగా జరిగిన పరిణామాలు అభిజిత్ దీప్కే, అనుచర జెన్–జీలకు తెలియనట్టుంది. జెన్–జీ హింసాయుత అలజడితో ఇటీవలే నేపాల్ ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేసిన బాలెన్‌షాను ఇప్పుడు అదే జెన్–జీ రాజీనామా చేయాలంటూ రోడ్డెక్కింది. ఇక్కడ నీట్ ప్రశ్నపత్రం లీకేజీ పేరుతో దేశాన్ని అస్థిరం చేయాలన్న అసంబద్ధ వైఖరిని మరిపిస్తూనే, రాంగ్ పార్కింగ్‌లో మోటార్ బైక్‌ను ఉంచిన గణేశ్ అనే నేపాలీ యువకుడు, ట్రాఫిక్ పోలీసులతో గొడవపడి పెట్రోలు పోసుకుని ఆత్మాహుతికి పాల్పడటంతో దీనికి బాధ్యత వహిస్తూ బాలెన్ రాజీనామా చేయాలని జెన్–జీ రోడ్డెక్కింది. అంతేనా! ప్రభుత్వ స్థలాలలోని అక్రమ కట్టడాలను కూల్చినందుకు కూడా బాలెన్‌మీద జెన్–జీ కన్నెర్ర జేసింది. బంగ్లాదేశ్‌లో హసీనాను తరిమేసి, యూసుఫ్‌ను దేశాధినేతను చేసింది జెన్–జీ. కానీ, ఆయన మీద కూడా అనతికాలంలోనే అసంతృప్తి రేగింది.

కాంగ్రెస్, దాని వెంట ఉన్న విపక్షాలు పూర్తిగా అరాచకాన్నే కోరుకుంటున్నాయి. జూలై 21న ప్రధాని అధికార నివాసాన్ని ముట్టడించడం ముమ్మాటికీ అరాచక సృష్టికే. 2022లో శ్రీలంకలో రాజపక్స అధికార భవనాన్ని ఆక్రమించడం, 2025లో నేపాల్‌లో ప్రధాని కేపీ శర్మ ఓలి నివాసాన్ని ముట్టడించడం గుర్తుకు రావడం లేదా? 'నేపాల్ పరిస్థితులు వస్తాయనీ, తెస్తామనీ' గొంతు చించుకునే నాయకుల, పార్టీల ఉద్దేశం అక్కడిలాగే మన పార్లమెంట్ భవంతికి నిప్పు పెట్టడమేనా? అంతేకాదు, ఢిల్లీ తాజా పరిణామాలు కొందరు రైతులకు తమ డిమాండ్లను గుర్తుకు తెచ్చాయి కూడా.

దేశంలో రాజకీయ నిరుద్యోగులకూ, కొన్ని చట్టాలు రావడం ఇష్టంలేని వారికీ విద్యార్థుల జీవితాలే గుర్తుకు వస్తాయి. కాబట్టి జెన్–జీలో కనిపించే అవలక్షణాలను ఇకనైనా బేరీజు వేసుకోవాలి. ఇది అరాచకాన్ని నమ్ముకుంది. అలజడి చేయడానికి తీసుకున్న విషయం ఒకటైతే, అంతర్గతంగా ఉండే ఆలోచన వేరొకటి. ప్రజాస్వామ్యాన్ని ఉపయోగించుకుని ప్రజాస్వామ్యాన్నే తుదముట్టించే గొడ్డలి పిడి తరహా లక్షణం వీరి సొంతం. త్రివర్ణ పతాకం పట్టుకుని మరీ దేశ సార్వభౌమాధికారం పట్ల అవిధేయతను ప్రదర్శిస్తున్నారు. రాజ్యాంగ ప్రతులను, డాక్టర్ అంబేడ్కర్ చిత్రాలను పట్టుకుని విధ్వంసానికి పాల్పడుతున్నారు. ఈ అంశాలను యువత గుర్తించాలి. ప్రజాస్వామ్య పద్ధతులలో వ్యవస్థను మెరుగుపరచడానికి ఆలోచించాలి. అరాచకాన్ని తెచ్చుకుంటే అభివృద్ధిని అర్ధ శతాబ్దం వెనక్కి నెట్టడమే.



## "కూటమి ప్రభుత్వం"... కానీ ప్రచారంలో కూటమి ఎక్కడ?

**"రెండు రెల్లు ఆరు" అనేది గణిత సూత్రం కాదు, రాజకీయాల్లో పరిస్థితులకు అనుగుణంగా మారే రాజకీయ వ్యూహాన్ని సూచించే సామెత. అంటే, ఇద్దరు కలిసి పనిచేస్తే వారి ప్రభావం కేవలం "2+2=4" కాకుండా, "2+2=6" అయ్యేంతగా పెరగవచ్చని దాని భావం.. దీనిని నిజం చేసి చూపెట్టింది గత అసెంబ్లీ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం. ఒక నాయకుడికి పరిపాలనా అనుభవం, మరొక నాయకుడికి ప్రజాదరణ ఉంటే కలిపి ప్రభావం మరింత పెరుగుతుందని 2024 ఎన్నికల్లో టీడీపీ–జనసేన–బీజేపీ కూటమి విజయం నిరూపించింది. అయితే అన్నిసమయాల్లోను ఇదే సూత్రం వర్తించకపోవచ్చు. పార్టీల కలయిక, వారి ఉమ్మడి మ్యానిఫెస్టో రూపకల్పన, స్థానిక పరిస్థితులు, ప్రభుత్వంపై ప్రజాభిప్రాయం, ప్రచారం, ఎన్నికల నిర్వహణ వంటి అనేక అంశాలు కూడా ప్రభావం చూపుతాయి.**




ఆంధ్రప్రదేశ్‌లో అధికారం మారి రెండేళ్లు పూర్తి అయ్యింది. రాజకీయ సమీకరణాలు మారాయి. కానీ ప్రభుత్వ ప్రచారంలో అధికార పార్టీ ఆధిపత్యం మాత్రం మారలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల విడుదలైన "కూటమి ప్రభుత్వ సంక్షేమ విజయాలు" ప్రకటనలు ఇదే ప్రశ్నను మళ్లీ తెరపైకి తీసుకొచ్చాయి.రాష్ట్రంలో టీడీపీ-జనసేన-బీజేపీ పార్టీల భాగస్వామ్యంతో కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికీ, ప్రభుత్వ ప్రకటనల్లో కనిపిస్తున్నది మాత్రం ప్రధానంగా టీడీపీ నాయకత్వమే. దీంతో ఎన్నికల ముందు ఉన్న కూటమి ప్రచారం, అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ ప్రచారం మధ్య స్పష్టమైన వ్యత్యాసం కనిపిస్తోంది.

ఎన్నికల ముందు... టీడీపీ + జనసేన కూటమి :

2024 ఎన్నికలకు ముందు టీడీపీ, జనసేన కలిసి రాష్ట్రవ్యాప్తంగా ప్రజల్లోకి వెళ్లాయి. ఉమ్మడి మ్యానిఫెస్టో విడుదల సందర్భంలోను బీజేపీ మాత్రం కాస్త వెనకడుగా ఉంది. టీడీపీ, జనసేన మాత్రమే సూపర్ సిక్స్, మహాశక్తి వంటి హామీలతో పాటు ఇంటింటికీ వెళ్లి గ్యారంటీ పత్రాలు పంపిణీ చేశాయి. అనేక ప్రాంతాల్లో లబ్ధిదారుల పేర్లతో నమోదు (రిజిస్ట్రేషన్) కార్యక్రమాలు కూడా నిర్వహించాయి. ఆ ప్రచారంలో ప్రధానంగా చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ సెంట్రిక్ గా మాత్రమే ప్రచారం జరిగింది. అయితే, బీజేపీ తర్వాత కూటమిలో చేరి ఎన్నికలను కలిసి ఎదుర్కొన్నప్పటికీ, గ్యారంటీ పత్రాల ప్రచారం లేదా రిజిస్ట్రేషన్ కార్యక్రమాల్లో బీజేపీ ప్రత్యేక పాత్ర అంతగా కనిపించలేదనేది సుస్పష్టం.

అధికారంలోకి వచ్చాక... "కూటమి ప్రభుత్వం"

ఎన్నికల్లో ఘన విజయం సాధించిన తర్వాత కూటమి ప్రభుత్వం ఏర్పాటైంది. ప్రభుత్వంలో మూడు పార్టీలకు వారి వారి నిష్పత్తుల ప్రకారం పదవులు తీసుకొని పొత్తు ధర్మం ప్రకారం ముందుకు వెళ్తుంది. అయితే ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్లు దాటిన తర్వాత "కూటమి ప్రభుత్వ సంక్షేమ విజయాలు" పేరుతో ప్రకటనలు విడుదల చేసింది. ఈ ప్రకటనల్లో ప్రధానంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ ఫోటోలు, టీడీపీ ఎన్నికల గుర్తు (సైకిల్) కనిపించాయి కానీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, జనసేన పార్టీ గుర్తు, ప్రధాని నరేంద్ర మోదీ, బీజేపీ కమలం గుర్తు ఇవేమీ కనిపంచలేదు. ప్రచార పత్రంలో "కూటమి ప్రభుత్వం" అనే పదం ఉన్నప్పటికీ, విజువల్ రూపకల్పనలో కూటమి భాగస్వాముల ప్రాతినిధ్యం కనిపించకపోవడం రాజకీయ చర్చకు దారితీసింది. ఎన్నికల ముందు కలిసి గ్యారంటీ పత్రాలు ఇచ్చిన పవన్ కళ్యాణ్ ఇప్పుడు ప్రభుత్వ ప్రకటనల్లో ఎందుకు లేరు? ఉప ముఖ్యమంత్రి హోదాకు తగిన ప్రాధాన్యం ఎందుకు ఇవ్వలేదని జనసేన శ్రేణులు ప్రశ్నిస్తున్నాయి.కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కూటమి భాగస్వామి అయినప్పటికీ ప్రధాని మోదీ లేదా పార్టీ గుర్తుకు ఎందుకు చోటు దక్కలేదని బీజేపీ శ్రేణులు అంతర్మథనం చెందుతున్నారు. గత ప్రభుత్వం "గడప గడపకు మన ప్రభుత్వం" కార్యక్రమం నిర్వహించినప్పుడు... ఆ ప్రచారంలో వై.యస్. జగన్ ఫోటోలు, వైసీపీ రంగులు, పార్టీ బ్రాండింగ్ ప్రధానంగా కనిపించేవి. అప్పుడు టీడీపీ, జనసేన, బీజేపీ ఒకే స్వరంతో విమర్శించాయి. ప్రజల డబ్బుతో పార్టీ ప్రచారం చేస్తున్నారని ఆరోపించాయి. ఇప్పుడు అదే విమర్శ... కూటమి ప్రభుత్వంపైన ప్రతిపక్ష వైసీపీతో పాటు కొన్ని చోట్ల అధికార పక్ష భాగస్వాములైన జనసేన, బీజేపీ శ్రేణులు కూడా విమర్శించడం గమనార్హం. ప్రభుత్వ ప్రకటనల్లో ప్రభుత్వం కనిపించాలా? లేక అధికార పార్టీ కనిపించాలా? అనే ప్రశ్న ముందుకొస్తోంది. ఇటీవల జరిగిన భోగాపురం ఎయిర్ పోర్టు ప్రారంభోత్సవ కార్యక్రమానికి ప్రధాని మోదీ ముఖ్య అతిథిగా విచ్చేసి జాతికి అంకితం చేశారు. ఆ సందర్భంగా ఏర్పాటు చేసిన స్వాగత బ్యానర్లు, ఫ్లెక్సీల ఏర్పాటులోను కూటమిలో జనసేనకు ప్రాధాన్యత ఇవ్వలేదని కొంతమంది జనసేన శ్రేణులు ఆందోళన చేశారు. కొన్ని సందర్భాల్లో అభివృద్ధి కార్యక్రమాల శిలాఫలకాలు ఏర్పాటు చేసినప్పుడు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఫోటో వేసి తర్వాత దానిని తొలగించడం పై పవన్ కళ్యాణ్ స్వయంగా మాట్లాడిన సందర్భాలున్నాయని గుర్తుంచుకోవాలి. అయితే కూటమిలో భాగస్వామ్య పార్టీల మధ్య సమన్వయం బలహీనపడినప్పుడు, కార్యకర్తల్లో పొత్తులపై విశ్వాసం తగ్గినప్పుడు, ఉమ్మడి లక్ష్యం స్పష్టంగా లేనప్పుడు. పార్టీల మధ్య అంతర్గత విభేదాలు బయటపడినప్పుడు, ఓటు బదిలీ పూర్తిగా బదిలీకానప్పుడు. నాయకత్వంలో సమన్వయలోపాలు తలెత్తినప్పుడు.స్థానిక రాజకీయ సమీకరణలు కూటమికి అనుకూలంగా లేకపోతే "రెండు రెళ్లు ఆరు కాదు రెండు రెళ్లు రెండు లేదా సున్నాగా మిగిలిపోతుందని గ్రహించాలి.

**– కర్రే సుబ్బారావు, జర్నలిస్టు**

## నిరసన స్వరాలు వింటారా?

**పార్లమెంటు వర్షా కాల సమావేశాల తొలిరోజైన సోమవారం ఢిల్లీ ఆకాశంలో నిరసన మబ్బులు దట్టంగా అలుముకున్నాయి. రాజవీధులన్నీ వేలాది యువగళాలతో హోరెత్తాయి. పన్నెండేళ్ల బాలిక మొదలుకొని అనేకమంది యువతీయువకులు పోలీసుల లాఠీచార్జిలో గాయపడి నెత్తురోడుతున్న, విలపిస్తూ నిలదీస్తున్న దృశ్యాలు చానెళ్లలో వీక్షించటం చాలామందికి కష్టంగా తోచింది. ఈ దశాబ్ద కాలంలో దేశ రాజధాని ఎన్నడూ చూడని దృశ్యాలివి. నీట్ ప్రశ్నపత్రాల లీక్‌పై గత నెల జూన్ 6 నుంచి కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) చేస్తున్న ఆందోళననూ, మూడు వారాలుగా కొనసాగుతున్న నిరశనలనూ మౌనంగా వీక్షిస్తూ ఉండిపోయిన ప్రభుత్వానికి సోమవారం నాటి 'చలో సంసద్' కళ్లు తెరిపించి ఉండాలి. అందుకే కావొచ్చు... కేంద్ర ఆరోగ్యమంత్రి జేపీ నడ్డా ఉద్యమ కార్యకర్తలను చర్చలకు పిలిచారు. అక్కడేమైంది, చివరకు ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకుందన్న సంగతలా ఉంచితే ముందు వినడం పాలకులు చేయాల్సిన పని.**



పదిహేనేళ్ల క్రితం అన్నా హజారే నిరశన మొదలెట్టినప్పుడు ఆనాటి యూపీఏ ప్రభుత్వం మొదట్లో పట్టించుకోకున్నా, ఆ తర్వాత కేంద్ర మంత్రులతో ప్రతినిధి బృందాన్ని పంపింది. దాన్ని సంపూర్ణంగా సమర్థించి, క్రియాశీలంగా పాల్గొని దేశవ్యాప్తంగా ఆ ఉద్యమానికి ఊపూ ఉత్సాహాన్నీ తీసుకొచ్చింది బీజేపీయే. అందు మూలంగా ఇతోధికంగా లాభపడింది కూడా. కానీ అదే పార్టీ ఆధ్వర్యంలోని ఎన్డీయే ప్రభుత్వం ఇప్పుడు నిర్లిప్తంగా ఉండి పోవటం, సమస్యను ఇంత సంక్లిష్టం చేసుకోవటం దిగ్భ్రాంతికరం. ఈ ఆందోళనలో గాయపడిన వారిలో వందమంది వరకూ రాంమనోహర్ లోహియా ఆస్పత్రిలో చికిత్సకు చేరగా వారిలో తలలు పగిలినవారూ, కాళ్లూ చేతులూ విరిగినవారూ అనేకులున్నారని జాతీయ మీడియా కథనాలు చెబుతున్నాయి. అటు 118 మంది పోలీసులు గాయాలతో ఆస్పత్రుల్లో చేరారని ఢిల్లీ పోలీసులు ప్రకటించారు.

పాలకులుగా ఎవరుండాలో ఎన్నికలు చెబితే... వారి పాలన ఎలావుందో నిరసనలు చెబుతాయి. అసమ్మతి అనేది దేశభక్తికి అత్యున్నత రూపం అంటాడు అమెరికా రాజనీతి శాస్త్ర ఆచార్యుడు హోవార్డ్ జిన్. ప్రజాస్వామ్యంలో విభేదించేందుకూ, అభిప్రాయాలు వ్యక్తం చేసేందుకూ చోటివ్వడం ప్రభుత్వాల బాధ్యత. ఆ దిశగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావటం విపక్షాల బాధ్యత కూడా. కానీ విషాదమేమంటే ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ ఈ కర్తవ్య నిర్వహణలో విఫలమైంది. జూన్ 17న రాజస్థాన్‌లోని కోటలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఒకరోజు ధర్నా చేయటం మినహా చేసిందేమీ లేదు. అన్నా హజారే ఉద్యమ సమయంలో జరిగిందేమిటో గుర్తున్నా తాను చేయాల్సిందేమిటో ఆ పార్టీకి తెలిసేది. ఆ సంగతి ఆలస్యంగా గ్రహించి మంగళవారం ప్రధాని నరేంద్ర మోదీ నివాసం సమీపంలో రాహుల్, ప్రియాంక, ఇతర కాంగ్రెస్ ఎంపీలు ధర్నా చేశారు.

ఈ ఉద్యమానికి చెప్పుకోదగ్గ నాయకులంటూ ఎవరూ లేకపోవడం గమనించదగ్గది. నిరశనలో ఉన్న సోనమ్ వాంగ్‌చుక్‌ను పోలీసులు అరెస్టుచేసి ఆస్పత్రిలో చేర్చారు. సీజేపీ నాయకుడు అభిజీత్ దీప్కేను ప్రదర్శన ప్రారంభంలోనే పోలీసులు అరెస్టు చేశారని వార్తలొచ్చాయి. కానీ దాదాపు 50,000 మంది వరకూ ఉన్న ఆందోళనకారులు గుంపులుగా విడిపోయి పార్లమెంటువైపు దూసుకెళ్లే ప్రయత్నం చేయటం, చాలావరకూ సఫలీకృతం కావటం చిన్న విషయం కాదు. పటేల్ చౌక్, జన్‌పథ్ గేటు మెట్రో స్టేషన్‌ల వద్ద, అశోకా రోడ్, కన్నాట్ ప్లేస్ సర్కిల్ వద్ద బైఠాయింపులు, మరో అయిదుచోట్ల వారిపై బాష్ప వాయు గోళాలు ప్రయోగించటం సమస్య తీవ్రతను వెల్లడిస్తుంది.

హింసకూ, దౌర్జన్యానికీ దిగినవారిని నియంత్రించటాన్ని ఎవరూ ప్రశ్నించరు. కానీ ఒక్కరిని చేసి ఏడెనమండుగురు పోలీసులు లాఠీలతో మోదటం, ఆడపిల్లలని కూడా చూడకుండా హింసించటం సబబేనా? 'మీ ఇంట్లో పిల్లలు లేరా? ఇంత దారుణంగా కొడతారా?' అని ఒక బాలిక ప్రశ్నించటం, తన దుస్తులు చించారని మరొకామె ఆరోపించటం ప్రభుత్వ ప్రతిష్ఠ పెంచదు. పరీక్షపత్రాలు లీకవటం, కష్టపడి చదివేవారు దగాపడటం తొలిసారి కాదు. ఏళ్లతరబడి ఇలా జరగటంవల్లే పరిస్థితి ఇంతవరకూ వచ్చింది. ఇకనైనా విద్యార్థుల అభీష్టాన్ని వినటం, సానుకూలంగా స్పందించటం ప్రభుత్వ బాధ్యత. లేకుంటే సమస్య మరింత జటిలమవుతుంది.

## పేద పిల్లల భవిష్యత్తుకు పునాది

**నవ్యాంధ్ర అక్షర యజ్ఞంలో ఒక విప్లవాత్మక ముందడుగు 'తల్లికి వందనం'. పిల్లల చదువులకు పేదరికం ఎన్నటికీ అడ్డుగోడ కాకూడదనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం 'తల్లికి వందనం' పథకాన్ని ప్రవేశపెట్టింది. ప్రతి పేద విద్యార్థి ఇంటా చదువుల పండుగ తీసుకురావాలని, పిల్లల భవిష్యత్తును చూసి ప్రతి తల్లీ గర్వపడాలనే మహోన్నత ఆశయంతో ఈ అడుగు పడింది.చదువు కేవలం కొందరికే పరిమితం కాకుండా, ప్రతి పేద బిడ్డకూ అందాలన్నదే ప్రభుత్వ తాపత్రయం. రెక్కాడితే గానీ డొక్కాడని పరిస్థితుల్లో కూడా పిల్లల చదువుల కోసం అహర్నిశలూ శ్రమించే లక్షలాది మంది తల్లులకు కొండంత అండగా నిలవడమే ఈ పథకం ఉద్దేశం. ఇది కేవలం ఓట్ల కోసం తెచ్చిన పథకం కాదు, పిల్లలు పెద్దయ్యాక మంచి ఉద్యోగాల్లో స్థిరపడి, సొంత కాళ్ల మీద నిలబడడానికి వేసిన ఒక బలమైన పునాది.**

గత ప్రభుత్వం 'అమ్మ ఒడి' పేరుతో.. ఇంట్లో ఎంతమంది పిల్లలున్నా కేవలం ఒక్కరికే పథకాన్ని వర్తింపజేసి చేతులు దులుపుకుంది. ఏ తల్లి అయినా తన పిల్లల్లో ఒకరిని ఎక్కువ, ఒకరిని తక్కువ అని చూసుకోదు. ఆనాటి సంకుచిత విధానాలు తల్లుల మనసులను గాయపరిచాయి. ఆ వివక్షకు చరమగీతం పాడుతూ కూటమి ప్రభుత్వం 'తల్లికి వందనం' పథకాన్ని అత్యంత మానవీయ కోణంలో సంస్కరించింది. ఇంట్లో ఎంతమంది పిల్లలుంటే, అంతమందికీ రూ.15,000 చొప్పున అందిస్తూ ప్రతి తల్లి కలను సాకారం చేస్తోంది.

ఈ బృహత్ కార్యాన్ని కేవలం మాటలకే పరిమితం చేయకుండా అత్యంత పకడ్బందీగా, భారీ బడ్జెట్‌తో కూటమి ప్రభుత్వం అమలు చేస్తోంది. గత ప్రభుత్వంలో కేవలం రూ.6,450 కోట్లతో 43 లక్షల మంది విద్యార్థులకు అరకొరగా లబ్ధి చేకూరితే, నేడు కూటమి ప్రభుత్వం రూ.10,120.78 కోట్ల భారీ బడ్జెట్‌తో ఏకంగా 67.47 లక్షల మంది విద్యార్థులకు తల్లికి వందనం సహాయాన్ని అందిస్తున్నది. చదువుకు ప్రభుత్వం ఇస్తున్న అత్యున్నత ప్రాధాన్యానికి ఈ అంకెలే నిదర్శనం. విద్యా వ్యవస్థను గాడిలో పెట్టేందుకు బడ్జెట్‌లో చేసిన అధిక కేటాయింపుల ద్వారా ఊళ్లలో స్కూళ్ల రూపురేఖలు మార్చడానికి, టీచర్ల కొరతను తీర్చడానికి, పిల్లలకు నాణ్యమైన చదువుతో పాటు మంచి సౌకర్యాలు కల్పించడానికి తీసుకుంటున్న చర్యలు మరింత బలోపేతం అవుతాయి.

గత ప్రభుత్వంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, మున్సిపల్ పారిశుధ్య కార్మికులు తమ పిల్లలకు సాయం అందడం లేదని కంటతడి పెట్టారు. వారి నిస్వార్థ శ్రమను గుర్తిస్తూ, వారి సంపాదనతో నిమిత్తం లేకుండా ప్రతి ఒక్కరి పిల్లలకూ ఈ సాయాన్ని వర్తింపజేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీనివల్ల రాష్ట్రంలో అదనంగా 17 వేల మంది అంగన్‌వాడీల పిల్లలకు ఈ లబ్ధి చేకూరుతోంది.

నిధుల పంపిణీ ప్రక్రియను కూడా కేవలం ఒక ప్రభుత్వ తంతుగా కాకుండా, అత్యంత పారదర్శకమైన రీతిలో సమయపాలనతో ముందుకు తీసుకెళ్తున్నారు. ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుతున్న నిరుపేద విద్యార్థుల తల్లుల ఖాతాల్లోకి ఈ జూలై 22న మొదటి విడత నిధులను జమ చేశారు. ఇందులో తల్లుల బ్యాంకు ఖాతాల్లో రూ.13,000, పాఠశాల నిర్వహణకు రూ.2,000 కేటాయిస్తున్నారు. గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా లబ్ధిదారుల జాబితాలను ప్రదర్శిస్తూ, ఎవరికైనా సాంకేతిక సమస్యల వల్ల సహాయం అందకపోతే జూలై 22 నుంచి ఆగస్టు 3వ తేదీ వరకు సచివాలయాల ద్వారా అభ్యంతరాల స్వీకరణకు అవకాశం కల్పించారు. ఫిర్యాదులను పరిశీలించి, అదనపు అర్హుల జాబితాల తయారీని ఆగస్టు 4 నుంచి ఆగస్టు 10 లోగా పూర్తి చేస్తారు. కొత్తగా అడ్మిషన్లు పొందిన విద్యార్థుల వివరాలను సైతం ఆగస్టు 25 నాటికి నమోదు చేసుకొని, ఆగస్టు 30 కల్లా నూరు శాతం నిధులను తల్లుల ఖాతాలలో చేర్చేలా ఏర్పాట్లు పూర్తి చేశారు.

ఈ అక్షర యజ్ఞం కేవలం ప్రభుత్వ పాఠశాలలకే పరిమితం కాలేదు. విద్యాహక్కు చట్టం కింద ప్రైవేట్ స్కూళ్లలో ఉచిత సీట్లు పొందిన 1.04 లక్షల మంది నిరుపేద విద్యార్థుల తల్లులను కూడా ఈ పథకం కిందికి చేర్చారు. వారి స్కూల్ ఫీజును సమగ్ర శిక్షా అభియాన్ ద్వారా నేరుగా పాఠశాలలకు చెల్లిస్తూ, మిగిలిన మొత్తాన్ని తల్లుల ఖాతాల్లోనే జమ చేస్తున్నారు. ఏ ఒక్క పేద కుటుంబానికి కూడా వారి కులం వల్లనో, మతం వల్లనో వివక్ష జరగకూడదన్నదే కూటమి సిద్ధాంతం. సమాజంలో అర్హుడైన లబ్ధిదారుడు సాంకేతిక కారణాల వల్ల నష్టపోకూడదన్న తపనతో ప్రభుత్వం 'మనమిత్ర' వాట్సప్ చాట్ బాట్, 'లీప్' యాప్‌లను పరిచయం చేసింది. వీటి ద్వారా ప్రతి ఒక్కరూ తమ అర్హతలను తనిఖీ చేసుకుని, తమ హక్కును సులభంగా పొందే వీలు కల్పించింది. కూటమి ప్రభుత్వంలో లంచాలకు, సిఫార్సులకు తావు లేకుండా కేవలం అర్హతలకే ప్రాధాన్యం ఇస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తు తరగతి గదుల్లోనే రూపుదిద్దుకుంటోందని, రేపటి అంతర్జాతీయ వేదికలపై మన పిల్లలు విజేతలుగా నిలబడాలన్నదే ప్రభుత్వ కల అని చాటిచెబుతున్నారు. అమ్మ ప్రేమను, ఆమె పడుతున్న కష్టాన్ని గౌరవిస్తూ ప్రవేశపెట్టిన 'తల్లికి వందనం' పథకం రాబోయే తరాలకు ఒక బలమైన ఆయుధంగా నిలుస్తున్నది. రాష్ట్రాన్ని అక్షరాస్యతలో, నాలెడ్జ్ ఎకానమీలో దేశంలోనే అగ్రస్థానంలో నిలపడానికి మనమంతా కలిసికట్టుగా సాగాలనే ఆకాంక్షతో, పిల్లల తలరాతను మార్చే చదువుకు శ్రీకారం చుట్టే బాధ్యతను ప్రభుత్వం సంపూర్ణంగా తీసుకుంది.

అనంత
జనశక్తి
జనం కోసమే మా అక్షరం
గురువారం | అనంతపురం | 06.08.2026 | 01

# ఘనంగా అయ్యప్పస్వామి పడిపూజా

**యాడికి, ఆగష్టు 5,అనంత జనశక్తి న్యూస్ :**



మండల కేంద్రంలోని బుగ్గరోడ్డు లో ఉన్నశ్రీ అయ్యప్పస్వామి దేవాలయంలో బుధవారం శ్రీ అయ్యప్పస్వామి పడి పూజా కార్యక్రమంను ఘనంగా నిర్వహించారు. ఉదయం శ్రీ అయ్యప్పస్వామి కి విశేష అభిషేకం చేసి, వివిధ పూల మాలలతో అలంకరణ చేసి, పూజలు నిర్వహించారు. సాయం త్రం శ్రీ అయ్యప్పస్వామి పడి పూజ కార్యక్రమం ఘనంగా నిర్వ హించారు.అయ్యప్పస్వామి పాటలతోను, ఓం శ్రీ స్వామియే శరణం అయ్య ప్ప అనే నామం మారుమ్రోగింది.అయ్యప్పస్వామి కి మహా మంగ ళహారతి ని సమర్పించారు. భక్తులకు తీర్థప్రసాదాలను, భిక్ష ను ఏర్పాటు చేశా రు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు హరినాథ్ స్వామి, చిట్టి స్వామి , ఆలయ అధ్యక్షుడు నాగరాజు, పూజారి నాగరాజు, భక్తులు పాల్గొన్నారు.

# పొగాకు రైతుల సంక్షేమంపై జగన్‌మోహన్‌రెడ్డికి బహిరంగ సవాల్



**- వాస్తవాలు, గణాంకాలతో చర్చకు సిద్ధమా జగన్? రైతుల కోసం చేసింది ఎవరు? మాటలు చెప్పింది ఎవరు? ప్రజల ముందే తేల్చుకుందాం - మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**

**అమరావతి, ఆగస్ట్ 05:అనంత జనశక్తి ప్రతినిధి**

పొగాకు రైతుల సంక్షేమంపై మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవాలపై ఆధారపడినవని, రైతులపై నిజంగా చిత్తశుద్ధి ఉంటే వాస్తవాలు, గణాంకాలతో బహిరంగ చర్చకు రావాలని జగన్‌మోహన్‌రెడ్డికి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు బహిరంగ సవాల్ విసిరారు. బుధవారం విజయవాడలోని ఓ ప్రైవేట్ హోటల్ లో మీడియాతో మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి గారూ... మీరు పొగాకు రైతుల కష్టాల గురించి మాట్లాడుతున్నారు, కానీ వాస్తవాలు, గణాంకాలతో బహిరంగ చర్చకు రావడం లేదు.రైతులపై నిజమైన చిత్తశుద్ధి ఉంటే ఈ సవాలును స్వీకరించండి. పొగాకు రైతులు సంక్షోభంలో ఉన్న ప్రతిసారీ వారిని ఆదుకున్నది టీడీపీ నాయకత్వంలోని ప్రభుత్వమే. రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రతిసారీ అండగా నిలిచి నిర్ణయాలు తీసుకున్న చరిత్ర టీడీపీ ప్రభుత్వానిదే. గత సంవత్సరం బర్లీ పొగాకు రైతుల నుంచి 25 మిలియన్ కిలోల పొగాకును కొనుగోలు చేసి, సుమారు రూ.280 కోట్లు వెచ్చించడం జరిగింది.2014-15లో ఎఫ్‌సీవీ పొగాకు ధరలు పడిపోయినప్పుడు, వాణిజ్య పంట అయినప్పటికీ రైతులు నష్టపోకూడదనే ఉద్దేశంతో ప్రతి కిలోకు రూ.20 ఆర్థిక సహాయం అందించడం జరిగింది. చరిత్రలోనే ఇది ఒక కీలక నిర్ణయం. అయితే, మీ ప్రభుత్వ హయాంలో 2019లో సుమారు 124 మిలియన్ కిలోల పొగాకు ఉత్పత్తి కాగా, ధర కిలోకు రూ.121-123కు పడిపోయింది. అయినప్పటికీ మీ ప్రభుత్వం కేవలం 11.8 మిలియన్ కిలోలను మాత్రమే కొనుగోలు చేసి, మిగిలిన రైతులను గాలికి వదిలేసింది. తదుపరి సంవత్సరం సుమారు 128 మిలియన్ కిలోల పొగాకు ఉత్పత్తి అయి, ధర కిలోకు రూ.123కు పడిపోయినప్పటికీ, మీ ప్రభుత్వం ఒక్క కిలో కూడా కొనుగోలు చేయలేదు. రైతులకు ఎలాంటి అదనపు ఆర్థిక సహాయమూ అందించలేదు.

పొగాకు ధరల విషయంలో కూడా వాస్తవాలు ప్రజల ముందున్నాయి.

2019లో కేజీ రూ.142
2020లో రూ.140
2021లో రూ.161
2022లో రూ.192
2023లో రూ.248
2024లో కూటమి ప్రభుత్వ హయాంలో రూ.326
2025లో రూ.300
2026లో రూ.275

ప్రస్తుత సంవత్సరం టొబాకో బోర్డు లక్ష్యం 131 మిలియన్ కిలోలు కాగా, రైతులు సుమారు 241 మిలియన్ కిలోలు ఉత్పత్తి చేశారు. అధిక ఉత్పత్తితో ఇబ్బందులు ఎదురైన రైతులను ఆదుకోవడానికి కూటమి ప్రభుత్వం వెంటనే ముందుకొచ్చింది. సుమారు 100 మిలియన్ కిలోల పొగాకుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతి కిలోకు రూ.10 చొప్పున మొత్తం రూ.100 కోట్ల ఆర్థిక సహాయం అందించాలని నిర్ణయించింది. ఈ సహాయం పంపిణీని రేపటి నుంచే ప్రారంభిస్తున్నాం. అంతేకాదు... అంచనాకు మించి పొగాకు వచ్చినా, దానికి కూడా ప్రతి కిలోకు రూ.10 చొప్పున సహాయం అందించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. రాష్ట్ర ప్రభుత్వ సహాయంతో పాటు, కేంద్ర ప్రభుత్వం ప్రతి పొగాకు బ్యారన్‌కు రూ.50,000 వడ్డీలేని రుణం అందిస్తోంది. ఈ వాస్తవాలన్నింటి తర్వాత కూడా పొగాకు రైతుల గురించి కూటమి ప్రభుత్వాన్ని విమర్శించే నైతిక హక్కు జగన్‌మోహన్‌రెడ్డికి లేదు. గత ప్రభుత్వ పనితీరు, కూటమి ప్రభుత్వ సహాయంపై గణాంకాలతో బహిరంగ చర్చకు రావాలని మరోసారి సవాలు చేస్తున్నాం. రైతులు గత ప్రభుత్వ పనితీరును, ప్రస్తుత కూటమి ప్రభుత్వం అందిస్తున్న సహాయాన్ని పోల్చి చూడండి. ఎవరు రైతులను గాలికి వదిలేశారో, ఎవరు కష్టకాలంలో అండగా నిలిచారో ప్రజలే నిర్ణయిస్తారని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు.

# పరిశ్రమల స్థాపనతోనే జిల్లా అభివృద్ధి సాధ్యం

**- జిల్లా అభివృద్ధికి పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించాలి**
**- జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్**

**అనంతపురం, ఆగస్టు 5:అనంత జనశక్తి న్యూస్**



పరిశ్రమల స్థాపనతోనే జిల్లా అభివృద్ధి సాధ్యమవుతుందని కలెక్టర్ ఓ. ఆనంద్ సంబంధిత అధికారులకు సూచించారు.బుధవారం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నందు 70,వ జిల్లా పరిశ్రమల ఎక్స్ పోర్ట్ ప్రమోషన్ కమిటీ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ మాట్లాడుతూ...పరిశ్రమల స్థాపనతోనే జిల్లాలో అభివృద్ధి సాధ్యమవుతుందని అధికారులు పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించి జిల్లా అభివృద్ధికి కృషి చేయాలన్నారు.ఈ సందర్భంగా జిల్లాలో నూతన పరిశ్రమలు స్థాపించేందుకు అనుమతులకు సంబంధించి ఇప్పటి వరకు 68 దరఖాస్తులు రాగా అందులో 48 దరఖాస్తులకు ఆమోదం తెలపడం జరిగింది. రెండు దరఖాస్తులను వివిధ కారణాల వల్ల తొలగించడం జరిగింది మిగిలిన 18 దరఖాస్తులను త్వరలో పరిష్కరిస్తామని పరిశ్రమల శాఖ జిఎం కలెక్టర్ కు తెలిపారు.ఈ ఏడాది జిల్లాలో 20 యూనిట్లకు గాను పెట్టుబడి రాయితీ 1,88,94,691 రూపాయలు కాగా ఇందులో విద్యుత్ శక్తి రాయితీ రెండు యూనిట్లకు 47,531 రూపాయలు. ఇందులో మొత్తం రూ.1.89,42,222 రాయితీ ఇవ్వడం జరిగిందన్నారు. జిల్లాలో భారీ మరియు అతి భారీ పరిశ్రమల స్థాపనకు వివిధ నిర్మాణ దశలలో ఉన్న సిల్వర్ స్పార్క్, సుగుణ స్పాంజ్ ప్రైవేట్ లిమిటెడ్, సరళ ఏవియేషన్ ప్రైవేట్ లిమిటెడ్, పరిశ్రమలు త్వరితగతిన పూర్తయ్యేందుకు చర్యలు చేపట్టాలన్నారు.జిల్లాలో వివిధ నూతన పరిశ్రమల నిర్మించేందుకు స్థలం కేటాయించడం జరిగిందని వీటికి సంబంధించి నిర్మాణ పనులను త్వరగా ప్రారంభించాలన్నారు.

ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీకి గార్లదిన్నె మండలంలోని కణంపల్లె లో భూమి అడగడం జరిగిందని అందుకు సంబంధించి (డిపిఆర్) డీటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ ను త్వరగా తయారు చేసి తమకు పంపాలని హార్టికల్చర్ అధికారులకు సూచించారు. విశ్వకర్మ స్కీమ్ కు అర్హులైనటువంటి దరఖాస్తుదారులకు శిక్షణ ఇచ్చి వారికి అవసరమైన రుణాలు మంజూరు చేయాలని ఎల్ డి ఎం కు సూచించారు. రుణాల మంజూరు లో బ్యాంకు అధికారులు నిర్లక్ష్యం చేయకుండా అర్హులందరికీ రుణాలు ఇవ్వాలన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు దాదాపు 70 ఇండస్ట్రీస్ అండ్ ఎక్స్పోర్ట్ ప్రమోషన్ కమిటీ సమావేశాలు నిర్వహించడం జరిగిందని, ఈ సమావేశాలు ప్రతినెలా క్రమం తప్పకుండా నిర్వహించి మరిన్ని నూతన పరిశ్రమలు స్థాపించి నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించి జిల్లా అభివృద్ధికి కృషి చేయాలని వివిధ శాఖల అధికారులకు సూచించారు. ఇంకా ఈ కార్యక్రమంలో పలు అంశాలపై జిల్లా కలెక్టర్ అధికారులకు కూలంకషంగా వివరించి దిశా నిర్దేశం చేశారు .ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ సి .విష్ణు చరణ్, పరిశ్రమల శాఖ జిఎం, లీడ్ బ్యాంకు మేనేజర్, ఉద్యానవన శాఖ, డిఆర్డిఏ పిడి శైలజ, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మత్స్యకారులకు చారిత్రక భరోసా...

**- బీమా, సబ్సిడీ, భృతిలో కూటమి ప్రభుత్వ విప్లవాత్మక నిర్ణయాలు**
**- గత ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిన బీమా పరిహారాలన్నీ చెల్లింపు**
**- విద్యుత్ సబ్సిడీలో భారీ పెంపు**
**- మత్స్యకారుల సంక్షేమంలో కూటమి ప్రభుత్వమే ఆదర్శం... వైసీపీ నిర్లక్ష్యానికి గణాంకాలే సాక్ష్యం: మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**

**అమరావతి, ఆగస్ట్ 05:అనంత జనశక్తి న్యూస్**



మత్స్యకారుల సంక్షేమాన్ని అత్యున్నత ప్రాధాన్యంగా తీసుకుని కూటమి ప్రభుత్వం చారిత్రక నిర్ణయాలు అమలు చేస్తోందని రాష్ట్ర వ్యవసాయ, పశుసంవర్ధక, మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన ప్రతి అంశంలోనూ న్యాయం చేస్తూ, మత్స్యకార కుటుంబాలకు నిజమైన భరోసా కల్పిస్తున్నామన్నారు. మాటల్లో కాదు... చేతల్లో సంక్షేమాన్ని చూపించడమే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వ విధానమని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. గత ప్రభుత్వం పెండింగ్‌లో ఉంచిన మత్స్యకారుల బీమా పరిహారాలను పూర్తిగా చెల్లించడంతో పాటు, బీమా పథకాన్ని విస్తరించడం, విద్యుత్ సబ్సిడీని గణనీయంగా పెంచడం, వేట నిషేధ కాల భృతిని భారీగా పెంచి అందించడం వంటి అనేక చారిత్రక నిర్ణయాలను ప్రభుత్వం అమలు చేసిందన్నారు. గణాంకాలే కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధికి, గత ప్రభుత్వ వైఫల్యాలకు ప్రత్యక్ష సాక్ష్యాలని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. మత్స్యకారులకు నిజమైన మేలు జరిగిందంటే అది తెలుగుదేశం పార్టీ నాయకత్వంలోని ప్రభుత్వాల హయాంలోనే జరిగిందని, మత్స్యకారుల సంక్షేమాన్ని రాజకీయాల కోసం కాకుండా బాధ్యతగా భావించి పనిచేసిన చరిత్ర తెలుగుదేశం పార్టీకి ఉందన్నారు. కానీ గత వైసీపీ ప్రభుత్వం మత్స్యకారులను అన్ని విధాలా నిరాశపరిచింది. మరణించిన మత్స్యకారుల కుటుంబాలకు అందాల్సిన బీమా పరిహారాలు, నష్టపరిహారాలను సైతం చెల్లించకుండా పెండింగ్‌లో పెట్టింది. కుటుంబ పెద్దను కోల్పోయి తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కుటుంబాలను ఆదుకోవాల్సిన సమయంలో కూడా ఆ ప్రభుత్వం మానవత్వం చూపలేకపోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గత ప్రభుత్వం పెండింగ్‌లో ఉంచిన బీమా పరిహారాలన్నింటినీ చెల్లించి బాధిత కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించాం. ఈ బీమా పథకం అమలుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.2,56,66,000, కేంద్ర ప్రభుత్వం రూ.4,20,00,000 వెచ్చిస్తూ, మొత్తం రూ.6,76,66,000తో మత్స్యకార కుటుంబాలకు రక్షణ కల్పిస్తోంది. అంతేకాదు, కేవలం సంప్రదాయ మత్స్యకారులకే కాకుండా అర్హులైన మత్స్య రంగ అనుబంధ వృత్తుల్లో పనిచేస్తున్న కార్మికులను కూడా బీమా పరిధిలోకి తీసుకువచ్చి, వారి కుటుంబాలకు భరోసా కల్పించే చారిత్రక నిర్ణయం తీసుకున్నాం. గత ప్రభుత్వంతో పోలిస్తే మత్స్యకారుల బీమా పథకంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చామని, గతంలో 18 నుంచి 60 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న మత్స్యకారులకు మాత్రమే బీమా వర్తించేదని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ వయోపరిమితిని 18 నుంచి 70 సంవత్సరాలకు పెంచి మరింత మంది మత్స్యకారులకు భరోసా కల్పించామని చెప్పారు.గతంలో ఈ పథకం కేవలం సముద్రంలో చేపల వేటకు వెళ్లే మత్స్యకారులకు మాత్రమే పరిమితమై ఉండేదని, ప్రస్తుతం సముద్ర మత్స్యకారులతో పాటు లోతట్టు ప్రాంతాల్లో చేపల వేట, చేపల పెంపకంపై ఆధారపడిన మత్స్యకారులకు కూడా బీమా వర్తించేలా విస్తరించామని మంత్రి వివరించారు. గతంలో సుమారు 1.30 లక్షల కుటుంబాలకు మాత్రమే రూ.5 లక్షల బీమా సౌకర్యం అందుబాటులో ఉండేదని, ప్రస్తుతం పథకాన్ని విస్తరించి సుమారు 8 లక్షల మంది వరకు బీమా రక్షణ కల్పించేలా చర్యలు చేపట్టామని తెలిపారు. అంతేకాకుండా, గత ప్రభుత్వంలో వేట చేస్తున్న సమయంలో మరణించినప్పుడే రూ.5 లక్షల బీమా పరిహారం లభించేదని, కానీ కూటమి ప్రభుత్వం ఆ పరిమితిని తొలగించి ఫిషింగ్ కార్యకలాపాల్లో ఉన్న సమయంలోనైనా, ఇంటి వద్ద ఉన్నప్పుడైనా, ఏ కారణంతో మరణించినా అర్హులైన మత్స్యకార కుటుంబాలకు రూ.5 లక్షల బీమా ప్రయోజనం అందేలా చారిత్రక నిర్ణయం తీసుకుందని మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడించారు. గతంలో ఈ పథకం ప్రత్యక్షంగా చేపల వేటలో పాల్గొనే మత్స్యకారులకు మాత్రమే పరిమితమై ఉండేదని, ఇప్పుడు రొయ్యల పరిశ్రమలు, ఫీడ్ పరిశ్రమలు, రొయ్యలు, చేపల చెరువులు తదితర మత్స్యరంగ అనుబంధ వృత్తుల్లో పనిచేస్తున్న కార్మికులను కూడా బీమా పరిధిలోకి తీసుకొచ్చామని తెలిపారు. ఆర్థికంగా అనేక సవాళ్లు ఉన్నప్పటికీ, మత్స్యకారులు, మత్స్యరంగ కార్మికులు, వారి కుటుంబాల సంక్షేమమే లక్ష్యంగా రూ.6.82 కోట్లకు పైగా వెచ్చించి లక్షలాది మందికి బీమా రక్షణ కల్పిస్తున్నామని పేర్కొన్నారు.

**విద్యుత్ సబ్సిడీలోనూ... వేట నిషేధ కాల భృతిలోనూ కూటమి ప్రభుత్వమే మత్స్యకారులకు అండ**

మత్స్యకారుల సంక్షేమం అంటే కేవలం ప్రకటనలు చేయడం కాదు... వారి కష్టకాలంలో అండగా నిలవడం. అదే కూటమి ప్రభుత్వ విధానం. అందుకే బీమా పథకంతో పాటు విద్యుత్ సబ్సిడీ, వేట నిషేధ కాల భృతి వంటి ప్రతి అంశంలోనూ గత ప్రభుత్వంతో పోలిస్తే గణనీయంగా అధిక సహాయం అందిస్తున్నామని రాష్ట్ర వ్యవసాయ, పశుసంవర్ధక, మత్స్యశాఖ మంత్రి శ్రీ కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. విద్యుత్ సబ్సిడీ విషయంలోనే రెండు ప్రభుత్వాల మధ్య తేడా స్పష్టంగా కనిపిస్తోందని ఆయన పేర్కొన్నారు. 2023-24లో వైసీపీ ప్రభుత్వ హయాంలో 64,735 విద్యుత్ కనెక్షన్‌లకు కేవలం రూ.724.67 కోట్లు మాత్రమే సబ్సిడీ అందించారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2025-26లో 68,512 కనెక్షన్‌లకు రూ.845 కోట్ల సబ్సిడీ అందించామని తెలిపారు. అంతేకాకుండా 2026-27లో 71 వేల కనెక్షన్‌లకు రూ.1,150 కోట్ల విద్యుత్ సబ్సిడీ ఇవ్వడానికి ప్రభుత్వం ప్రతిపాదించిందన్నారు. గతంలో అమలులో ఉన్న జోన్-నాన్ జోన్ విధానాన్ని పూర్తిగా రద్దు చేయడం ద్వారా మరో 12,500 కొత్త విద్యుత్ కనెక్షన్‌లకు కూడా సబ్సిడీ అందేలా అవకాశం కల్పించామని మంత్రి వెల్లడించారు. మత్స్యకారుల ప్రయోజనాలే లక్ష్యంగా తీసుకున్న ఈ నిర్ణయం వారి ఆర్థిక భారాన్ని గణనీయంగా తగ్గిస్తుందని చెప్పారు.

**వేట నిషేధ కాల భృతిలో రెట్టింపు ఆర్థిక భరోసా**

వేట నిషేధ కాలంలో మత్స్యకార కుటుంబాలకు అండగా నిలవాల్సిన బాధ్యతను గత వైసీపీ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని మంత్రి అచ్చెన్నాయుడు విమర్శించారు. 2023-24లో కేవలం రూ.116.613 కోట్ల వేట నిషేధ కాల భృతిని మాత్రమే పంపిణీ చేసిందన్నారు. 2025-26లో 1,21,433 మంది మత్స్యకారులకు రూ.242.866 కోట్లు పంపిణీ చేసి వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించామని తెలిపారు. అంతేకాకుండా 2026-27లో మరో 12,865 మంది మత్స్యకారులను కొత్తగా చేర్చి, మొత్తం 1,34,298 మంది మత్స్యకారులకు రూ.268.596 కోట్ల వేట నిషేధ కాల భృతిని అందించి ప్రతి అర్హ కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలిచిందని చెప్పారు.జగన్‌మోహన్‌రెడ్డి ... మత్స్యకారుల సంక్షేమంపై మాట్లాడే ముందు మీ ప్రభుత్వ పనితీరును ఒక్కసారి గుర్తు చేసుకోండి. గణాంకాలే మీ ప్రభుత్వ వైఫల్యాన్ని, కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధిని స్పష్టంగా చెబుతున్నాయి.మత్స్యకారుల గురించి కూటమి ప్రభుత్వాన్ని విమర్శించే నైతిక హక్కు మీకు లేదు. మీ పాలనలో జరిగిన నిర్లక్ష్యం, మా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలపై గణాంకాలతో బహిరంగ చర్చకు రావాలని మరోసారి సవాల్ విసురుతున్నాను. ఎవరు మీ సంక్షేమాన్ని విస్మరించారో, ఎవరు కష్టకాలంలో మీకు అండగా నిలిచారో మత్స్యకారులకు ఈ గణాంకాలే స్పష్టంగా చెబుతున్నాయని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

# నిడిమామిడి లో పొలం పిలుస్తోంది కార్యక్రమం



**- సేంద్రియ ఎరువులు, యాజమాన్య పద్ధతులపై అవగాహన.....**

**పుట్టపర్తి రూరల్ ఆగష్టు 05 అనంత జన శక్తి న్యూస్.**

సేంద్రియ ఎరువులు యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని పుట్టపర్తి మండలం నిడిమామిడి గ్రామంలో మండల వ్యవసాయ అధికారి శ్రీ వాణి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇందులో భాగంగా రైతులతో ఈ ఖరీఫ్ సీజన్లో వేసిన వివిధ పంటల్లో ఎరువుల యాజమాన్య పద్ధతులను గురించి వివరించారు.ఈ సంవత్సరం వర్షపాతం పరిస్థితులపై సమీక్ష రైతులతో రాబోవు నెలలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి , ఆగస్టు మాసంలో వర్షం వచ్చినట్లయితే కంది ,కొర్ర ,పెసర, సజ్జ జొన్న పంటలు సాగు చేయడానికి అనుకూలం జూన్ మాసంలో సాగుచేసిన వేరుశనగ కంది మరియు ఆముదం పంటలు బెట్ట గురికాకుండా పొటాషియం నైట్రేట్ అయిదు గ్రాములు లీటర్ నీటి కలిపి పిచికారిచేయాలని సాళ్ల మధ్యలో కలుపు లేకుండా చూసుకోవలనీ, బెట్ట పరిస్థితి నుంచి పంట పైన ప్రభావం తగ్గించడానికి వరుసల మధ్యలో మొక్కల సంఖ్యను తగ్గించాలని, దగ్గర్లో నీటి సదుపాయం ఉన్నచో ఒక తడి ఇవ్వాలని,ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శ్రీ శ్రీవాణి వ్యవసాయ విస్తరణ అధికారి ఆనంద్ నాయక్, ఉద్యాన సహాయకురాలు డింపుల్ చౌదరి, కృష్ణవేణి , నిడిమామిడి గ్రామ రైతులు కేసన్న, చిట్టి బాబు, శాంతి బాయి,లక్ష్మమ్మ, లింగప్ప పాల్గొన్నారు

# అరుదైన గులాబీ సీతాఫలాలు..

**- అనంతగిరి ప్రకృతి ఒడిలో మరో అద్భుతం!**

**అనంతగిరి, ఆగస్టు 05, అనంత జనశక్తి న్యూస్**



అనంతగిరి ప్రకృతి అందాలకు, వైవిధ్యాలకు నిలయంగా మరోసారి తన ప్రత్యేకతను చాటుకుంది. పచ్చని అడవుల మధ్య ప్రకృతి ప్రసాదించిన అరుదైన లేత గులాబీ వర్ణ సీతాఫలాలు స్థానికులను, ప్రకృతి ప్రేమికులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. అనంతగిరి మండలం ఎన్.ఆర్.పురం పరిసర అటవీ ప్రాంతంలో పండిన ఈ ప్రత్యేక సీతాఫలాలు బుధవారం కాశీపట్నం వారపు సంతలో దర్శనమివ్వడంతో వాటిని చూసేందుకు ప్రజలు ఆసక్తి చూపారు. సాధారణంగా సీతాఫలాలు ఆకుపచ్చ లేదా లేత పసుపు రంగులో కనిపిస్తాయి. అయితే ఈ గులాబీ వర్ణ సీతాఫలాలు అత్యంత అరుదుగా లభించే ప్రకృతి వరంగా భావిస్తున్నారు.ఈ పండ్లను చూసినవారంతా వాటి అందాన్ని ఆస్వాదిస్తుండగా, రుచి చూసే అవకాశం దక్కినవారు నిజంగా అదృష్టవంతులేనని స్థానికులు అంటున్నారు.ప్రకృతి తన సృజనాత్మకతను, వైవిధ్యాన్ని అప్పుడప్పుడు ఇలాంటి అరుదైన అద్భుతాల రూపంలో మన ముందుకు తీసుకువస్తుందని వారు పేర్కొంటున్నారు.ప్రకృతి సృష్టించే ఈ అద్భుతాల ముందు మానవ మేధస్సు కూడా ఆశ్చర్యపోవాల్సిందే. అనంతగిరి అడవులు మరోసారి తమ సహజ సంపదతో, అరుదైన ప్రకృతి వైవిధ్యంతో అందరినీ మంత్రముగ్ధులను చేస్తున్నాయి.

# తల్లీ పాలే శిశువుకు తొలి రక్షణ కవచం

**- సూపర్ వైజర్, వరలక్ష్మి**

**పినకోటలో ప్రపంచ తల్లీ పాల వారోత్సవాలు**

**అనంతగిరి, జన శక్తీ న్యూస్, ఆగష్టు05:**

అనంతగిరి మండలం పినకోట అంగన్వాడీ కేంద్రంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను బుధవారం నిర్వహించారు. జీనబాడు సెక్టార్ సూపర్ వైజర్ వరలక్ష్మి ఆధ్వర్యంలో పినకోట పంచాయతీ కేంద్రంలో గల అంగన్వాడీ కేంద్రంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రజలకు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ప్రతి ఏడాది ఆగస్టు 1 నుంచి 7వ తేదీ వరకు నిర్వహించే ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా పంచాయతీలోని అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. శిశువు పుట్టిన వెంటనే తల్లిపాలు ఇవ్వడం అత్యంత అవసరమని చెప్పారు.తొలి ఆరు నెలల వరకు శిశువుకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, అనంతరం రెండు సంవత్సరాల వయస్సు వచ్చే వరకు తల్లిపాలతో పాటు అదనపు పోషకాహారం అందించాలని సూచించారు. ఇలా చేయడం వల్ల పిల్లల శారీరక, మానసిక ఎదుగుదల మెరుగుపడి ఆరోగ్యవంతమైన భవిష్యత్తు ఏర్పడుతుందని వివరించారు.తల్లిపాల వల్ల శిశువులకు రోగనిరోధక శక్తి పెరగడంతో పాటు తల్లి ఆరోగ్యానికీ ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. ప్రతి తల్లి తల్లిపాల ప్రాముఖ్యతను గుర్తించి పిల్లలకు తప్పనిసరిగా అందించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్త,కళావతి,వైద్య సిబ్బంది గ్రామ పెద్దలు,అర్హులైన లబ్ధిదారులు ,గ్రామస్తులు, ఆశ వర్కర్,తదితరులు పాల్గొన్నారు.



# జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ తో ఎమ్మెల్యే దగ్గుపాటి భేటీ



**- నగరంలో అభివృద్ధి కార్యక్రమాలు, సమస్యలపై చర్చ**
**- డంపింగ్ యార్డ్, వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్ అంశాలపై చర్చ**

అనంతపురం ఆగస్ట్ 05 అనంత జనశక్తి న్యూస్

అనంతపురం నగరపాలక సంస్థ ప్రత్యేక అధికారి (కలెక్టర్) ఓ.ఆనంద్ తో అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ భేటీ అయ్యారు. బుధవారం ఉదయం ఆయన కలెక్టరేట్ కు వెళ్లి ప్రత్యేక అధికారి ఆనంద్ తో పలు అంశాల గురించి చర్చించారు. నగరంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, పారిశుద్ధ్యం, డంపింగ్ యార్డ్ వంటి అంశాలపై ప్రధానంగా చర్చించారు. ఇప్పటికే జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేసేలా అధికారులకు ఆదేశాలిస్తామని కలెక్టర్ అన్నారు. ఇంకా చేపట్టాల్సిన పనులకు సంబంధించిన నిధులు కూడా వచ్చేలా చూస్తామని కలెక్టర్ తెలిపారు. డంపింగ్ యార్డ్ లో చెత్త తరలింపు గురించి ప్రత్యేకంగా మాట్లాడారు. ఈ పనులు వేగవంతం సాగుతున్నాయని..ఫ్రెష్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్ ఏర్పాటుకు స్థలం సిద్ధం చేసేలా చూస్తామన్నారు. అలాగే పార్కు నిర్మాణానికి సంబంధించి కూడా కొన్ని అంశాలు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. వర్షాకాలం నేపథ్యంలో నడిమి వంక, మరువ వంక పరిసర ప్రాంతాల్లో ఎక్కడా నీటి ప్రవాహానికి ఇబ్బంది లేకుండా మున్సిపల్ అధికారులు చర్యలు చేపడుతున్నట్టు కలెక్టర్ తెలిపారు. అలాగే ఎమ్మెల్యే దగ్గుపాటి చెప్పిన అంశాలపై సానుకూలంగా స్పందించారు.

## కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య.

శెట్టూరు ఆగస్టు 5 అనంత జనశక్తి న్యూస్



లక్ష్మం0 పల్లి గ్రామానికి చెందిన బెస్త నాగభూషణ తండ్రి. బెస్త పెద్దప్పయ్య. వయస్సు 45 కూలి పనులు చేస్తూ జీవం సాగించే వ్యక్తి మద్యానికి అలవాటు పడి భార్య పిల్లల్ని పట్టించుకోకుండా ఉండేవాడు ఈనెల రెండవ తేదీన తన భార్యతో మద్యం తాగడానికి డబ్బులు అడిగి అప్పటికే మద్యం మత్తులో ఉన్న వ్యక్తి భార్యతాగడానికి డబ్బులు లేవని చెప్పడంతో నీవు డబ్బులు నేను అడిగితే ఇవ్వమంటావా అయితే నేను చనిపోతానని బెదిరించి ఇంటి నుండి. వెళ్లిపోయాడు రెండు రోజులైనా భర్త బెస్త నాగభూషణ ఇంటికి తిరిగి రాలేదు రెండు రోజులైనా భర్త. రాకపోవడంతో అనుమానం వచ్చి చుట్టుపక్కల ఇల్లు వారందరినీ అడిగారు. కానీ చివరగా ఐదవ తేదీ గ్రామస్తులు బోయ బో జ్జప్ప పొలంలో కంపచెట్టుకు బెస్త నాగభూషణం ఉరి వేసుకుని వేలాడుతుండడం గమనించి గ్రామస్తులుసదరు విషయాన్ని నాగభూషణ భార్యకు తెలిపారు నాగభూషణం భార్య బెస్త లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సెట్టూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తును చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు

## నేతన్న సేవ పథకం కు దరఖాస్తుల వెల్లువ



యాడికి, ఆగష్టు 5, అనంత జనశక్తి న్యూస్ :

యాడికి మండల వ్యాప్తంగా నేతన్న సేవ పథకం కు కోసం చేనేత కార్మికులు అధిక సంఖ్యలో దరఖాస్తు వెల్లువెత్తినాయని అధికారులు బుధవారం తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నేతన్న సేవ పథకం ను ఆగష్టు 7 న అమలు చేస్తున్న విషయం తెలిసిందే. ప్రకటించిన జాబితా లో తప్పులు ఉన్న చేనేత కార్మికులు మారలా దరఖాస్తు చేసుకోన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన గడువు బుధవారం తో ముగిసింది. నేతన్న సేవ పథకం అమలుకు కేవలం 2 రోజులు మాత్రమే ఉండడం తో చేనేత కార్మికులు ఆందోళన చెందుతున్నారు . అర్హత ఉన్న చేనేత కార్మికులకు న్యాయం జరుతుందా......లేదా ......
అని రెండు రోజులు వేచి చూడాల్సిందే అని చేనేత కార్మికులు తెలిపారు.ఏది ఏమైనప్పటికీ అర్హత ఉన్న చేనేత కార్మికులకు నేతన్న సేవ పథకం వర్తించాలని చేనేత కార్మికులు తెలిపారు.

# చేతనైతే ఆధారాలతో మాట్లాడండి.. లేదంటే సైలెంట్ గా కూర్చోండి

**- మెగా డీఎస్సీపై వైసీపీ ఆరోపణల మీద ఎమ్మెల్యే దగ్గుపాటి ఆగ్రహం**
**- నారాయణపురం గ్రామంలో ఇంటింటికీ కూటమి ప్రభుత్వం**
**- గత ప్రభుత్వానికి, కూటమి ప్రభుత్వానికి తేడా గమనించాలన్న ఎమ్మెల్యే**
**- రాయలసీమ ప్రాజెక్టులను ఏరోజైనా పట్టించుకున్నారా అని నిలదీసిన దగ్గుపాటి**

అనంతపురం ఆగస్ట్ 05, అనంత జనశక్తి న్యూస్



మెగా డీఎస్సీపై ఆరోపణలు చేస్తున్న వైసీపీ వద్ద ఆధారాలు ఉంటే మాట్లాడాలని.. లేదంటే సైలెంట్ గా కూర్చోవాలని అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. నియోజకవర్గ పరిధిలోని నారాయణపురం గ్రామంలో ఇంటింటికీ కూటమి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. స్థానిక నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. భువనేశ్వర్ నగర్ లో ఆయన కూటమి నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. నారాయణపురం పంచాయతీలో గతంలో ఎప్పుడూ లేని విధంగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఈ ప్రాంతంలో ప్రజలకు బ్రిడ్జి, రోడ్లు, డ్రైనేజీల సమస్యలకు పరిష్కారం చూపించామన్నారు. గత ప్రభుత్వంలో ఏం చేశారు..కూటమి ప్రభుత్వంలో ఏం జరుగుతోందన్నది ప్రజలు గమనించాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందుతున్నాయని.. అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి జరుగుతోందన్నారు. ఇది కక్షలు, కార్పణ్యాలు తీర్చుకుని గొడ్డలి పార్టీ కాదని.. ప్రజా క్షేమం కోరే కూటమి పాలన అని దగ్గుపాటి అన్నారు. గత ప్రభుత్వంలో విద్యావ్యవస్థను నాశనం చేస్తే.. అలాంటి శాఖను మంత్రి నారా లోకేష్ ఛాలంజింగ్ గా తీసుకున్నారన్నారు. కార్పొరేట్ విద్యా సంస్థలకు మించిన స్థాయిలో బడులను మార్చారన్నారు. 16347ఉపాధ్యాయ పోస్టులను ఎలాంటి వివాదం లేకుండా భర్తీ చేస్తే.. దీనిపై వైసీపీ నాయకులు పూటకో రాద్ధాంతం చేస్తున్నారన్నారు. రాయలసీమ గురించి ఇక్కడి ప్రాజెక్టుల గురించి కానీ వైసీపీ నాయకులు ఏరోజైనా పట్టించుకున్నారా అని నిలదీశారు. ఈ రోజు హార్టికల్చర్ హబ్ కు 40వేల కోట్లు కేటాయించారని.. పీపీపీ మోడల్లో మరో 60వేల కోట్లు తీసుకొస్తున్నారన్నారు. లక్షల కోట్ల పెట్టుబడులు రాయలసీమకు తీసుకొచ్చారని.. ప్రతిష్టాత్మక సంస్థలు ఇక్కడ పరిశ్రమలు నెలకొల్పుతున్నాయన్నారు. ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చడమే కాకుండా పోలవరం, అమరావతి వంటి ప్రతిష్టాత్మక ప్రాజెక్టులను పూర్తి చేస్తున్నారన్నారు. వైసీపీ నాయకులు కేవలం ప్రభుత్వంపై బురదచల్లాలనే రోజుకో వివాదం సృష్టిస్తున్నారని.. వారు ఇప్పటికైనా నిరాధార ఆరోపణలు మానుకోకపోతే ప్రజలే బుద్ధి చెబుతారని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో 1వ క్లస్టర్ ఇంచార్జ్ డిష్ నాగరాజు, టిడిపి నగర అధ్యక్షుడు సుధాకర్ యాదవ్, ప్రధాన కార్యదర్శి ఫిరోజ్ అహ్మద్, టిడిపి రాష్ట్ర కార్యదర్శులు తలారి ఆదినారాయణ, సంగా తేజస్విని, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ అర్షదుల్లా, నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ కడియాల కొండన్న, క్లస్టర్ ఇంచార్జ్ లు దళావాయి వెంకటనారాయణ, వన్నూరప్ప, టిడిపి నాయకులు మారుతి కుమార్ గౌడ్, సున్నం శ్రీనివాసులు, రఘునాథ్, రమేష్, డాక్టర్ హరి ప్రసాద్, సింగవరం వ్యక్తం, నెట్టెం బాలకృష్ణ, అశ్విని, మాధవి, వరాలమ్మ, వెంకటలక్ష్మి, అక్షిత, శోభ, అయేషా నేహా, యశోద టిడిపి నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

# జవహర్ నవోదయ విద్యాలయంలో అంగరంగ వైభవంగా 'నవోదయ ఫౌండేషన్ డే' వేడుకలు

**- ముఖ్య అతిథిగా హాజరైన శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్**
**- పది, పన్నెండో తరగతుల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు కలెక్టర్ చేతుల మీదుగా బహుమతుల ప్రదానం**
**- ఆకట్టుకున్న యోగా డాన్స్, క్లాసికల్ నృత్య ప్రదర్శనలు**

లేపాక్షి ఆగస్టు 5:అనంత జనశక్తి న్యూస్




శ్రీ సత్యసాయి జిల్లా లేపాక్షిలోని జవహర్ నవోదయ విద్యాలయంలో బుధవారం 'నవోదయ ఫౌండేషన్ డే' వేడుకలు అత్యంత వేడుకగా, అంగరంగ వైభవంగా నిర్వహించబడ్డాయి.ఉదయం 11:00 గంటలకు ప్రారంభమైన ఈ కార్యక్రమానికి శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ వేడుకలకు విద్యాలయ ప్రిన్సిపాల్ నాగరాజు అధ్యక్షత వహించారు.కార్యక్రమం ప్రారంభంలో ప్రిన్సిపాల్ నాగరాజు స్వాగతోపన్యాసం చేస్తూ, నవోదయ విద్యాలయాల ఆవిర్భావం మరియు ఫౌండేషన్ డే ప్రాముఖ్యతను వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించడంలో నవోదయ సంస్థలు పోషిస్తున్న పాత్రను ఆయన కొనియాడారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... లేపాక్షి జవహర్ నవోదయ విద్యాలయ (JNV) విద్యార్థులు SSC, ఇంటర్మీడియట్ ఫలితాల్లో సాధించిన ప్రతిభను జిల్లా కలెక్టర్ అభినందించారు.జిల్లా వ్యాప్తంగా టెన్త్ క్లాస్ పాస్ శాతం 80% కాగా, JNV లేపాక్షి 100% ఉత్తీర్ణత సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.జూడో క్రీడలో 24 మంది విద్యార్థులు జాతీయస్థాయికి ఎంపిక కావడంపై ప్రత్యేక ప్రశంసలు తెలిపారు.విద్య అంటే కేవలం పుస్తకాల సమాచారాన్ని భట్టీ పట్టడం కాదు,ఆలోచించడం, విశ్లేషించడం, కొత్త ఆవిష్కరణలు చేయడమే అసలైన విద్య అని పేర్కొన్నారు. తల్లిదండ్రులు, గురువులతో పాటు సమాజంలో సేవలు అందిస్తున్న ప్రతి ఒక్కరి పట్ల కృతజ్ఞత కలిగి ఉండాలని సూచించారు.ఉన్నత స్థాయికి ఎదిగిన తర్వాత సమాజానికి తమ వంతు సేవ చేయడం అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. పట్టు గూడు నుంచి సీతాకోకచిలుక సహజంగా బయటకు వచ్చినట్లే, జీవితంలో ఎదురయ్యే సవాళ్లను కష్టపడి జయించాలని, గెలుపుకు కుదరదారు లేవని స్పష్టం చేశారు.అనంతరం విద్యాసంవత్సరంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన పదవ మరియు పన్నెండవ తరగతి విద్యార్థులకు జిల్లా కలెక్టర్ గారి చేతుల మీదుగా ప్రతిభా పురస్కారాలు మరియు సత్కారం అందించారు.

10వ తరగతి ప్రతిభావంతులు:కె. లాస్య రెడ్డి - 98% (జిల్లా/పాఠశాల మొదటి ర్యాంకు)
కె. కిరణ్ తేజ - 94.6% (రెండవ ర్యాంకు)
ఎస్. అభిరామ్ - 94.4% (మూడవ ర్యాంకు)
వై. స్నేహలత - 94.4% (మూడవ ర్యాంకు)
12వ తరగతి ప్రతిభావంతులు:ఎస్. చిత్రలేఖ - 87.4% (మొదటి ర్యాంకు)
పి. హేమలత - 86.2% (రెండవ ర్యాంకు)
ఎన్. కార్తీక్ సాయి - 85.6% (మూడవ ర్యాంకు)ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

ఫౌండేషన్ డే వేడుకల్లో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.జెఎన్వి మదనపల్లె విద్యార్థులు ప్రత్యేకంగా ఇంటూషన్ ప్రోగ్రామ్ (Intuition Program) ప్రదర్శించి సభను అలరించారు.జెఎన్వి లేపాక్షి విద్యార్థులు ప్రదర్శించిన రిథమిక్ యోగా డాన్స్ మరియు క్లాసికల్ డాన్స్ ప్రదర్శనలు సభలో విశేష ప్రశంసలు అందుకున్నాయి.ఈ వేడుకల్లో పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు వేమనారాయణ, డాక్టర్ వెంకట రమణ, రాజా రెడ్డి, మరియు రమణా రెడ్డి తదితరులు పాల్గొని విద్యార్థులకు తమ మద్దతు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో లేపాక్షి తహశీల్దార్ సౌజన్యలక్ష్మి ,పాఠశాల ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది, విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు.

# లేపాక్షిలో జిల్లా కలెక్టర్ విస్తృత పర్యటన

**- తహసీల్దార్ కార్యాలయంలో ఇంకుడు గుంత నిర్మాణానికి భూమి పూజ**
**- లేపాక్షి తహసీల్దార్‌కు జిల్లా కలెక్టర్ అభినందనలు**
**- తహసీల్దార్ కార్యాలయ పరిశుభ్రత, మెరుగైన రికార్డుల నిర్వహణపై ప్రశంసలు**
**- కార్యాలయ రికార్డులు, BLO-BLA సమావేశాల పరిశీలన**
**- జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్**

లేపాక్షి,ఆగస్టు 5:అనంత జనశక్తి న్యూస్



శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ బుధవారం లేపాక్షి మండలంలో విస్తృతంగా పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. వర్షపు నీటి యాజమాన్యం ఇంకుడు గుంతకు భూమి పూజ...
వర్షపు నీటిని భూగర్భంలోకి మళ్లించి నిల్వ చేసేందుకు వీబీజీ రామ్ జీ (VBG RAM G) కార్యక్రమంలో భాగంగా, లేపాక్షి తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేయనున్న ఇంకుడు గుంత నిర్మాణానికి జిల్లా కలెక్టర్ భూమి పూజ నిర్వహించారు.నీటి సంరక్షణలో భాగంగా ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో వర్షపు నీటిని నిల్వ చేసే వ్యవస్థలను బలోపేతం చేయాలన్నారు. లేపాక్షి తహసీల్దార్‌కు జిల్లా కలెక్టర్ అభినందనలు... తహసీల్దార్ కార్యాలయ భవనం, ఆవరణ పరిశుభ్రత మరియు రికార్డు రూమ్‌లో రికార్డులను అత్యంత పద్ధతిగా, పర్ఫెక్ట్‌గా మెయింటెన్ చేయడం పట్ల లేపాక్షి తహసీల్దార్‌ను, రెవెన్యూ సిబ్బందిని జిల్లా కలెక్టర్ అభినందించి ప్రశంసించారు.ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించడంతో పాటు, రికార్డులను పక్కాగా భద్రపరచడంలో లేపాక్షి తహసీల్దార్ కార్యాలయం ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు. ఇదే పనితీరును ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. తహసీల్దార్ కార్యాలయం & రికార్డుల తనిఖీ...
అనంతరం తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్, కార్యాలయ పనితీరుతో పాటు రికార్డు గదిని నిశితంగా పరిశీలించారు. రికార్డుల నిర్వహణ పద్ధతి, కార్యాలయ పరిశుభ్రత పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు.ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (SIR) కు సంబంధించి BLO BLA సమావేశాల రికార్డులను తనిఖీ చేశారు. అన్‌కలెక్టబుల్ ఓటర్లుగా వర్గీకరించిన మరణించిన వారు, ఇతరులు, వేరే చోట నమోదు చేసుకున్న వారు, శాశ్వతంగా వేరే ప్రాంతానికి మారిన వారు, మరియు ఆచూకీ లేని ఓటర్లకు సంబంధించిన ప్రతి ఫైలును ఆయన క్షుణ్ణంగా తనిఖీ చేశారు.ప్రస్తుతం జరుగుతున్న ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియలో 'నో మ్యాపింగ్' మరియు ఇతర వ్యత్యాసాలకు సంబంధించి జారీ చేసిన నోటీసులను, పరిశీలన నివేదికలను కలెక్టర్ సవివరంగా తనిఖీ చేశారు. ఓటర్ల జాబితా సవరణలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పారదర్శకంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో లేపాక్షి తహశీల్దార్ సౌజన్య లక్ష్మి,ఎంపిడిఓ,పంచాయతీ కార్యదర్శి సావిత్రి,డిప్యూటీ తహసీల్దార్,రెవెన్యు సిబ్బంది పాల్గొన్నారు.

# మధ్యవర్తిత్వం రాజీమార్గం పై అవగాహన కార్యక్రమం



పల్నాడు ఆగస్టు 05, అనంత జనశక్తి న్యూస్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశానుసారం మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ సీనియర్ సివిల్ జడ్జి వి.విజయకుమార్ రెడ్డి సూచనలతో బుధవారం పల్నాడు జిల్లా అమరావతిలో మధ్యవర్తిత్వం రాజీమార్గం పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా స్థానిక ప్రజలకు మధ్యవర్తిత్వం (Mediation) ప్రాముఖ్యతను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు.అనంతరం పారా లీగల్ వాలంటీర్ షేక్ సుభాని మాట్లాడుతూ, సివిల్ తగాదాలు, బ్యాంకు రుణాలకు సంబంధించిన కేసులు, రాజీపడదగిన క్రిమినల్ కేసులు, మనోవర్తి కేసులు, చెక్ బౌన్స్ కేసులు, రెవెన్యూ వివాదాలు, ప్రీ-లిటిగేషన్ కేసులను మధ్యవర్తిత్వం ద్వారా పరస్పర అంగీకారంతో పరిష్కరించుకోవచ్చని తెలిపారు. సత్తెనపల్లి కోర్టు పరిధిలోని కక్షిదారులు కోర్టు పనివేళల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సత్తెనపల్లి బస్టాండ్ సమీపంలోని మార్కెట్ యార్డ్ నందు గల కోర్టు నందు గల కోర్టు సిబ్బందిని సంప్రదించి, మధ్యవర్తిత్వ సేవలను వినియోగించుకుని తమ వివాదాలను సామరస్యపూర్వకంగా పరిష్కరించు కోవచ్చని సూచించారు.ఈ కార్యక్ర మంలో పారా లీగల్ వాలంటీర్ అట్లూరి జ్యోతి పాల్గొని మధ్యవర్తిత్వ విధానం, ఉచిత న్యాయ సేవలు, న్యాయ సేవాధి కార సంస్థ ద్వారా అందిస్తున్న వివిధ సేవలపై ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు

# బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించినా కఠిన చర్యలు

**- జిల్లా ఎస్పీ సతీష్ కుమార్...**

**పుట్టపర్తి రూరల్ ఆగష్టు 05**

**అనంత జన శక్తి న్యూస్.**

శ్రీ సత్య సాయి జిల్లా వ్యాప్తంగా వాహనం నడుపుతూ బహిరంగ ప్రదేశాల్లో, మద్యం సేవించిన కఠిన చర్యలు తప్పవని శ్రీ సత్య సాయి జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ పేర్కొన్నారు.

ఈ తనిఖీల్లో భాగంగా జిల్లా వ్యాప్తంగా బుధవారం మద్యం సేవించి వాహనాలు నడిపిన 11 మంది వాహనదారులపై కేసులు నమోదు చేసి, మొత్తం రూ.1,00,000 జరిమానాలు విధించారు. అదనంగా ఒక వ్యక్తికి న్యాయస్థానం 7 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది.జిల్లా వ్యాప్తంగా పట్టణ గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల పైన బహిరంగ ప్రదేశాల్లో జిల్లా పోలీసులు ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారనీ,

ఈ తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 7 మందిని గుర్తించి, బుధవారం పలువురుని రెండవ అదనపు న్యాయమూర్తి వారి ఎదుట హాజరుపరిచారు. విచారణ అనంతరం 6 మందికి ఒక్కొక్కరికి రూ.10,000 చొప్పున మొత్తం రూ.60,000 జరిమానా విధించగా, మరో వ్యక్తికి 7 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించినట్లు సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

ఇతర పోలీస్ స్టేషన్ల పరిధిలో చర్యలు పట్నం, ఎన్.పి.కుంట మరియు ఆగలి పోలీస్ స్టేషన్ పరిధిలో మరో నలుగురు వాహనదారులకు ఒక్కొక్కరికి రూ.10,000 చొప్పున మొత్తం రూ.40,000 జరిమానా విధించారు.మద్యం సేవించి వాహనాలు నడపడం, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం చట్టరీత్యా నేరమే కాకుండా ప్రాణాంతక ప్రమాదాలకు దారితీసే చర్యలు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించి, మద్యం సేవించిన అనంతరం ఎట్టి పరిస్థితుల్లోనూ వాహనాలు నడపకూడదని జిల్లా ఎస్పీ సతీష్ కుమార్, సూచించారు.




ప్రజల ప్రాణ భద్రతకు భంగం కలిగించే విధంగా మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిపైనా, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన వారిపైనా చట్టపరంగా కఠిన చర్యలు కొనసాగుతాయని జిల్లా ఎస్పీ హెచ్చరించారు.

# అభివృద్ధికి .... సమగ్ర కార్యాచరణ

**- రోడ్లు, బస్ షెల్టర్లు, ఉపాధి పనుల పై హరీష్ బాబు సమీక్ష...**

**- ప్రతి గ్రామానికి మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యం....**

**- ప్రతిపాదనలు వెంటనే సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశం...**

**ధర్మవరం / బత్తలపల్లి**

**ఆగష్టు 5 అనంత జనశక్తి న్యూస్ :**

ధర్మవరం బత్తలపల్లి మండలంలో గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధి, ఉపాధి హామీ పనుల వేగవంతమైన అమలుకు చర్యలు చేపట్టాలని మంత్రి నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీష్ బాబు అధికారులను ఆదేశించారు. రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మరియు వైద్య విద్య శాఖ మంత్రి, సత్యకుమార్ యాదవ్ ఆదేశాల మేరకు ధర్మవరంలోని ఎన్డీఏ కార్యాలయంలో బుధవారం బత్తలపల్లి మండల ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో మండలంలో చేపట్టాల్సిన బీటీ, సీసీ, గ్రావెల్ రోడ్ల నిర్మాణాలు, బస్ షెల్టర్ల ఏర్పాటు, వీబీజీ-రామ్‌జీ (వీబీజీ -రామ్ జీ ) ఉపాధి పనులపై విస్తృతంగా చర్చించారు. అధికారుల నివేదిక ప్రకారం మండలంలో కొత్తగా 72 సీసీ రోడ్లు, 114 గ్రావెల్ రోడ్లు అవసరమని గుర్తించారు. అలాగే వేల్పుమడుగు అక్కమ్మగారి ఆలయానికి ఒక కిలోమీటరు బీటీ రోడ్డు, 10 మీటర్ల వంతెన, సుబ్బరాయనపేట-ఏలుకుంట్ల, అనంతసాగరం-వెంకటగారిపల్లి, రామాపురం-చిన్నగుంటపల్లి మార్గాల్లో రోడ్ల నిర్మాణంతో పాటు పలు గ్రామాల్లో బస్ షెల్టర్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. వీబీజీ-రామ్‌జీ ఉపాధి పనులపై ప్రత్యేకంగా సమీక్షించిన హరీష్ బాబు, గ్రామాల్లో ఉపాధి అవకాశాలు పెంచడంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలను ఉపాధి హామీ పనులతో అనుసంధానం చేయాలని అధికారులకు సూచించారు. ప్రతి గ్రామంలో అవసరమైన పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు.



ఈ సందర్భంగా హరీష్ బాబు మాట్లాడుతూ, ప్రతిపాదిత పనుల అంచనాలు, సాంకేతిక వివరాలను త్వరితగతిన సిద్ధం చేసి అందించాలని అధికారులను కోరారు. వాటిని మంత్రి సత్యకుమార్ యాదవ్ దృష్టికి తీసుకెళ్లి అవసరమైన పరిపాలనా అనుమతులు, నిధుల మంజూరుకు కృషి చేస్తామని తెలిపారు. మంత్రి సత్యకుమార్ యాదవ్ నాయకత్వంలో బత్తలపల్లి మండలంలోని ప్రతి గ్రామానికి అవసరమైన రోడ్లు, బస్ షెల్టర్లు,

వంతెనలు, ఉపాధి పనులు దశలవారీగా అమలు చేసి మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.

సమావేశంలో బత్తలపల్లి మండల బీజేపీ అధ్యక్షుడు ఆకులేటి భాస్కర్, ఆకులేటి వీరనారప్ప, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

# ఘనంగా ఎమ్మెల్యే సురేంద్రబాబు జన్మదిన వేడుకలు

**- ప్రభుత్వాసుపత్రిలో పాలు బ్లడ్ లో పళ్ళు పంపిణీ**

**- నిరంతరం ప్రజా సమస్యలపై చర్చించే వ్యక్తి ఎమ్మెల్యే అమిలినేని**

**- ఉచిత డీఎస్సీ కోచింగ్ పేద విద్యార్థులకు సైకిల్ పంపిణీ విరాళాలు కుట్టు మిషన్లు బోర్లు వాటర్ ప్లాంట్ లు**

**- ఎమ్మెల్యే అమిలినేని అభివృద్ధి కంటికి కనిపిస్తున్నది .. నియోజకవర్గ ప్రజలు**

**- జన్మదిన వేల ఎమ్మెల్యే అమిలినేని అభివృద్ధిని కొనియాడిన ప్రజలు**

**కళ్యాణదుర్గం టౌన్ ఆగష్టు 05 జనశక్తి న్యూస్**




నియోజకవర్గ వ్యాప్తంగా కంబదూర్ బ్రహ్మసముద్రం కుందుర్పి శెట్టూరు కళ్యాణదుర్గం మండల ప్రతి గ్రామ పల్లెల లో బుధవారం ఎమ్మెల్యే సురేంద్రబాబు పుట్టినరోజు సందర్భంగా అభిమానులు కార్యకర్తలు నాయకులు యువత పుట్టినరోజు వేడుక ను వారి స్వగ్రామాల లో జాతరను తలపించేలా బాణసంచా పేల్చి కేక్ కట్ చేసి మిఠాయిలు పంచుతూ అంగరంగ వైభవంగా ప్రతి గ్రామాన నిర్వహించారు. అనంతరం ప్రతి గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు అభిమానులు నాయకులు కార్యకర్తలు రెండు సంవత్సరాల కాలంలో నియోజకవర్గ వ్యాప్తంగా ఆయన చేసిన సేవలను తెలిపారు. ఉచిత డీఎస్సీ కోచింగ్ ఎంతోమంది నిరుద్యోగ యువతకు డీఎస్సీ సాధించాలనే సంకల్పంతో భాగ్యనగరాలకు వెళ్లి లక్షలు ఖర్చు చేసేవారు ఎమ్మెల్యే అమిలినేని వారి సమస్యలు తెలుసుకుని ఉచిత డీఎస్సీ కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేసి ఉచిత భోజన సదుపాయం కల్పించారు. ఎంతోమంది డీఎస్సీ కి ఎంపికయ్యారు.

విరాళాలు

ప్రతి పల్లె లో అర్ధాంతంగా నిలిచిపోయిన దేవాలయాలు నూతన నిర్మాణ దేవాలయాలు మసీదులు క్రిస్టియన్ చర్చలు పేద మధ్య తరగతికి చెందిన ఎంతోమందికి అనారోగ్య సమస్యలు తలెత్తితే పార్టీలకు అతీతంగా ఆర్థిక సహాయం చేసిన మానవత్వవాది స్నేహశీలి మనసున్న మహారాజు ఎమ్మెల్యే సురేంద్రబాబు ఉచిత కుట్టు మిషన్లు

కుట్టు మిషన్ వృత్తి ద్వారా జీవనం ఉపాధి పొందే ఎంతోమంది మహిళలకు ఉచిత కుట్టు మిషన్ లు పంపిణీ చేసి వారి అభ్యున్నతికి ఎమ్మెల్యే అమిలినేని తోడ్పడ్డారు.

రక్తదాన శిబిరాలు ఏర్పాటు రెండు సంవత్సరాలుగా మూడుసార్లు రక్తదాన కార్యక్రమాలు ఏర్పాటు చేసి రక్తదానం చేసి ప్రాణదాతలు అయ్యేలా చొరవ చూపారు. సీఎం చంద్రబాబు జన్మదిన సందర్భంగా మొన్న ఏర్పాటుచేసిన రక్తదాన కార్యక్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా అత్యధికంగా 7500 పై సభ్యులు రక్తదానం ఎమ్మెల్యే అమిలినేని ఆధ్వర్యంలో చేశారు.

బీటీపీ కాల్వ పనులు .. గ్రామీణ ప్రాంతాలకు నూతన రోడ్లు నియోజకవర్గ రైతులు ప్రజలు ఎన్నో ఏళ్ల కలయిన భైరవాణి తిప్ప ప్రాజెక్ట్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి ఇప్పటి కే ప్రధాన రహదారుల వద్ద బ్రిడ్జి నిర్మాణాలు పూర్తయ్యాయి కాలువ పనులు పరుగులు పెడుతున్నాయి తన సొంత నిధులతో గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే రహదారులు అద్వానప స్థితికి చేరిన రోడ్లను గుర్తించి పనులు శరవేగంగా జరుగుతున్నాయి

పాఠశాలకు సొంత నిధులు నాయకులు కార్యకర్తలు వారి గ్రామాలలో అద్వానపు స్థితికి చేరిన ప్రభుత్వ పాఠశాల పరిస్థితులను తెలపడంతో పాలవాయి అయ్యగార్లపల్లి మొదలగు పాఠశాలకు బెంచులు సొంత నిధులతో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు చదువుకునే పిల్లలకు అన్ని సౌకర్యాలు ఉండగానే సంకల్పంతో సొంత నిధులతో పాఠశాల రూపరేఖలు మార్చారు.

# ప్రతిభకు అభినందనలు..

**- కరాటే లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించిన వన్ టౌన్ సిఐ రెడ్డప్ప.**

**ధర్మవరం ఆగష్టు 5, అనంత జనశక్తి న్యూస్:**

పట్టణంలోని కాగితాల వీధిలో గల ప్రణవసాయి పాఠశాలలో ప్రతిభ ఘనపరిచిన కరాటే విద్యార్థులను వన్ టౌన్ సిఐ రెడ్డప్ప అభినందన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో జరిగిన ఓ కార్యక్రమంలో వారు ముఖ్యఅతిథిగా పాల్గొని సమాజంలో జరుగుతున్న వాటి గూర్చి విద్యార్థులకు అవగాహన నిర్వహించారు. అనంతరం తమిళనాడులో జరిగిన కరాటే టోర్నమెంట్లో ట్రోఫీలు సాధించిన అండర్ 13 లో మొదటి స్థానం శ్రీ చందనఏడవ తరగతి, రెండవ స్థానం కె మోక్షిత 9వ తరగతి, అండర్ 9 లో మొదటి స్థానం బి హేమంత్ కు సిఐ రెడ్డప్ప చేతుల మీదుగా టోపీలను విద్యార్థులకు అందజేశారు. తదుపరి సిఐ రెడ్డప్పను ప్రణవసాయి స్కూల్ మేనేజ్మెంట్ కరెస్పాండెంట్ కృష్ణ కిషోర్, హెడ్మాస్టర్ ఆదిలక్ష్మి, ఉపాధ్యాయులు రమేష్, తదితరులు ఘనంగా సన్మానించారు.




# తల్లి పాలు తోనే శిశువుకు సంపూర్ణ ఆరోగ్యం..

**గాండ్లపెంట, ఆగస్ట్ 5, అనంత జనశక్తి న్యూస్,**

మండల పరిధిలోని సోమయాజులపల్లి పంచాయతీ అంగనవాడీ కేంద్రంలో బుధవారం తల్లి పాలు వారోత్సవాల సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సామాజిక ఆరోగ్య అధికారి నగేష్ మాట్లాడుతూ శిశువు పుట్టిన గంటలోపే తల్లి పాలు పట్టించాలని, తల్లి పాలే తొలి ఆహారం, తొలి టీకా అని తెలిపారు. తల్లి పాలతో శిశువుకు రోగనిరోధక శక్తి పెరగడంతో పాటు తల్లికి కూడా ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని వివరించారు. వ్యక్తిగత పరిశుభ్రత, పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు ఉపేంద్రరెడ్డి, విజయకుమారి, ఆరోగ్య కార్యకర్త శ్రీకళ, అంగనవాడీ టీచర్లు ఈశ్వరమ్మ, అంజినమ్మ, పార్వతి, భాగ్యలక్ష్మి, భారతి, రోజారమణి, చంద్రకళ, ఆశా కార్యకర్తలు ఉమారాణి, లక్ష్మీదేవి పాల్గొన్నారు.



# అమ్మ భగవాన్ చే సామూహిక సీమంతాలు

**సామర్లకోట, ఆగస్టు 5 :అనంత జనశక్తి న్యూస్**

పరంజ్యోతి అమ్మ భగవాన్ సేవా సంస్థ ఆద్వర్యంలో సామర్లకోట ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే గర్భిణీలకు సీమంతాల కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. గర్భిణీలకు పసుపు, కుంకుమ, గాజులు, చీర వంటి వస్తువులను గర్భిణీలకు అందచేసి వారికి పోషకాహారం అందచేశారు. ఈ సందర్భంగా సేవా సంస్థ సభ్యులు మాట్లాడుతూ పుట్టే పిల్లలు మంచిగా అందకరమైన భవిష్యత్తుతో ఉండాలనే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో రమణ మూర్తి, కంచర్ల సత్యానందం, అనిత, విజయలక్ష్మి. శ్రీలక్ష్మి, పాలూరు వాణి, కాపుగంటి వాణి, రత్నమాల, ధనలక్ష్మి, ఆసుపత్రి వైద్యులు పాల్గొన్నారు.



# వృక్ష వైవిధ్యంపై విద్యార్థులకు అవగాహన



**- ఎస్కేయూ వృక్షశాస్త్ర ఉద్యానవనాన్ని సందర్శించిన మాంటిస్సోరి ఎలైట్ విద్యార్థులు**

**అనంతపురం, ఆగస్టు 5:అనంత జనశక్తి న్యూస్**

విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణ, జీవవైవిధ్యంపై అవగాహన పెంపొందించేందుకు మాంటిస్సోరి ఎలైట్ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో విద్యా పర్యటన నిర్వహించారు. కళాశాలకు చెందిన 18 మంది విద్యార్థులు, నలుగురు అధ్యాపకులు బుధవారం శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయ వృక్షశాస్త్ర ఉద్యానవనాన్ని సందర్శించారు.ఈ సందర్భంగా ఉద్యానవన డైరెక్టర్ ప్రొఫెసర్ బి. రవి ప్రసాద్ రావు వృక్షశాస్త్ర ఉద్యానవనం ఆవిర్భావం, లక్ష్యాలు, జీవవైవిధ్య పరిరక్షణ ప్రాధాన్యతపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విద్యార్థులకు వివరించారు. అనంతరం ఉద్యానవనంలోని వివిధ విభాగాలను సందర్శించిన విద్యార్థులు అరుదైన, స్థానిక, అంతరించిపోతున్న వృక్ష జాతులను పరిశీలించారు. ప్రొఫెసర్ రవి ప్రసాద్ రావు వివిధ వృక్ష జాతుల ప్రత్యేకతలు, వాటి సహజ చరిత్ర, పర్యావరణ సమతుల్యతలో వాటి పాత్రను వివరించి, వృక్ష సంపదను సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు.ఈ విద్యా పర్యటన విద్యార్థుల్లో ప్రకృతి, వృక్ష సంపద, జీవవైవిధ్య పరిరక్షణపై ఆసక్తి, అవగాహన పెంపొందించిందని కళాశాల అధ్యాపకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో డా. ఎ. రమ్య శ్వేతతో పాటు ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

# శాంతిభద్రతలు, మహిళల రక్షణే ధ్యేయం




**- బీకేఎస్ ఎస్ఐ ఆంజనేయులు**

**- వడియంపేట, కొత్తపల్లి గ్రామాల్లో స్ట్రీట్ కార్నర్ సమావేశాలు**

**అనంతపురం రూరల్ ఆగస్టు 05, అనంత జనశక్తి న్యూస్**

మహిళల భద్రత, సైబర్ నేరాల పట్ల ప్రజలు అవగాహన కలిగి ఉండాలని బుక్కరాయసముద్రం ఎస్ఐ పి.వై. ఆంజనేయులు సూచించారు. బుధవారం స్థానిక సిబ్బంది, గ్రామ మహిళా పోలీసులతో కలసి ఆయన వడియంపేట, కొత్తపల్లి గ్రామాల్లో స్ట్రీట్ కార్నర్ సమావేశాలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడతూ... అత్యవసర సమయంలో మహిళల రక్షణ కోసం 'శక్తి యాప్' ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. యాప్ వినియోగంపై గ్రామస్తులకు ప్రత్యక్షంగా అవగాహన కల్పించారు. సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తూ, ఎవరైనా మోసపోతే తక్షణమే 1930 టోల్ ఫ్రీ నంబరుకు ఫిర్యాదు చేయాలని సూచించారు.సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా వినియోగించాలని, తప్పుడు వార్తలను నమ్మవద్దని కోరారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామ మహిళా పోలీసులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# బలమైన భవిష్యత్తుకు తల్లిపాలే పునాది



**- డబ్బా పాలు వద్దు తల్లిపాలే ముద్దు**

**- పుట్టిన బిడ్డకు ముర్రిపాలే సంపూర్ణ పోషకాలు**

**అమడగూరు ఆగస్టు 5, అనంత.జనశక్తి.న్యూస్.**

**అమడగూరు మండలంలోని తుమ్మల పంచాయతీ కొత్తపేట ,అంగన్వాడి,కార్యాలయంలో సూపర్వైజర్ గంగాదేవి,ఎ,మ్మెల్, హెచ్ పి రెడ్డమ్మ, ఆధ్వర్యంలో ఘనంగా తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు ఈ సందర్భంగా సూపర్వైజర్ గంగాదేవి పాల్గొని ఆమె మాట్లాడుతూ బలమైన భవిష్యత్తుకు తల్లిపాలే పునాదిలాంటివి పుట్టిన బిడ్డకు ముర్రుపాలే సంపూర్ణ పోషకాలని ప్రతి సంవత్సరం ఆగస్టు ఒకటి నుంచి వారం రోజులపాటు అంతర్జాతీయ తల్లిపాల వారోత్సవాలు జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందన్నారు తల్లి బిడ్డకు ముర్రిపాలు పట్టించడం ద్వారా వ్యాధి నిరోధక శక్తి పెరిగి శిశువుకు రోగాలు దరిచేరవని సరైన అవగాహన లేని కారణంగా మురిపాలు బిడ్డకు స్థాపించకపోవడంతో త్వరగా వ్యాధి బారిన పడే ప్రమాదం ఉంటుందని బిడ్డకు తల్లిపాలు ఇవ్వడం వల్ల తల్లికి రొమ్ము క్యాన్సర్ రాదన్నారు తల్లి పాలలో కణిజాలు మాంసకృతులు విటమిన్ ఏ సమృద్ధిగా ఉంటాయని పిల్లలకు ఆస్తమా మలబద్ధకం రాకుండా ఉంటాయని వివరించారు అప్పడే పుట్టిన బిడ్డ నుండి ఆరు నెలల వరకు తల్లిపాలే ముద్దు అని తల్లి బిడ్డకు పాలు ఇవ్వడం వలన తల్లికి మానసిక ఒత్తిడి రక్తస్రావం తగ్గుతుంది అని వివరించారు ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు, ఆయాలు, అంగన్వాడి సిబ్బంది అంగన్వాడి,పిల్లలు, గర్భవతులు, బాలింతలు గ్రామ ప్రజలు పాల్గొన్నారు**

అనంత జనశక్తి
జనం కోసమే మా అక్షరం
గురువారం | అనంతపురం
06.08.2026
ఆంధ్రప్రదేశ్ న్యూస్ ANDHRA PRADESH NEWS

# పురంలో వైసీపీకి ... గడ్డు... కాలమేనా...??

- అనంత జనశక్తి నియోజకవర్గ రాజకీయ ఫోకస్...
- రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చ
- వర్గ పోరుతో పార్టీ విల...విల.
- ఒకే పార్టీ... నాలుగు వర్గాలు... వైసీపీకి అంతర్గత సంక్షోభం.
- ప్రత్యర్థుల కంటే సొంత పార్టీ నేతలే సవాల్...!
- నాయకుల మధ్య ఆదిపత్య పోరు... కార్యకర్తల్లో అయోమయం.
- మధుమతి రెడ్డి పార్టీ పగ్గాలు చేపట్టేనా? పార్టీ బలోపేతానికి కృషిచేసినా?
- ప్రజలలోకి వెళ్లాల్సిన పార్టీ... వర్గాలకే పరిమితమా...?
- వర్గ రాజకీయాలతో ఫ్యాన్ గాలికి... ఎదురు దెబ్బ.
- గెలుపు కలలకు గండి... వైసీపీని వెంటాడుతున్న వర్గ పోరు కు ప్రజలు బేజారు...!



**శ్రీ సత్య సాయి జిల్లా ప్రతినిధి,**

**ఆగస్టు 5, అనంత జనశక్తి న్యూస్:**

హిందూపురం నియోజకవర్గంలో వైసీపీ ప్రస్తుతం రాజకీయంగా క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటోందనే అభిప్రాయాలు రాజకీయ వర్గాల్లో వ్యక్తమవుతున్నాయి. గత ఎన్నికల ఫలితాల తర్వాత పార్టీ శ్రేణుల్లో ఆశించిన స్థాయిలో చురుకుదనం కనిపించడం లేదని, క్షేత్రస్థాయిలో కార్యకలాపాలు కూడా పరిమితంగానే సాగుతున్నాయనే చర్చ కొనసాగుతోంది. పార్టీని బలోపేతం చేయాల్సిన సమయంలో నాయకత్వ సమన్వయం, ప్రజలతో నిరంతర అనుసంధానం, కార్యకర్తలకు దిశానిర్దేశం వంటి అంశాలపై మరింత దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని పలువురు రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. అంతర్గత విభేదాలపై వస్తున్న ప్రచారం, స్థానిక నాయకత్వంపై నెలకొన్న సందిగ్ధత కూడా పార్టీ శ్రేణుల్లో ప్రభావం చూపుతోందనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. హిందూపురంలో అధికార పార్టీ ప్రజా కార్యక్రమాలతో క్షేత్రస్థాయిలో చురుగ్గా ముందుకు సాగుతుండగా, ప్రతిపక్షంగా వైసీపీ తన ఉనికిని మరింత బలంగా చాటుకోవాల్సిన అవసరం ఉందని రాజకీయ విశ్లేషకులు సూచిస్తున్నారు. ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం, గ్రామస్థాయిలో పార్టీ నిర్మాణాన్ని బలోపేతం చేయడం, క్యాడర్‌లో నమ్మకాన్ని పెంపొందించడం వంటి అంశాలు రానున్న రోజుల్లో కీలకంగా మారనున్నాయి.అయితే హిందూపురంలో వైసీపీకి గడ్డు కాలం కొనసాగుతుందా...! లేక పార్టీ తిరిగి పుంజుకుంటుందా! అనేది ఇప్పుడే తేల్చిచెప్పలేం. నాయకత్వ నిర్ణయాలు, క్షేత్రస్థాయి కార్యాచరణ, ప్రజా స్పందన వంటి అంశాలే పార్టీ భవిష్యత్తును నిర్ణయిస్తాయని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

**దీపిక వర్సెస్ నవీన్ నిశ్చల్...! పచ్చి గడ్డి వేస్తే భగ్గుమంటుందా...!**

హిందూపురం రాజకీయాల్లో ఇప్పుడు ఎక్కువగా వినిపిస్తున్న చర్చ దీపిక మరియు నవీన్ నిశ్చల్ మధ్య పెరుగుతున్న రాజకీయ దూరం గురించే. ఒకప్పుడు ఒకే పార్టీ వేదికపై కనిపించిన నాయకత్వం ఇప్పుడు వేర్వేరు రాజకీయ సంకేతాలు ఇస్తోందని ప్రచారం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. నవీన్ నిశ్చల్ మైనార్టీల లో మంచి గుర్తింపు ఉంది. స్థానికంగా ప్రజలలో సదాభిప్రాయం ఉందని వాదన బలంగా వినిపిస్తోంది. ఇటు వైసిపి పురం సమన్వయకర్త దీపిక ఆదేశాలతో పార్టీ అధిష్టానం నవీన్ నిశ్చల్ ను పార్టీ నుండి సస్పెండ్ చేసింది. అప్పటి నుంచి పురంలో ఆధిపత్య పోరు కొనసాగుతోందని, ఇద్దరి అనుచరుల వర్గాల భిన్న అభిప్రాయాలతో ముందుకు సాగుతున్నారనే ప్రచారం నేపథ్యంలో రాజకీయ వాతావరణం మరింత వేడెక్కిందని పురం ప్రజలు అభిప్రాయపడుతున్నారు. రాజకీయాలలో భిన్నభిప్రాయాలు సహజమే అయినప్పటికీ అవి పార్టీ ప్రయోజనాల కంటే ముందుకు వస్తే కార్యకర్తల్లో అయోమయం నెలకొని అవకాశం ఉందని రాజకీయ మేధావులు చెబుతున్నారు. ప్రజా సమస్యలపై పోటీ కంటే అంతర్గత విభేదాలే ప్రధాన చర్చగా మారితే దాని ప్రభావం పార్టీ పనితీరు పై పడే అవకాశాన్ని కొట్టి పారేయాలేమని వారు పేర్కొంటున్నారు. స్థానిక రాజకీయాలలో వినిపిస్తున్న చర్చల ప్రకారం రెండు వర్గాల మధ్య సమన్వయం, న్యాయకత్వం ఐక్యతకు మూల స్తంభాలు కావాలని కార్యకర్తల కు నమ్మకం పెరుగుతుందని ప్రజల్లో పార్టీపై బలమైన విశ్వాసం, నమ్మకం కలుగుతుందని రాజకీయ పరిశీలకులు సూచిస్తున్నారు. రాజకీయాలలో వ్యక్తిగత విభేదాల కంటే ప్రజల సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యంగా మారినప్పుడే పార్టీ ముందుకు సాగి బలపడే అవకాశం ఉంటుంది.

**కార్యకర్తల్లో గందరగోళం:**

నాయకుల మధ్య దూరం పెరిగిందనే ప్రచారం క్షేత్రస్థాయి కార్యకర్తలపై ప్రభావం చూపుతోందని ఆందోళన వ్యక్తమవుతోంది. ఎవరి నాయకత్వాన్ని అనుసరించాలి? పార్టీ అధికారిక వైఖరి ఏది? అనే సందిగ్ధ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

**పార్టీకి సవాల్....**

ప్రత్యర్థి పార్టీలను ఎదుర్కోవాల్సిన సమయంలో అంతర్గత పోటీ ఎక్కువైతే రాజకీయంగా నష్టం కలగవచ్చని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. వ్యక్తిగత రాజకీయ బలం పెంచుకోవడం ఒక అంశమైతే, పార్టీ సమిష్టి బలం కాపాడుకోవడం మరో ముఖ్య అంశమని వారు సూచిస్తున్నారు.

**అడపాదడపా కార్యక్రమాలతో పార్టీ బలోపేతం సాధ్యమేనా?**

నియోజకవర్గంలో వైసిపి కార్యకలాపాలపై పార్టీ శ్రేణుల్లో చర్చ సాగుతోంది. ఎన్నికల తర్వాత పార్టీకి సంబంధించిన కార్యక్రమాలు నిరంతరంగా కాకుండా కడప దడప్ప మాత్రమే జరుగుతున్నాయని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో పార్టీ నాయకత్వం మరింత చురుకుగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని కార్యకర్తలు భావిస్తున్నారని చర్చ పురంలో వినిపిస్తోంది. రాజకీయాల్లో అప్పుడప్పుడు కార్యక్రమాలు నిర్వహించడం అంటే ప్రజల మధ్య నిరంతరంగా ఉండడం స్థానిక సమస్యలపై స్పందించడం పార్టీ క్యాడర్ కు దిశా నిర్దేశం చేయడం నాయకత్వానికి కీలకమని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అలాంటి చురుకుదనం లోపిస్తే కార్యకర్తల్లో నిరుత్సాహం పెరిగే అవకాశం ఉంటుందని అంటున్నారు. పార్టీని బలోపేతం చేయాలంటే వ్యక్తిగత కార్యక్రమాల కన్నా క్షేత్రస్థాయిలో సమన్వయం, ప్రజలతో నిరంతర అనుసంధానం కార్యకర్తలకు అందుబాటులో ఉండే న్యాయకత్వం అవసరమనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. హిందూపురంలో వైసిపి మళ్లీ బలపడాలంటే అంతర్గత సమన్వయంతో పాటు నిరంతర రాజకీయ కార్యాచరణ పై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని రాజకీయ చర్చలు కొనసాగుతున్నాయి.

**వేణుగోపాల్ రెడ్డి సస్పెండ్ తో పురం వైసిపికి గట్టెక్కే దారి దొరుకుతుందా...!**

హిందూపురం నియోజకవర్గం లో వైసీపీ ఇప్పటికే అంతర్గత విభేదాలు, నాయకత్వ సమన్వయ లోపం, కార్యకర్తల అసంతృప్తి వంటి సవాళ్లను ఎదుర్కొంటుందని రాజకీయ చర్చలు కొనసాగుతున్న వేల, కొండూరి వేణుగోపాల్ రెడ్డి సస్పెండ్ అంశం మరొకసారి రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఒక నాయకుడి సస్పెన్షన్తో పార్టీలో క్రమశిక్షణ పెరగొచ్చు. కానీ అది ఒక్కటే పార్టీని బలోపేతం చేస్తుందని చెప్పడం




కష్టం. నాయకత్వం కార్యకర్తల విశ్వాసాన్ని తిరిగి గెలుచుకోవడం, వర్గ విభేదాలను తగ్గించడం, ప్రజా సమస్యలపై సమర్థంగా స్పందించడం వంటి అంశాలే పార్టీ భవిష్యత్తును నిర్ణయిస్తాయి. రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం వ్యక్తుల మార్పు కంటే పార్టీ పనితీరు, ప్రజలతో అనుబంధం, స్థానిక నాయకత్వం సమన్వయం కీలకం. కార్యకర్తలలో ఉత్సాహం నింపి అంతర్గత విభేదాలకు ముగింపు పలికితేనే వైసీపీ తిరిగి పుంజుకునే అవకాశం ఉంటుంది.

**పదునైన వ్యాఖ్యలు....**

>ఒక్క సస్పెన్షన్ తో సంక్షోభం ముగియదు... న్యాయకత్వం మారితేనే పరిస్థితులు మారుతాయి.
>వ్యక్తులపై చర్యల కంటే ప్రజల నమ్మకం సంపాదించడమే అసలైన రాజకీయ పరీక్ష.
>వర్గ పోరు స్థిరపడకపోతే ఏ నిర్ణయమైనా ఫలితం పరిమితంగానే ఉంటుంది.
>గెలుపు కోసం క్రమశిక్షణ అవసరం.... కానీ క్రమశిక్షణతో పాటు సమన్వయం కూడా అంతే ముఖ్యం.
>నాయకుడి నిష్క్రమణ కాదు... కార్యకర్తల ఐక్యతే పార్టీకి నిజమైన బలం.

హిందూపురంలో వైసిపి భవిష్యత్ ఒకే నిర్ణయం పై ఆధారపడదు. పార్టీ అంతర్గత పరిస్థితులను ఎలా చక్క దిద్దుకుంటుంది. కార్యకర్తల్లో ఎంత విశ్వాసాన్ని కల్పిస్తుంది అనేది రానున్న రాజకీయ సమీకరణాలను ప్రభావితం చేసే అంశంగా ప్రజా నాయకత్వం భావిస్తున్నారు.

**మధుమతి రెడ్డి చేతికి వైసిపి పగ్గాలా....?**
**అధిష్టానం ఆమె వైపు మొగ్గు చూపుతుందా?**

బలోపేతానికి కొత్త ముఖంపై పార్టీ ఆశలు పెట్టుకుందా....? పురం నియోజకవర్గంలో వైసిపి భవిష్యత్ పై చర్చలు మళ్ళీ వేడెక్కుతున్నాయి. పార్టీకి ఎదురైనా వరుస ఎదురుదెబ్బలు, నాయకత్వ లోపం, అంతర్గత విభేదాల నేపథ్యంలో పార్టీ పగ్గాలను సమర్థంగా చేపట్టగల నాయకురాలు ఎవరు అన్న ప్రశ్న కార్యకర్తల్లో వినిపిస్తోంది. ఈ నేపథ్యంలో మధుమతి రెడ్డి పేరు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. పార్టీని మళ్లీ గాడిలో పెట్టాలంటే కేవలం సమావేశాలు, ప్రకటనలు సరిపోవని, క్షేత్రస్థాయిలో కార్యకర్తలను ఏకతాటిపైకి తీసుకురాగల నాయకత్వం అవసరమని పార్టీ శ్రేణులు భావిస్తున్నారు. అలాంటి సమయంలో మధుమతి రెడ్డి బాధ్యతలు చేపడితే పార్టీకి కొత్త ఊపు రావచ్చని అభిప్రాయం కొందరిలో వ్యక్తమౌతోంది. అయితే అధిష్ఠానం నిజంగానే ఆమెపై మొగ్గు చూపుతోందా? లేక కొత్త సమీకరణాలకు తెరలేపుతోందా? అన్నది ఆసక్తికరంగా మారింది. పార్టీ బలహీనంగా ఉన్న ప్రాంతాలలో బలోపేతానికి సమర్థ నాయకత్వాన్ని ఎంపిక చేయాలని ఆలోచనలో అధిష్టానం ఉన్నట్లు రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం వైసీపీకి అతిపెద్ద సవాళ్లు ప్రత్యర్థి పార్టీ కాదు... సొంత వర్గ విభేదాలే. నాయకుల మధ్య సమన్వయం లేకపోతే ఎంత బలమైన పార్టీ అయినా క్షీణించడం తప్పదనే అభిప్రాయం వినిపిస్తోంది. కార్యకర్తలలో నమ్మకం నింపి, గ్రామ స్థాయి నుంచి పార్టీని పునర్వ్యవస్థీకరణ చేయగలిగే నాయకత్వం ఇప్పుడు అత్యవసరంగా మారింది. మధుమతి రెడ్డి ఆ బాధ్యతలను భుజాన వేసుకొని పార్టీని బలోపేతం చేసే దిశగా అడుగులు వేస్తారా? అధిష్ఠానం అంటూ పూర్తి బాధ్యతలు అప్పగిస్తుందా? లేక మరో కొత్త ముఖాన్ని తెరపైకి తీసుకు వస్తుందా? అన్న ప్రశ్నలకు సమాధానం రానున్న రోజుల్లో తేలనుంది. ప్రస్తుతం మాత్రం హిందూపురం వైసిపి రాజకీయాల్లో మధుమతి రెడ్డి పేరు చుట్టూ చర్చలు గట్టిగానే వినిపిస్తున్నాయి. అయితే పార్టీ అధికారిక నిర్ణయం వెలువడే వరకు ఇవన్నీ రాజకీయ ఊహాగానాలుగా పరిగణించాలి.

**పురంలో వైసిపి మరింత డీలాపడేనా...?**

అధిష్ఠానం భవిష్యత్ కార్యాచరణకు సిద్ధమవుతోందా? పురం నియోజకవర్గంలో వైసిపి రాజకీయ పరిస్థితులు రోజురోజుకు చర్చనీయంశంగా మారుతున్నాయి. నాయకత్వం లో స్పష్టత లేకపోవడం, అంతర్గత విభేదాలు, క్షేత్రస్థాయిలో కార్యకర్తల్లో నెలకొన్న నిరుత్సాహం పార్టీ బలంపై ప్రభావం చూపుతున్నాయని అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.ఈ పరిస్థితుల్లో పార్టీని గాడిలో పెట్టేందుకు అధిష్ఠానం ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటుందన్నది రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చగా మారింది. స్థానికంగా వర్గ పోరు కొనసాగుతుందని ప్రచారం పార్టీకి ప్రతికూల సంకేతాలను పంపు తోందనే అభిప్రాయం పడుతున్నారు. పార్టీ శ్రేణులను ఒకే వేదికపై తీసుకురావటం, సమన్వయంతో ముందుకు సాగడం ఇప్పుడు అత్యవసరంగా కనిపిస్తోంది. లేకపోతే క్షేత్రస్థాయిలో మరింత బలహీనత ఏర్పడే అవకాశాలు ఉన్నాయని పలువురు వాపోతున్నారు. మరోవైపు నియోజకవర్గంలో పార్టీని పునర్వ్యవస్థీకరించేందుకు అధిష్ఠానం కార్యాచరణ రూపొందిస్తోందన్న ప్రచారం కూడా వినిపిస్తోంది. కొత్త బాధ్యతల కేటాయింపు, అసంతృప్తి నేతలతో చర్చలు, కార్యకర్తలకు భరోసా కల్పించే చర్యలు చేపట్టే అవకాశం పై రాజకీయ వర్గాల్లో చర్చ కొనసాగుతోంది. అయితే దీనిపై పార్టీ నుంచి అధికార ప్రకటనలు వెలుపడాల్సి ఉంది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు, భవిష్యత్తు రాజకీయ సమీకరణాలను దృష్టిలో ఉంచుకొని వైసీపీ కి ఇది కీలక సమయంగా మారింది. ప్రస్తుతం ఎదురవుతున్న సవాళ్లను అధిగమించి పార్టీని మళ్లీ క్షేత్రస్థాయిలో బలోపేతం చేయగలదా? లేక అంతర్గత విభేదాలే మరింత నష్టాన్ని మిగిల్చుతాయా? అన్న ప్రశ్నకు రానున్న రోజుల్లో జరిగే రాజకీయ పరిణామాలే సమాధానం చెప్పనున్నాయి.

**రాష్ట్ర రాజకీయాలకు కొత్త మలుపు.... వైసిపి సరికొత్త అధ్యాయానికి నాంది పలికేనా?**

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో అధికార, ప్రతిపక్షాల మధ్య పోటీ ఎప్పుడు ఆసక్తికరంగా ఉంటుంది. అధికారాన్ని కోల్పోయిన తర్వాత ప్రతి రాజకీయ పార్టీకి ఎదురయ్యే అసలైన పరీక్ష పునర్నిర్మాణమే. ప్రస్తుతం అదే సవాలను వైసీపీ ఎదుర్కొంటుంది. ఈ నేపథ్యంలో పార్టీ తనను తాను పునర్వ్యవస్థీకరించుకొని రాష్ట్ర రాజకీయాల్లో సరికొత్త అధ్యాయానికి నాంది పలుకుతుందా? అన్న ప్రశ్నకు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఒక రాజకీయ పార్టీ బలం కేవలం నాయకత్వంతోనే నిర్ణయించబడదు. కార్యకర్తల ఉత్సాహం, ప్రజలతో నిరంతర అనుబంధం, స్థానిక నాయకత్వ సమన్వయం, ప్రజా సమస్యలపై పోరాట పటిమా ఈ నాలుగు స్తంభాలపై భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది. ఈ అంశాల్లో వైసిపి తన కార్యాచరణను ఎంత సమర్థవంతంగా అమలు చేస్తుందో అదే పార్టీ రాజకీయ భవిష్యత్తును నిర్దేశించనుంది. ఇప్పటివరకు వినిపిస్తున్న అంతర్గత విభేదాలు, అసంతృప్తి, స్థానిక స్థాయిలో సమన్వయం లోపాలపై పార్టీ దృష్టి సారించి, వాటిని అధికమించే ప్రయత్నం చేస్తేనే కొత్త రాజకీయ సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లగలదు. లేకపోతే ప్రత్యర్థులకు రాజకీయ అవకాశాలు మరింత విస్తరించే పరిస్థితి ఏర్పడే అవకాశం ఉంది ప్రతిపక్షంలో ఉన్న పార్టీకి ప్రజల సమస్యలపై నిరంతర పోరాటమే అతిపెద్ద ఆయుధం. సభల్లో చేసే విమర్శల కంటే ప్రజల మధ్య చేసే ఉద్యమాలే విశ్వసనీయతను పెంచుతాయి. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రత్యామ్నాయ విధానాలు, స్పష్టమైన కార్యాచరణ, క్షేత్రస్థాయిలో చురుకైన నాయకత్వం కనబరిస్తేనే ప్రజల మద్దతును తిరిగి పొందే అవకాశాలు ఉంటాయి. రాష్ట్ర రాజకీయాలు ఎప్పుడు స్థిరంగా ఉండవు. ప్రజల తీర్పు కూడా కాలాను గుణంగా మారుతుంది. అయితే ఆ మార్పును అవకాశంగా మలుచుకోవడం ప్రతి రాజకీయ పార్టీ చేతుల్లోనే ఉంటుంది. వైసిపి కూడా ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని సరికొత్త రాజకీయ అధ్యాయానికి శ్రీకారం చుడుతుందా? లేక అంతర్గత సవాళ్లను అధిగమించడంలోనే పరిమితమవుతుందా? అన్నది రానున్న రోజుల్లో పార్టీ తీసుకుని నిర్ణయాలు, ప్రజల స్పందన, రాజకీయ పరిణామాలపై ఆధారపడి ఉంటుంది. రాజకీయాల్లో శాశ్వత విజయాలు, శాశ్వత పరాజయాలు ఉండవు. మారుతున్న పరిస్థితులను అర్థం చేసుకొని ప్రజల విశ్వాసాన్ని మళ్లీ సంపాదించ గలిగిన వారే తదుపరి రాజకీయ అధ్యాయాన్ని రాస్తారు. వైసిపి ఆ దిశగా అడుగులు వేస్తుందా! లేదా అన్నది కాలమే సమాధానం చెప్పాలి.

**అందరి చూపు పురం వైసిపి రాజకీయాల వైపే... మార్పు మంత్రం పలుకుతుందా? లేక మౌనమే మూల్యం చెల్లిస్తుందా?**

హిందూపురం వైసిపి రాజకీయాలు ప్రస్తుతం ఒక కీలక మలుపు వద్ద నిలిచాయి. ఒకప్పుడు పార్టీకి బలమైన స్థావరంగా గుర్తింపు పొందిన ఈ నియోజకవర్గం ఇప్పుడు నాయకత్వ సమీకరణలు, సంస్థాగత పునర్వ్యవస్థీకరణ, కార్యకర్తల అంచనాలతో రాజకీయ చర్చల కేంద్రబిందువుగా మారింది. అందుకే అందరి చూపు ఇప్పుడే పురం వైసిపి రాజకీయాల పైనే నిలిచింది. ఏ రాజకీయ పార్టీకి అయినా ఎన్నికల ఓటమి అంతిమం కాదు. అయితే ఓటమి తర్వాత తీసుకునే నిర్ణయాలే ఆ పార్టీ భవిష్యత్తును నిర్ణయిస్తాయి. అదే కోణంలో చూస్తే పురం వైసిపి ముందున్న అసలు పరీక్ష ప్రజల విశ్వాసాన్ని తిరిగి పొందడంలో కాదు ముందుగా తన సొంత శ్రేణుల్లో నమ్మకాన్ని పునరుద్ధరించడంలో ఉంటుంది. రాజకీయాల్లో నాయకత్వం శూన్యత, అంతర్గత సమన్వయ లోపం, క్షేత్రస్థాయి చురుకుదనం తగ్గడం వంటి అంశాలు ప్రత్యర్థులకు అవకాశాలుగా మారుతాయి. మరోవైపు సమయానుకూలంగా న్యాయకత్వ నిర్ణయాలు, స్పష్టమైన కార్యాచరణ, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం పార్టీకి కొత్త ఊపిరిని అందించగలవు. ప్రస్తుతం పురం వైసిపి ఈ రెండు మార్గాల కూడలిలో నిలిచినట్లు రాజకీయ విశ్లేషకులు, ప్రజా మేధావులు భావిస్తున్నారు. రాబోయే నెలలు ఈ నియోజకవర్గ రాజకీయాలకు అత్యంత కీలకం కానున్నాయి. పార్టీ సంస్థాగత మార్పులు చేపట్టగలుగుతుందా? కొత్త నాయకత్వానికి అవకాశాలు కల్పిస్తుందా? కార్యకర్తల ఉత్సాహాన్ని తిరిగి రగిలిస్తోందా? వంటి ప్రశ్నలకు సమాధానాలు దొరికితేనే భవిష్యత్ రాజకీయ దిశ స్పష్టమవుతుంది. ఒక విషయం మాత్రం స్పష్టం.... పురం రాజకీయాలు ఇక స్థానిక అంశంగా మాత్రమే మిగలడం లేదు. ఇక్కడి పరిణామాలు రాష్ట్రస్థాయి రాజకీయ సంకేతాలుగా మారే అవకాశం ఉంది. అందుకే రాజకీయ ప్రత్యర్థులు, పార్టీ శ్రేణులు పరిశీలకులు అందరూ ఈ నియోజకవర్గంపై దృష్టిసారించారు. ఇప్పుడు నిర్ణయాత్మక ఘట్టం వైసిపి ముందుంది. పార్టీ తన అంతర్గత బలాన్ని సమీకరించి కొత్త రాజకీయ సందేశంతో ముందుకు సాగుతుందా? లేక కొనసాగుతున్న సవాలనే ఎదుర్కొంటూ రక్షణాత్మక రాజకీయాలకు పరిమితమవుతుందా? అన్నది రానున్న పరిణామాలే తేల్చలున్నాయి. ప్రస్తుతం ఒక విషయం మాత్రం స్పష్టంగా కనిపిస్తోంది... పురం వైసిపి రాజకీయాలు ఇక ఒక నియోజకవర్గ కథ కాదు; రాష్ట్ర రాజకీయాల దిశను ప్రభావితం చేసి చర్చగా మారుతున్నాయి.

**ఎన్నికల తరువాత నిశ్శబ్దం... ఎంపీ అభ్యర్థి కనుమరుగు.**

హిందూపురం పార్లమెంట్ నియోజకవర్గంలో గత ఎన్నికల్లో వైసీపీ తరపున పోటీ చేసిన ఎంపీ అభ్యర్థి శాంతమ్మ ఎన్నికల అనంతరం స్థానిక రాజకీయ కార్యక్రమాలలో పెద్దగా కనిపించడం లేదని చర్చ పార్టీ వర్గాలలో సాగుతోంది. కౌంటింగ్ పూర్తయిన తర్వాత నియోజకవర్గంలో పార్టీ కార్యక్రమాలకు సంబంధించి ఆమె పాత్ర పై శ్రేణుల్లో సందేహాలు వ్యక్తమవుతున్నాయనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. స్థానికేతర అభ్యర్థిగా బరిలోకి దిగిన శాంతమ్మ ఎన్నికల సమయంలో విస్తృతంగా ప్రచారం నిర్వహించినప్పటికీ ఎన్నికల అనంతరం ప్రజలకు, పార్టీ కార్యకర్తలకు అందుబాటులో ఉండే నాయకత్వం అవసరమని పలువురు కార్యకర్తలు అభిప్రాయపడుతున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. పార్టీ బలపడాలంటే ఎన్నికల సమయంలో మాత్రమే కాకుండా ఆ తర్వాత కూడా ప్రజల సమస్యలపై స్పందిస్తూ క్షేత్రస్థాయిలో చురుకుగా ఉండే నాయకత్వం అవసరమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. నాయకత్వం నుంచి నిరంతర మార్గదర్శకత్వం లేకపోతే కార్యకర్తల్లో నిరుత్సాహం పెరిగే అవకాశం ఉంటుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. అయితే ఈ అంశాలపై సంబంధిత నాయకత్వం నుంచి అధికారిక స్పందన వెలుపడితే పరిస్థితులపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉందని వైసిపి వర్గాలు భావిస్తున్నాయి.





## పురము లో నాలుగు గ్రూపుల... రాజకీయాలా? వ్యక్తిగత ఆధిపత్య పోరా!

హిందూపురం రాజకీయాలలో ఇప్పుడు ప్రజా సమస్యల కంటే నాయకుల మధ్య అంతర్గత విభేదాల గూర్చి ఎక్కువగా చర్చ జరుగుతోందని అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ఒకే పార్టీ జెండా కింద పని చేయాల్సిన నాయకులు వేరువేరు వర్గాలుగా కనిపిస్తున్నారని ప్రచారం కార్యకర్తల్లో అయోమయానికి దారితీస్తోందని రాజకీయ పరిశీలకులు, స్థానిక నాయకులు వాపోతున్నారు. ఒకే పార్టీ... నాలుగు గ్రూపులు... నాలుగు ఎజెండా... నాలుగు వ్యూహాలు. ఇలాంటి పరిస్థితుల్లో పార్టీ లక్ష్యం ఏమిటి? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. రాజకీయాలలో అభిప్రాయ భేదాలు సహజమే అయినా అవి పార్టీ ప్రయోజనా లను దెబ్బతీసే స్థాయికి చేరితే మాత్రం ఆందోళనకరమేనని పార్టీ కార్యకర్తలు, పార్టీ నాయకులు పురం ప్రజలు అంటున్నారు. నాయకత్వం ప్రజల మధ్య కు వెళ్లి సమస్యలను ప్రస్తావించాల్సిన సమయం లో అంతర్గత ఆదిపత్య పోరాటాలకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రజా సమస్యలపై పోటీపడితే ప్రజల మద్దతు లభిస్తుంది. సొంత వారితోనే పోటీ పడితే పార్టీ బలహీన పడే ప్రమాదం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ పరిస్థితులలో ఎక్కువ ఇబ్బం ది పడేది క్షేత్రస్థాయి కార్యకర్తలేనని పలువురు భావిస్తున్నారు. ఎవరిని అనుసరించాలని? ఎవరిని పిలుచుకు స్పందించాలి? పార్టీ అధికారిక వైఖరి ఏది? అనే సందేహాలు కార్యకర్తల్లో పెరిగే అవకాశం ఉందని అంటున్నారు. రానున్న స్థానిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని వర్గ పోరుకు ముగింపు పలికి, సమిష్టి నాయకత్వాన్ని బలోపేతం చేయడం ఏ రాజకీయ పార్టీకైనా అవసరమని పరిశీలకులు సూచిస్తున్నారు. రాజకీయ బలం, వర్గ పోరే రాజకీయ బలహీనత. ఈ విషయాన్ని ఎంత త్వరగా గ్రహిస్తే అంత త్వరగా పార్టీ ప్రజల్లో తన స్థానాన్ని బలోపేతం చేసుకునే అవకాశం ఉంటుంది."ప్రత్యర్థుల దాడి కంటే సొంతింటి విభేదాలే ప్రమాదకరం అనే రాజకీయ సామెత" హిందూపురం రాజకీయాల సందర్భంలో మళ్లీ వినిపిస్తోంది. వ్యక్తిగత ఆధిపత్యం కంటే పార్టీ ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇచ్చినప్పుడే కార్యకర్తల్లో నమ్మకం పెరుగుతుంది. ప్రజలలో విశ్వాసం బలపడుతుంది.

# మంత్రి ధర్మవరంలో రెండు రోజులు పర్యటన.

- జాతీయ చేనేత దినోత్సవం, సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ నషా ముక్త భారత్ కార్యక్రమాలలో మంత్రి.

**ధర్మవరం, ఆగస్టు 5, అనంత జనశక్తి న్యూస్:**

రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మరియు వైద్య విద్య శాఖామంత్రి, ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ ఆగస్టు 7, 8 తేదీల్లో ధర్మవరం నియోజకవర్గంలో పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నట్లు మంత్రి కార్యాలయం బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఆగస్టు 07 ఉదయం 10:00 గంటలకు ధర్మవరం పట్టణంలోని కదిరిగేట్ చేనేత విగ్రహం వద్ద నిర్వహించే జాతీయ చేనేత దినోత్సవం కార్యక్రమంలో మంత్రి పాల్గొంటారని, అనంతరం మధ్యాహ్నం 1:00 గంటలకు ధర్మవరం ఎన్డీఏ కార్యాలయంలో ప్రజలు, పార్టీ నా యకులు, కార్యకర్తలు, వివిధ వర్గాల ప్రతి నిధులకు అందుబాటులో ఉంటా రని, అదే రోజు సాయంత్రం 4:00 గంటలకు ధర్మవరం ఎన్డీఏ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య మంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని అర్హులైన లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తారని మంత్రి కార్యాలయం వెల్లడించింది. ఆగస్టు 08 ఉదయం 10:00 గంటలకు ధర్మవరం పట్టణంలోని ఎస్బిఐ కాలనీలో బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో నిర్వహించే నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో మంత్రి సత్యకుమార్ యాదవ్ పాల్గొంటారని పేర్కొంది. మంత్రి పర్యటన సందర్భంగా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఆయా కార్యక్రమాల నిర్వాహకులు సమయానికి హాజరై కార్యక్రమాలను విజయవంతం చేయాలని మంత్రి కార్యాలయం కోరింది.



# లింగ నిర్ధారణ లింగ ఎంపిక నిర్వహిస్తే కఠిన చర్యలు

**- చట్టాన్ని కట్టు దిట్టంగా అమలు చేయాలి...**

**పుట్టపర్తి రూరల్ ఆగష్టు 05 అనంత జన శక్తి న్యూస్.**




లింగ నిర్ధారణ లింగ ఎంపిక నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని శ్రీ సత్య సాయి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. ఫైరోజా బేగం పేర్కొన్నారు. బుధవారం శ్రీ సత్య సాయి జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో జిల్లా ఎం టీ పీ కమిటీ సమావేశం జిల్లా స్థాయి సలహా కమిటీ సమావేశం . నిర్వహించారు. మెడికల్ పర్మినేషన్ ఆఫ్ ప్రోగ్రెసి యాక్ట్, జిల్లాలోని 17 ప్రైవేట్ ఆసుపత్రులలో ఈ సేవలు అందించేందుకు సమర్పించిన దరఖాస్తులను జిల్లా కమిటీ పరిశీలించింది. కమిటీ సభ్యులైన గైనకాలజిస్ట్, పీడియాట్రిషన్, ఫిజీషియన్, ఏరియా ఆసుపత్రి కదిరి మెడికల్ సూపరింటెండెంట్ డా. హుస్సేన్ తదితరులు ఆసుపత్రుల్లో ఉన్న సౌకర్యాలు, అర్హతలను సమగ్రంగా పరిశీలించి, నిబంధనలకు అనుగుణంగా ఉన్న 17 ప్రైవేట్ ఆసుపత్రులకు ఎం టి పి సేవలు నిర్వహించేందుకు ఆమోదం తెలిపారు.అనంతరం నిర్వహించిన జిల్లా స్థాయి సలహా కమిటీ సమావేశంలో పి సి పి ఎన్ డి టి యాక్ట్ 1994 నిబంధనలను జిల్లాలో అత్యంత కట్టుదిట్టంగా అమలు చేయాలని డిఎంహెచ్వో డాక్టర్ ఫైరోజా బేగం ఆదేశించారు. గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ, లింగ ఎంపిక వంటి చట్టవిరుద్ధ చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని, చట్టాన్ని ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె స్పష్టం చేశారు.సంబంధిత అధికారులు సమన్వయంతో తనిఖీలు నిర్వహించి, ప్రజల్లో చట్టంపై విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు.ఈ సమావేశంలో ఎస్ ఓ కళాధర్, డిప్యూటీ డి ఈ ఎం ఓ సుబ్రహ్మణ్యం, డిప్యూటీ హెచ్ ఈ ఓ రామలక్ష్మి, డిపిహెచ్ఎన్ఓ . వీరమ్మ తదితరులు పాల్గొన్నారు.

# కోట లో ఘనంగా ఎమ్మెల్యే అమిలినేని జన్మదిన వేడుకలు



**- మహిళలకు చీరలు పంపిణీ**
**- ఎమ్మెల్యే అమిలినేని కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన కోట కార్యకర్తలు ప్రజలు**
**- ఎస్. రామన్న ఆధ్వర్యంలో అన్నదానం**

**కళ్యాణదుర్గం ఆగస్టు 05 జనశక్తి న్యూస్:**

ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు జన్మదిన వేడుకలు పట్టణంలోని కోటవీధి కాలనీ నందు వార్డ్ ఇంచార్జ్ టిడిపి సీనియర్ నాయకులు ఎస్ రామన్న ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ముందుగా కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన పట్టణ కన్వీనర్ మాదినేని మురళి గుబాన పల్లి మల్లికార్జున ఆకుల రెహమాన్ బిజెపి ముప్పూరి దేవరాజ్ లకు సన్నాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు కు జన్మదిన శుభాకాంక్షలు పెద్ద ఎత్తున కాలనీ ప్రజలు నాయకులు కార్యకర్తలు తెలిపారు. అనంతరం నాయకులు మహిళలకు చీరలు పంపిణీ చేసి మరల అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 18 వార్డ్ ఇంచార్జ్ ఎస్ రామన్న బి ఎల్ ఏ రా మాంజనేయులు పార్లమెంట్ సెక్రటరీ ప్రకాష్ డీలర్ నాగప్ప ట్రాక్టర్ గోపాలప్ప బోయ మారుతి కొడిగి రామ సంజీవరెడ్డి రమణ నవీన్ తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# మత్స్యకారుల అభ్యున్నతే ధ్యేయం

**- మత్స్యకార సంక్షేమ సమితి జిల్లా అధ్యక్షులు జశ్వంత్ వ్యాస్**
**- జిల్లా కార్యవర్గంలో పలువురికి చోటు**

**అనంతపురం, ఆగస్టు 5 :అనంత జనశక్తి న్యూస్**




మత్స్యకారుల అభ్యున్నతే ధ్యేయంగా శ్రమిస్తామని మత్స్యకార సంక్షేమ సమితి జిల్లా అధ్యక్షులు జశ్వంత్ వ్యాస్ పేర్కొన్నారు. బుధవారం నగరంలోని కోర్టు రోడ్డులో గల శివకృప కార్యాలయంలో మత్స్యకార సంక్షేమ సమితి సమావేశం నిర్వహించారు. సమావేశంలో జిల్లా కార్యవర్గంలోకి పలువురికి అవకాశం కల్పించినట్లు జిల్లా అధ్యక్షులు జశ్వంత్ వ్యాస్‌తోపాటు రాష్ట్ర కార్యదర్శి వారు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మత్స్యకారుల సంక్షేమం కోసం నిరంతరం శ్రమిస్తామన్నారు. రాయితీలు, సంక్షేమ పథకాలు అర్హులైన మత్స్యకారులకు అందేలా చూస్తామన్నారు. అనంతరం కార్యవర్గాన్ని ప్రకటించారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా శివశంకర్, న్యాయవిభాగం జిల్లా అధ్యక్షులుగా బెస్త ఓబులరాజు, జిల్లా సలహాదారునిగా తుపాకుల శంకర్, జిల్లా ప్రచార కార్యదర్శిగా బెస్త రాములను ఎంపిక చేశారు. సమావేశంలో రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు కోటా రాజేశ్వరి, రాష్ట్ర మహిళా సభ్యురాలు పవన వాణి, రాష్ట్ర కార్యదర్శి సభ్యులు గౌడుగు నాగరాజు, రాష్ట్ర ప్రచార కార్యదర్శి పిల్లి మల్లికేటి, జిల్లా గౌరవ సలహాదారులు వరదాయపల్లి మాజీ సర్పంచ్ బెస్త రమణ, బెస్త గంగప్ప, జిల్లా ఇన్‌చార్జ్ శివకుమార్, జిల్లా ఉపాధ్యక్షులు బెస్త విజయ సత్యం, బెస్త వెంకటేష్, జిల్లా కోశాధికారి బెస్త రామాంజనేయులు, నగర అధ్యక్షులు బెస్త అశోక్, సభ్యులు బెస్త శంకర్ ప్రసాద్, బెస్త నారాయణస్వామి, బెస్త మల్లికార్జున, బెస్త శ్రీరాం, బెస్త అంజి, బెస్త ఓబులేసు, బెస్త ఓబులయ్య తదితరులు పాల్గొన్నారు.

# భారీ వర్షా లకు నెలకొన్న సమస్యలపై స్పందించిన మంత్రి కందుల దుర్గేష్ .. కదలిన యంత్రాంగం



**- భక్తుల దర్శనానికి ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు**
**- వర్షా ల నేపథ్యంలో అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని మంత్రి కందుల దుర్గేష్ సూచన**

**నిడదవోలు ఆగస్టు 05 .అనంత జనశక్తి న్యూస్**

భారీ వర్షాల ధాటికి నిడదవోలు రూరల్ మండలం తిమ్మరాజుపాలెంలోని ప్రసిద్ధ శ్రీ కోటసత్తెమ్మ తల్లి ఆలయంలోకి, అలాగే నిడదవోలు ఎర్ర కాలువ, నిడదవోలు కంసాలిపాలెం రహదారి పైకి పంట కాలువ నీరు వచ్చి చేరిందన్న సమాచారం అందగానే రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక మరియు సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ తక్షణమే స్పందించారు. సమస్య తీవ్రతను గుర్తించి, సహాయక చర్యలు చేపట్టాలని సంబంధిత అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు.మంత్రి దుర్గేష్ ఆదేశాల మేరకు క్షేత్రస్థాయికి చేరుకున్న అధికారులు, స్థానికంగా నెలకొన్న పరిస్థితులను నిశితంగా పరిశీలించి నీటి ముంపు సమస్యను త్వరితగతిన పరిష్కరించారు. పంట కాలువలో నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న గుర్రపుడెక్కను జేసీబీల సాయంతో వెంటనే తొలగించారు. ఆలయ ప్రాంగణంలోకి చేరిన వరద నీటిని మోటార్ల ద్వారా బయటకు పంపింగ్ చేయించారు. ఆలయ ప్రాంగణంలో త్వరితగతిన పారిశుధ్య పనులు పూర్తి చేసి, బ్లీచింగ్ తదితర క్రిమిసంహారకాలతో శుభ్రపరచాలని మంత్రి ఆదేశించడంతో అధికారులు చర్యలు చేపట్టారు. సహాయక చర్యలు జరుగుతున్న సమయంలోనూ భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అంతరాయం లేని దర్శనం కల్పించాలని సూచించారు. వర్షాల వల్ల ఎర్రకాలువకు, కంసాలిపాలెం రహదారిపై రాకపోకలకు ఆటంకం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు. వర్షాకాలం పూర్తయ్యేవరకు ప్రజలకు, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని దిశా నిర్దేశం చేశారు. విజయవాడలో ఉన్నప్పటికీ మంత్రి కందుల దుర్గేష్ సమయానుకూల స్పందన, అధికారుల త్వరితగతిన చర్యలతో ఆలయంలోకి చేరిన వరద నీరు పూర్తిగా తొలగిపోవడంతో భక్తులు, స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

# బొర్రా పంచాయతీలో ఉద్యానవన మొక్కల పంపిణీ.



**- విబిజి-రాం-జి ద్వారా 55 మంది రైతులకు నాణ్యమైన మొక్కలు అందజేత.**

**అనంతగిరి, ఆగస్టు 05 అనంత జనశక్తి న్యూస్**

అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం బొర్రా గ్రామపంచాయతీలో బుధవారం ఉపాధి హామీ పథకం ఆధ్వర్యంలో ఉద్యానవన పంటల మొక్కల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ అప్పారావు, ఎంపీటీసీ అరుణ పవిన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి జడ్పీటీసీ దిసరి గంగరాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా అర్హులైన 55 మంది రైతులకు వివిధ రకాల నాణ్యమైన ఉద్యానవన పంటల మొక్కలను పంపిణీ చేశారు. అనంతరం రైతులకు మొక్కల సంరక్షణ, నిర్వహణ, సాగు పద్ధతులపై అవగాహన కల్పించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ దిసరి గంగరాజు మాట్లాడుతూ, 2026-27 ఆర్థిక సంవత్సరంలో రైతుల ఆదాయాన్ని పెంచే లక్ష్యంతో ప్రభుత్వం ఉద్యానవన పంటల ప్రోత్సాహానికి ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకుని మొక్కలను శ్రద్ధగా పెంచితే భవిష్యత్తులో అధిక దిగుబడులు సాధించి మంచి ఆర్థిక లాభాలు పొందవచ్చని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి సరేంద్ర, పెసా కమిటీ సభ్యులు, వార్డు సభ్యులు, గ్రామ ప్రజాప్రతినిధులు, రైతులు, ఉపాధి హామీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

# అవసరమైతే రాంచీకి వెళ్తాం

**- జార్ఖండ్ విద్యార్థి ఉద్యమానికి సీజేపీ మద్దతు**
**- అభిజీత్ దీప్కే ప్రకటన**
**- రాజకీయ పార్టీ కాదు.. ప్రెషర్ గ్రూప్‌గానే..**

**అనంతపురం, ఆగస్టు 5 :అనంత జనశక్తి న్యూస్**

జార్ఖండ్ ఉద్యోగ నియామక పరీక్షల్లో అక్రమాలు జరిగాయంటూ నిరసనలు తెలుపుతున్న అభ్యర్థులకు కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) మద్దతు ప్రకటించింది. అవసరమైతే రాంచీకి వెళ్లి ఉద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొంటామని సీజేపీ చీఫ్ అభిజీత్ దీప్కే వెల్లడించారు. మహారాష్ట్రలోని ఛత్రపతి సంభాజీనగర్‌లో మీడియాతో మాట్లాడిన దీప్కే, జూలై 29 నుంచి రాంచీలో జరుగుతున్న నిరవధిక ఆందోళనకు తమ సంఘీభావం ఉంటుందని చెప్పారు. తాము తప్పకుండా జార్ఖండ్ వెళ్తామని, అక్కడి విద్యార్థుల ప్రతి డిమాండ్‌కు మద్దతుగా నిలుస్తామని చెప్పారు. ప్రస్తుతం సీజేపీ రాజకీయ పార్టీగా కాకుండా ప్రెషర్ గ్రూప్‌గా పనిచేస్తుందని దీప్కే వెల్లడించారు. న్యాయవ్యవస్థ, రాజకీయాలు, మీడియా, ఎన్నికల సంఘం వంటి సంస్థలపై ప్రజల విశ్వాసం తగ్గుతోందని, వీటిలో జవాబుదారీతనం తీసుకురావడమే తమ ఉద్యమ లక్ష్యమని చెప్పారు. జార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌తో పాటు ఇతర నియామక పరీక్షల్లో జరిగిన అక్రమాలపై రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తులతో స్వతంత్ర దర్యాప్తు జరపాలని అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నారు.

# మండలంలో ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పర్యటన

**అమడగూరు ఆగస్టు 5 అనంత. జనశక్తి.న్యూస్.**



అమడగూరు మండలం, జేకేపల్లి పంచాయతీలో ఈరోజు, పుట్టపర్తి నియోజకవర్గం ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి పర్యటించనున్నారు అని మండల కన్వీనర్ గోపాల్ రెడ్డి తెలియజేశారు గోపాల్ రెడ్డి మాట్లాడుతూ ఆగస్టు 6న అనగా ఈరోజు, అమడగూరు మండలంలోని జెకె పల్లి పంచాయతీలో ఉదయం 11 గంటలకు తెలుగుదేశం పార్టీ ఇంటింట ప్రచారం కార్యక్రమం మరియు రైతులకు పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీ చేస్తున్నట్లు మండల కన్వీనర్ గోపాల్ రెడ్డి తెలియజేశారు ఈ సందర్భంగా మండలంలోని ప్రజా ప్రతినిధులు కుటమి నాయకులు పదవుల పొందినటువంటి కూటమి నాయకులు స్టోర్ డీలర్లు కాంట్రాక్టర్లు వివిధ సంఘాల నాయకులు అందరూ హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల కన్వీనర్ గోపాల్ రెడ్డి తెలియజేశారు,

# నరసంబూది,మధుడిలో పొలం పిలుస్తుంది




**- ఎలనినో పరిస్థితులను గురించి రైతులకు అవగాహన**
**- పంటల బీమా ప్రతి రైతు తప్పనిసరిగా చేసుకోవాలి**

**అగలి ఆగస్టు 05 అనంత జనశక్తి న్యూస్:**

మండలంలో ఎలనినో పరిస్థితుల వల్ల పంటలను బెట్ట నుంచి రక్షించుకోవడం కోసం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించినట్లు మండల వ్యవసాయ అధికారి నాగరాజు తెలిపారు. నరసంబుది, రామపల్లి, కనిపురం మధుడి, గొల్లహట్టి గ్రామాలలో పర్యటించి రైతులకు అవగాహన కల్పిస్తూ రైతులతో కలిసి రాగి, మొక్కజొన్న, వేరుశనగ, పత్తి, వక్క, మల్బరీ పొలాలను సందర్శించి పొలాలలో పురుగులు, తెగుళ్ల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి రైతులకు అవగాహన కల్పించడం జరిగింది. అదేవిధంగా ఇప్పుడు ప్రస్తుతం ఉన్న పంటలను రక్షక నీటి తడులిచ్చి ఆదుకోవాలని అదేవిధంగా పొటాషియం నైట్రేట్ 5 గ్రా లీటర్ నీటికి,లేదా 19:19:19, 10 గ్రా లీటరు నీటికి , లేదా యూరియా 20 గ్రా.లీ. నీటికి కలిపి పిచికారి చేసినట్లయితే పంటను బెట్ట పరిస్థితి నుంచి 15 రోజుల నుండి 20 రోజుల వరకు కాపాడుకోవచ్చని అలాగే రాబోయే వర్షాల ఆధారంగా ఖాళీగా ఉన్న భూములు, అదేవిధంగా బీడు భూములలో స్వల్పకాలిక రకాలైనటువంటి కొర్రలు, సజ్జలు, ఉలవలు ,పెసర, మినుము, అలసంద వంటి పంటలను వేసుకోవాలని అలాగే మొక్కజొన్న, రాగి, ఆముదం, వరి వేసుకున్న రైతులు ప్రధానమంత్రి ఫసల్ బీమా ఈ ఆగస్టు నెల 15వ తారీకు లోపు చేసుకోవాలని అలాగే ఈ పంట నమోదు కచ్చితంగా చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి నాగరాజు తెలిపారు ఈ కార్యక్రమంలో రైతులు, ప్రజాప్రతినిధులు,రైతు సేవ కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

# నేత్రదానంతో ఇద్దరి జీవితాల్లో వెలుగులు



**- విశ్వదీప సేవా సంఘం ఆధ్వర్యంలో నేత్రాల సేకరణ....**

**ధర్మవరం ఆగస్టు 5 అనంత జనశక్తి న్యూస్ :**

ధర్మవరం మరణానంతరం కూడా ఇద్దరి జీవితాల్లో వెలుగులు నింపే మహోన్నత సేవగా నిలిచిన నేత్రదానానికి ధర్మవరం చంద్రబాబు నగర్ కు చెందిన బుధరపు ఆదినారాయణ (59)సం, కుటుంబ సభ్యులు ముందుకొచ్చారు. గుండెపోటుతో బుధవారం ఆయన మృతి చెందగా, విశ్వదీప సేవా సంఘం సభ్యులు కుటుంబ సభ్యులకు నేత్రదానంపై అవగాహన కల్పించారు. దీంతో వారు వెంటనే నేత్రదానానికి అంగీకరించారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ, అనంతపురం రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలోని డీవై కుళ్లాయప్ప కంటి కార్నియా రిట్రీవల్ సెంటర్ టెక్నీషియన్ జి. రాఘవేంద్ర మృతదేహం నుంచి కంటి కార్నియాలను విజయవంతంగా సేకరించారు. ఈ నేత్రదానం ద్వారా ఇద్దరు దృష్టి లోపం ఉన్నవారికి చూపు ప్రసాదించే అవకాశం కలిగిందని సేవా సంఘం సభ్యులు తెలిపారు. నేత్రదానానికి సహకరించిన మృతుడి భార్య సరస్వతి, కుమారుడు తిరుమలేశ, కోడలు మౌనిక, అన్నలు బుధరపు బాలకృష్ణ, రామకృష్ణలకు విశ్వదీప సేవా సంఘం ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్వదీప సేవా సంఘం ఫౌండర్ కొల్హమోరం చంద్రశేఖర్ రెడ్డి, అధ్యక్షుడు గాజుల సురేష్, ఉపాధ్యక్షుడు టి. చంద్రశేఖర్ రెడ్డి, కార్యదర్శి జూజారు రఘు, గుద్దేటి ధనుంజయలతో పాటు సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు. "మరణానంతరం కూడా మరొకరికి వెలుగు ఇవ్వగలిగే గొప్ప దానం నేత్రదానం" అని సేవా సంఘం ప్రతినిధులు పేర్కొంటూ, ప్రతి ఒక్కరూ నేత్రదానానికి ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు.

# బీజేపీ కిసాన్ మోర్చా అధ్యక్షులు గా జి. ముత్యాల గౌడ్ నియామకం

**ధర్మవరం ఆగస్టు 5, అనంత జనశక్తి న్యూస్:**

రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై. సత్యకుమార్ యాదవ్ ఆదేశాల మేరకు మంత్రి కార్యాలయ ఇంచార్జి కగ్గోలు హరీష్‌బాబు సమక్షంలో ధర్మవరం రూరల్ బీజేపీ కిసాన్ మోర్చా అధ్యక్షులుగా జి. ముత్యాల గౌడ్ ను నియమించారు. ఈ సందర్భంగా ముత్యాల గౌడ్ మాట్లాడుతూ.... బీజేపీ పార్టీ దేశానికి రక్షణ అని తనను ఎంపిక చేసిన మంత్రి సత్య కుమార్ బీజేపీ రూరల్ అధ్యక్షులు గొట్లూరు చంద్ర మంత్రి కార్యాలయం ఇంచార్జి కగ్గోలు హరీష్‌బాబు రమణ మూర్తికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ధర్మవరం నియోజకవర్గం వ్యాప్తంగా బీజేపీ పార్టీ బలోపేతం చేయడానికి కృషి చేస్తానని ఆయన ఈ సందర్భంగా తెలియజేశారు.



## ప్రకృతి వ్యవసాయం లాభదాయకం



**- ఆత్మ డిప్యూటీ డైరెక్టర్ బాబురావు**

**సామర్లకోట, ఆగస్టు 5, :అనంత జనశక్తి న్యూస్**

ప్రకృతి వ్యవసాయం లావదాయకమని, దానిని రైతులు అలవర్చుకోవాలని కాకినాడ జిల్లా ఆత్మ ప్రాజెక్టు డిప్యూటీ డైరెక్టర్ బాబురావు అన్నారు. సామర్లకోట మండలం జి మేడపాడు గ్రామంలోని రైతు శిక్షణా కేంద్రం వద్ద బుధవారం "పొలం పిలుస్తోంది" కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ )కాకినాడ
డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ బాబురావు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం, జీవన ఎరువులు, పిఎండిఎస్, భూమిని కాపాడుకోవడం గురించి, తక్కువ పెట్టుబడితో నాణ్యమైన పంటని పండించడం గురించి రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వంగపండు మురళీధర్ మాట్లాడుతూ వరి పంటకు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనలో నమోదు చేసుకునేందుకు 2026 ఆగస్టు 15 చివరి తేదీ అని తెలిపారు. వరి పంటకు ఎకరానికి రూ.760లు ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందని, కరువు, అధిక వర్షాలు, తుఫానులు, వరదలు వంటి ప్రకృతి వైపరీత్యాల వల్ల కలిగే పంట నష్టాలకు బీమా ద్వారా ఆర్థిక రక్షణ లభిస్తుందని వివరించారు. పంట రుణం తీసుకున్న రైతులు సంబంధిత బ్యాంకులు లేదా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా, రుణం తీసుకోని రైతులు కామన్ సర్వీస్ సెంటర్ లేదా నేషనల్ క్రాప్ ఇన్సూరెన్స్ పోర్టల్ ద్వారా బీమా నమోదు చేసుకోవాలని సూచించారు. ఖరీఫ్2026సీజన్‌కు సంబంధించిన ఈపంట నమోదు కొనసాగుతోందని రైతులు తమ పొలాల్లో సాగు చేసిన పంట, విత్తనాల రకం, నాటిన తేదీ తదితర వివరాలను సంబంధిత గ్రామ వ్యవసాయ సహాయకులు తెలియజేయాలని కోరారు.
అలాగే ప్రతి రైతు ఫార్మర్ ఈకెవైసీను ఆధార్ ఓటీపీ లేదా ముఖ ఆధారిత బయోమెట్రిక్ ద్వారా తప్పనిసరిగా పూర్తి చేసుకోవాలని తెలిపారు.
ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు రూప, వి ఎ ఎ నాయుడు, దినేష్, జీ మేడపాడు సొసైటీ ప్రెసిడెంట్ రవి బాబు, సొసైటీ సీఈవో శ్వేత, పుట్టా రాంబాబు, పైని వీరన్న, రైతులు పాల్గొన్నారు.

## విశాఖలో పీవీ సింధు అకాడమీ భూమి పూజ చేసిన మంత్రి లోకేశ్



**- రాబోయ్యే వందేళ్లను దృష్టిలో ఉంచుకుని**
**- క్రీడా అకాడమీని నిర్మిస్తున్నట్లు సింధు వెల్లడి**
**- అరిలోవ ప్రాంతంలోని తోటగరువులో అకాడమీ**

**అనంతపురం, ఆగస్టు 5 :అనంత జనశక్తి న్యూస్**

ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు విశాఖపట్నంలో ఓ క్రీడా అకాడమీ ఏర్పాటు చేయనున్నారు. పీవీ సింధు సెంటర్ ఫర్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్ పేరిట ప్రారంభించనున్న ఈ అకాడమీకి మంత్రి నారా లోకేశ్ భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి లోకేశ్‌కు పీవీ సింధు కృతజ్ఞతలు తెలిపారు. విశాఖపట్నంలోని అరిలోవ ప్రాంతంలో ఉన్న తోటగరువులో సెంటర్ ఫర్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్ నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా అక్కడికి విచ్చేసిన మంత్రి లోకేశ్‌కు పీవీ సింధు, ఆమె కుటుంబ సభ్యులు ఘన స్వాగతం పలికారు. అనంతరం పీవీ సింధు, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డితో కలిసి మంత్రి లోకేశ్ సెంటర్ ఫర్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పీవీ సింధూ మాట్లాడుతూ ఈ క్రీడా ప్రాజెక్టు రూపకల్పనలో తనకు అండగా నిలిచి, పూర్తి మద్దతు అందించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. రాబోయ్యే వందేళ్లను దృష్టిలో ఉంచుకుని ఈ క్రీడా అకాడమీని నిర్మిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ ప్రాజెక్టు కేవలం బ్యాడ్మింటన్‌కే పరిమితం కాదని.. 25 మీటర్ల ఇండోర్ షూటింగ్ రేంజ్, ఏడు ప్రధాన క్రీడా విభాగాలు, నూతన క్రీడాంశాలు కూడా అందుబాటులో ఉండనున్నాయని చెప్పారు. ఇక్కడ ఏర్పాటు చేయనున్న 25 మీటర్ల స్విమ్మింగ్ పూల్‌ను ఒలింపిక్స్ పోటీల్లో వాడే మిర్లా పూల్స్ ప్రమాణాలతో నిర్మిస్తున్నట్లు ఆమె తెలిపారు. రెండుసార్లు ఒలింపిక్ పతకాన్ని సొంతం చేసుకున్న పీవీ సింధు బ్యాడ్మింటన్‌లో భారత పతకాన్ని ఎగురవేసింది. ఒలింపిక్స్‌తో పాటు ఎన్నో ఓపెన్ ఛాంపియన్‌షిప్‌ను కూడా సొంతం చేసుకుంది. తాజాగా జపాన్ ఓపెన్ సూపర్ 750 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో విజేతగా నిలిచింది. జపాన్ ఓపెన్ టైటిల్ గెలుచుకున్న తొలి భారతీయ మహిళా క్రీడాకారిణిగా పీవీ సింధు చరిత్ర సృష్టించింది. జపాన్ ఛాంపియన్‌గా ఉన్న సింధుకు మహిళ సింగిల్స్‌లో 9వ సీడ్ కూడా ఇచ్చారు. ప్రతిష్టాత్మక బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ ఛాంపియన్‌షిప్ 2026కు ముందు సీడింగ్ ఖరారైంది.

## శ్రీశైలం నుంచి నీటి విడుదల ప్రారంభం

**- జలవనరుల శాఖ మంత్రి రామానాయుడు**
**- ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని..**
**- తాగునీటి భద్రతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం**

**అనంతపురం, ఆగస్టు 5 :అనంత జనశక్తి న్యూస్**




ఆంధ్రప్రదేశ్ ప్రజలకు శుభవార్త చెబుతూ.. శ్రీశైలం డ్యామ్ నుంచి నీటిని విడుదల చేశారు.. జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని రాష్ట్రంలో తాగునీటి భద్రతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. 2027 జూన్ వరకు సూపర్ ఎల్‌నినో ప్రభావం కొనసాగే అవకాశం ఉన్న నేపథ్యంలో శ్రీశైలం జలాశయంలోని నీటిని ప్రధానంగా తాగునీటి అవసరాల కోసం భద్రపరచాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ప్రస్తుతం శ్రీశైలం జలాశయంలో 119 టీఎంసీల నీరు అందుబాటులో ఉందని, రాబోయే పది రోజుల్లో మరో 100 టీఎంసీల వరకు ఇన్‌ఫ్లో వచ్చే అవకాశం ఉందని మంత్రి తెలిపారు. కృష్ణా నదీ జలాల్లో ఆంధ్రప్రదేశ్‌కు ఉన్న 63 శాతం వాటాను ముందుగా తాగునీటి అవసరాలకే వినియోగిస్తామని స్పష్టం చేశారు. రాయలసీమలో తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని శ్రీశైలం నుంచి నీటి విడుదల చేపడుతున్నామని చెప్పారు మంత్రి నిమ్మల.. హంద్రీనీవా పరిధిలోని రిజర్వాయర్లకు 13 టీఎంసీల నీరు అవసరమని, అలాగే పోతిరెడ్డిపాడు పరిధిలోని రిజర్వాయర్లకు తాగునీటి కోసం రేపటి నుంచి 10 టీఎంసీల నీటిని విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. ఇక, తెలుగు గంగ పథకం ద్వారా చెన్నై తాగునీటి అవసరాల కోసం 10 టీఎంసీల నీటిని విడుదల చేయాల్సి ఉందని, నాగార్జునసాగర్ కుడి, ఎడమ కాలువల పరిధిలోని తాగునీటి అవసరాల కోసం మరో 32 టీఎంసీల నీరు అవసరమని మంత్రి వివరించారు. వర్షాలు, వరదల పరిస్థితులను ప్రతి వారం సమీక్షిస్తూ ఎల్‌నినో ప్రభావాన్ని సమర్థంగా ఎదుర్కొనేలా కార్యాచరణ రూపొందిస్తామని నిమ్మల రామానాయుడు తెలిపారు. జిల్లాల కలెక్టర్లు, ఇరిగేషన్, రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి రాష్ట్రంలో తాగునీటి భద్రతకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని ఆదేశించారు జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు..

## నేతన్న సేవ పథకం లో నీకు సగం ... నాకు సగం..



**- నేతన్న సేవ పథకం పై మొదలైన బేరసారాలు....**
**- కుమ్మక్కైన కొందరు సచివాలయ సిబ్బంది**
**- వసూలకు తెరలేపిన కార్యకర్తలు**
**- రూ. 10 వేలకు ఒప్పందం కుదుర్చుకొంటున్న థర్డ్ పార్టీ**
**- నేతన్న సేవ పథకం కు కొందురు తూట్లు పోడుస్తున్నారా....?**
**- అర్హత ఉన్న చేనేత కార్మికులకు న్యాయం జరిగేనా.....?**
**- ఇలా అయితే రాష్ట్ర ప్రభుత్వానికి చెడ్డ పేరు తప్పదా........**
**- ఆందోళనలో చేనేత కార్మికులు**

**యాడికి, ఆగష్టు 5, అనంత జనశక్తి న్యూస్ :**

రాష్ట్రంలో ఉన్న చేనేత కార్మికులను ఆదుకోవాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఆగష్ట 7 విశిష్టాత్మకంగా నేతన్న సేవ పథకంను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అమలు చేస్తున్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన చేనేత కార్మికుల జాబితా ను ప్రకటించింది. కానీ అర్హులైన చేనేత కార్మికుల జాబితా లో అనేక మంది చేనేత కార్మికుల వివరాలు తప్పుగా ఉన్నాయని,మరి కొందరు చేనేత కార్మికుల పేర్లు లేవని ఆవేదన చెందారు. చేనేత కార్మికులు జాబితా లో తప్పులు ఉన్న, పేరు లేని చేనేత కార్మికులు మరళా దరఖాస్తు చేసుకోవాలని రెండు రోజుల గడువును రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. దీంతో చేనేత కార్మికులలో కొంత వెలుగు కనిపించింది. రాష్ట్ర వ్యాప్తంగా చేనేత జాబితా లో తప్పులు ఉన్న చేనేత కార్మికులు,పేరు లేని చేనేత కార్మికులు బుధవారం సాయంత్రం లోపు దరఖాస్తు చేసుకోన్నారు. ఇంతలోనే ఈ రెండు రోజులలో పలువురు నేతన్న సేవ పథకం పై బేరసారాలకు తెరలేపారు. దీంతో చేనేత కార్మికులలో చీకటి కమ్ముకోంది. నేతన్న సేవ పథకం లో నీకు సగం.... నాకు సగం అంటూ.......
యాడికి మండల కేంద్రంలో కొందరు చేనేత కార్మికులతో మంతనాలు జరుపుతున్నట్లు చేనేత కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు సచివాలయ సిబ్బంది చేనేత కార్మికులతో ముందుగా మంతనాలు జరిపి,నేతన్న సేవ పథకం కింద మీ అకౌంట్ లో డబ్బులు జమ అయిన తర్వాత మాకు సగం ఇవ్వాలని రహస్యంగా చర్చలు జరుపుతున్నారని తెలిపారు. మరికొందరు కార్యకర్తలు కూడా నేతన్న సేవ పథకం పై డబ్బులు వసూలు చేస్తున్నారని, నేతన్న సేవ పథకం లో రూ.10 వేలు మాకు ఇస్తే , మీ పని మేము చేస్తాము అని ,ఇలా వసూలకు తెరలేపిన చేసినట్లు కొందరు చేనేత కార్మికులు గుసగుసలాడుతున్నారు.అంతే గాక థర్డ్ పార్టీ వ్యక్తులు కూడా ముందుకు వచ్చి రూ.10 మాకు ఇవ్వండి మేము నేతన్న సేవ పథకం అందేలా చేస్తాం అని చేనేత కార్మికులతో ఒప్పందాలు కుదుర్చుకోంటున్నారని చేనేత కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం విశిష్టాత్మకంగా అమలు చేస్తున్న "నేతన్న సేవ పథకం"ను యాడికి మండలంలో కొందరు సచివాలయ సిబ్బంది, కార్యకర్తలు, థర్డ్ పార్టీ వ్యక్తులు తూట్లు పోడుస్తున్నారా.......? అని చేనేత కార్మికులు వాపోయారు. అర్హత ఉన్న చేనేత కార్మికులకు న్యాయం జరుగుతుందా..... లేదా వేచి చూడాల్సిందే అని చర్చించుకొంటున్నారు. డబ్బుల వసూలకు తెర లేపితే రాష్ట్ర ప్రభుత్వానికి చెడ్డ పేరు తప్పదా.... అని బహిరంగంగా గుసగుసలాడుకోంటున్నారు.దీంతో చేనేత కార్మికులు ఆందోళన వ్యక్తం చేశారు.గత ప్రభుత్వం 90 వేల చేనేత కార్మికులకు నేతన్న నేస్తం పథకం ను అందిస్తే,ప్రస్తుత ప్రభుత్వం 51,952 జాబితాను ప్రకటించిందని ,ఈ జాబితాలో కూడా తప్పు లు ఉండడం, మరళా దరఖాస్తు చేసుకోవడం, దీంతో నీకు సగం.... నాకు సగం.... అంటూ బేరసారాలకు తెరలేపడం, ఇవన్నీ చేనేత కార్మికులలో ఆందోళన కలిగిస్తోందని తెలిపారు. మగ్గాల పరిశీలన చేయకుండానే నేతన్న సేవ పథకం అమలు చేయడం, దీంతో అర్హులకు ఎంత న్యాయం జరుతుందో.....
రెండు రోజుల పాటు వేచి చూడాల్సిందే అని ,అర్హులకు అన్యాయం జరిగితే రానున్న పంచాయతీ ఎన్నికల్లో ఎటు వంటి ప్రభావం చూపుతుందో.... ఎదురు చూడాల్సిందే అని చేనేత కార్మికులు తెలిపారు. ఇప్పటికైన బేరసారాలకు కొందరు సచివాలయ సిబ్బంది, కార్యకర్తలు, థర్డ్ పార్టీ వ్యక్తులు స్వస్తి పలికితే రాష్ట్ర ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని, చేనేత కార్మికులకు న్యాయం జరిగేలా అధికారులు, నాయకులు చూడాలని చేనేత కార్మికులు కోరారు.



## మన భూమి – అది మన హక్కు

**- రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం**
**- నాడు వైసీపీ పాలనలో మన రైతు పాసుపుస్తకాల పై జగన్ ఫోటో ముద్రింపు**
**- నేడు సీఎం చంద్రబాబు పాలనలో పాసుపుస్తకాలపై రైతు ఫోటోతో సహా ప్రభుత్వ రాజముద్ర కలిగిన పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ.**
**- పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి**

**ఓడి చెరువు ఆగస్టు 05 అనంత జనశక్తి న్యూస్**



రైతుల హక్కులను పరిరక్షిస్తూ, భూ యాజమాన్యానికి మరింత భరోసా కల్పించే దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పుట్టపర్తి ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి అన్నారు.ఓడి చెరువు మండల రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో డబురువారిపల్లి, తిప్పేపల్లి గ్రామాల్లో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి చేతుల మీదుగా 2,237 మంది రైతులకు ప్రభుత్వ రాజముద్రతో పాటు రైతు ఫోటో ముద్రించిన పట్టాదారు పాసుపుస్తకాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ, గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆనాడు రైతుల పట్టాదారు పాసుపుస్తకాలపై అప్పటి ముఖ్యమంత్రి జగన్ ఫోటోను ముద్రించి పంపిణీ చేశారని, అయితే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం రైతు గౌరవాన్ని కాపాడే విధంగా రైతు ఫోటోతో పాటు ప్రభుత్వ అధికారిక రాజముద్ర కలిగిన పట్టాదారు పాసుపుస్తకాలను అందజేస్తోందని తెలిపారు."మన భూమి - మన హక్కు" అనే భావనతో రైతులకు వారి భూ హక్కులపై పూర్తి భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. రైతుల సంక్షేమం, వ్యవసాయాభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. పుట్టపర్తి నియోజవర్గ అభివృద్ధికి సీఎం చంద్రబాబు నాయుడు అత్యంత ప్రాధాన్యత ఇచ్చారని పేర్కొన్నారు. నియోజవర్గం లో లక్ష కోట్లతో పుట్టపర్తిలో 5వ తరం ఫైటర్ జెట్ పరిశ్రమ ఏర్పాటు తో పుట్టపర్తి నియోజవర్గ అభివృద్ధి గేమ్ చెంజర్ గా మారడం ఖాయం అన్నారు. అదే విధంగా ఆమడ గూరు మండలంలో రూ.51వేల కోట్లతో అతి పెద్ద రిలయన్స్ సోలార్ విద్యుత్ ప్రాజెక్ట్ ఏర్పాటు తో ఈ ప్రాంత అభివృద్ధితో పాటు వేలాది మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. అతి త్వరలో ఓడి చెరువు కు మరో సోలార్ ప్రాజెక్టు రానున్నట్లు తెలిపారు.
ఈ కార్యక్రమంలో రెవెన్యూ శాఖ అధికారులు మండల తహశీల్దార్ శ్రీనివాస్ రెడ్డి, ఆర్ ఐ శ్రీనివాస్ రెడ్డి,మండల కన్వీనర్ జయచంద్ర , మాజీ జెడ్పీటీసి పిట్టా ఓబుల్ రెడ్డి, సొసైటీ అధ్యక్షులు తుమ్మల మహబూబ్ బాషా, బోయపల్లి శివారెడ్డి,మండల తహశీల్దార్ శ్రీనివాస్ రెడ్డి , ఆర్ ఐ శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ నిజాం, కంచి సురేష్, కూటమి నాయకులు మహిళా నాయకురాలు సుభాషిణి ,డబురువారిపల్లి ,తిప్పేపల్లి పంచాయతీ టీడీపీ కుటుంబ సభ్యులు,రైతులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

## మధ్యవర్తిత్వంతో వేగవంతమైన పరిష్కారం...!




**పెద్దాపురం, ఆగస్టు 5 : అనంత జనశక్తి న్యూస్**

మధ్యవర్తిత్వం ద్వారా వివాదాలకు వేగవంతమైన పరిష్కారం లభిస్తుందని పెద్దాపురం ఏడవ అదనపు జిల్లా జడ్జి ఎన్ సరస్వతి అన్నారు. పెద్దాపురం కోర్టు ప్రాంగణంలో ఒక్క కిలోమీటర్ వాక్, బైక్ ర్యాలీ హైకోర్టు, జిల్లా కోర్టుల ఆదేశానుసారం బుధవారం నిర్వహించారు. పెద్దాపురం 7వ అదనపు జిల్లా జడ్జి సరస్వతి ఆధ్వర్యంలో
"మధ్యవర్తిత్వం (మీడియేషన్) 3.0" వారోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఈరోజు పెద్దాపురం కోర్టు ఆవరణ నుండి 1కె వాక్, బైక్ ర్యాలీ కొనసాగింది.
ఈ ర్యాలీలో పాల్గొన్న సభ్యులందరూ "ప్రజలు లిటిగేషన్ వదిలి మధ్యవర్తిత్వాన్ని అనుసరించాలని", "రాజీ మార్గమే రాజ మార్గము" అనే నినాదాలతో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి సరస్వతి మాట్లాడుతూ
ప్రత్యామ్నాయ వివాద పరిష్కార మార్గాలలో మధ్యవర్తిత్వం (మీడియేషన్) అనేది అత్యంత ప్రధానమైనదన్నారు. దీని ద్వారా వివాదాలను పరిష్కరించుకోవడం వల్ల సమయం ఆదా అవ్వడమే కాకుండా తక్కువ ఖర్చు, సామరస్య పూర్వకమైన వాతావరణం, గోప్యత, అనుకూలత లభిస్తాయన్నారు.
కక్షిదారులందరూ ఈ మధ్యవర్తిత్వ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో
డాక్టర్ కె. దీప దైవ కృప (సీనియర్ సివిల్ జడ్జి),
ఎల్ దేవిరత్నకుమారి (ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి), కె. శ్రీహరి (అదనపు జూనియర్ సివిల్ జడ్జి)
టి సత్యనారాయణ (బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్) తో పాటు పలువురు న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీర్లు, కోర్టు సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సోదరి మరిడమ్మకు వెంకటేశ్వర స్వామి "చీరా సారె"..!



**పెద్దాపురంలో ఆధ్యాత్మిక ఘట్టం**

**పెద్దాపురం, ఆగస్టు 5 :అనంత జనశక్తి న్యూస్**

పెద్దాపురం పట్టణంలో బుధవారం ఒక ఆధ్యాత్మిక ఘట్టం కనువిందు చేసింది. సోదరి శ్రీ మరిడమ్మ అమ్మవారికి సోదరుడు అయిన శ్రీవేంకటేశ్వరుడు "చీరా సారె" సమర్పించారు. అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధల నడుమ ఈ కార్యక్రమం జరిగింది. అన్న చెల్లెళ్ళ అనుబంధానికి, దైవిక బంధానికి ప్రతీకగా నిలిచే ఈ మహోత్సవంలో తెదేపా జిల్లా ఉపాధ్యక్షులు నిమ్మకాయల చిన రాజప్ప, తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రాజా సూరిబాబు రాజులు పాల్గొన్నారు. ఆలయ కార్యనిర్వాహణ అధికారి కె జగదీశ్వర రావు, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మరిడమ్మ కి సమర్పించే చీరా సారె తో పురవీదుల్లో ఊరేగింపు నిర్వహించి మరిడమ్మ ఆలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వాహణాధికారి, దేవాదాయ సహాయ కమిషనర్ కె విజయలక్ష్మి సారెకు ఎదురెళ్ళి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం వెంకటేశ్వర ఆలయం నుంచి వచ్చిన సారె ను అమ్మవారి వద్ద ఉంచి ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నాయకులతో పాటు మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మోదీ జీ క్షమించండి మెటా సీఈఓ జుకర్‌బర్గ్

**- వీడియో తొలగింపుపై మెటా దిగొచ్చింది**
**- డీప్‌ఫేక్ కంటెంట్ వ్యాప్తిపై విచారం**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి సంబంధించిన వీడియో తొలగింపుపై మెటా దిగొచ్చింది. ఈ మేరకు మెటా సీఈఓ మార్క్ జుకర్‌బర్గ్.. ప్రధాని మోదీకి క్షమాపణలు చెప్పారు. సీఎస్ఏఎమ్, డీప్‌ఫేక్ కంటెంట్ వ్యాప్తిపై విచారం వ్యక్తం చేసిన మెటా.. కొన్ని రకాల కంటెంట్‌ను బూస్ట్ చేయడానికి భారీగా డబ్బులు తీసుకున్నట్టు అంగీకరించింది. అంతే కాకుండా తమ ప్లాట్‌ఫామ్ నిర్వహణలో జరిగిన పొరపాట్లను కూడా అంగీకరించింది మెటా. కాగా.. ప్రధాని మోదీకి సంబంధించిన జులై 23 నాటి వీడియోను తొలగించడానికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని మెటాను పార్లమెంటరీ కమిటీ బుధవారం ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈ ఘటనకు సంబంధించి బాధ్యులపై చర్యలు తీసుకోవడం సహా బహిరంగంగా క్షమాపణ చెప్పాలని మూడు రోజుల అల్టిమేటం జారీ చేసింది. ఈ మేరకు దిగొచ్చిన మెటా.. మోదీని క్షమాపణలు చెప్పింది.





# హైబీపీ ఉన్న ప్రతి ఒక్కరికీ ఈ ఒక్క అలవాటు చాలా ముఖ్యం: వైద్యులు చెబుతున్న ముఖ్యమైన విషయం

ప్రస్తుత ఆధునిక జీవనశైలిలో చాలామందిని వేధిస్తున్న సమస్యలలో రక్తపోటు (బీపీ) ఒకటి. ఈ సమస్యను అదుపులో ఉంచడానికి చాలామంది ఆహారం, వ్యాయామంపై మాత్రమే దృష్టి పెడతారు. కానీ, ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ సంజయ్ భోజ్‌రాజ్ చెప్పిన ఒక కీలకమైన విషయం అందరినీ ఆలోచింపచేస్తోంది. బీపీ నియంత్రణకు ఆహారం, వ్యాయామంతో పాటు, ఒక అలవాటు కూడా అంతే ముఖ్యమని ఆయన చెబుతున్నారు. ఏంటది?









బీపీ నియంత్రణలో నిద్ర కీలక పాత్ర

బీపీ అదుపులో ఉండాలంటే నిద్రలో క్రమబద్ధత చాలా ముఖ్యం అని డాక్టర్ సంజయ్ భోజ్‌రాజ్ తన ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌లో చెప్పారు. క్రమం తప్పకుండా నిద్రపోవడం కష్టమైన పని అయినా, దాని వల్ల కలిగే ప్రయోజనాలు అపారమని ఆయన అన్నారు. 'బీపీ ఎక్కువగా ఉన్న ప్రతి ఒక్కరికీ నేను సిఫార్సు చేసే ఒకే ఒక్క ముఖ్యమైన అలవాటు ఇది' అని ఆయన స్పష్టం చేశారు. చాలామందికి బీపీ నియంత్రణ అంటే కేవలం ఆహారం, వ్యాయామం అని మాత్రమే తెలుసు. కానీ, మీ నిద్ర షెడ్యూల్ కూడా అంతే ముఖ్యమని ఆయన వివరించారు.

'ప్రతిరోజూ ఒకే సమయానికి నిద్రపోండి, ఒకే సమయానికి లేవండి'

'నేను సిఫార్సు చేసే నెం.1 అలవాటు ఇదే. ప్రతిరోజూ ఒకే సమయానికి నిద్రపోవడానికి, ఒకే సమయానికి నిద్ర లేవడానికి ప్రయత్నించండి. సెలవు రోజుల్లో కూడా ఈ నియమాన్ని పాటించండి. ఇది కష్టమని నాకు తెలుసు. కానీ ఎందుకు ఇది ముఖ్యం అంటే...' అని వివరిస్తూ దాని ప్రయోజనాలను ఇలా చెప్పారు.

సర్కాడియన్ రిథమ్‌ను క్రమబద్ధీకరిస్తుంది: ఇది మన శరీర గడియారాన్ని క్రమబద్ధీకరించి, ఎప్పుడు విశ్రాంతి తీసుకోవాలో, ఎప్పుడు మేల్కొలపాలో చెబుతుంది. కార్టిసాల్ స్థాయిలను తగ్గిస్తుంది: రాత్రిపూట మన ఒత్తిడి హార్మోన్ అయిన కార్టిసాల్ స్థాయిలను తగ్గిస్తుంది. గుండె ఆరోగ్యానికి సహాయపడుతుంది: హార్ట్ రేట్ వేరియబిలిటీ ని మెరుగుపరుస్తుంది. రక్తపోటు నియంత్రణకు: ఇది బీపీని నియంత్రించడంలో సహాయపడుతుంది. 'నిద్ర అనేది ఎక్కువ సమయం ఉండటం కాదు, స్థిరంగా ఉండటమే ఇక్కడ ముఖ్యం' అని ఆయన అన్నారు. ఆ క్రమబద్ధత మీ శరీరానికి ఎప్పుడు విశ్రాంతి తీసుకోవాలో, ఎప్పుడు మరమ్మత్తు చేసుకోవాలో, అలాగే రక్తపోటును ఎలా నియంత్రించాలో చెబుతుందని డాక్టర్ భోజ్‌రాజ్ తెలిపారు.

# టీనేజ్ అమ్మాయిల్లో కనిపించే పీసీఓఎస్ లక్షణాలు... తల్లిదండ్రులు నిర్లక్ష్యం చేసే 5 ప్రధాన సంకేతాలు



పోలీసిస్టిక్ ఓవరీ సిండ్రోమ్ అనేది యువతులలో, ముఖ్యంగా టీనేజ్ అమ్మాయిలలో కనిపించే ఒక సాధారణ హార్మోన్ల సమస్య. ఈ సమస్యకు సంబంధించిన లక్షణాలను చాలామంది తల్లిదండ్రులు యుక్తవయసులో వచ్చే సాధారణ మార్పులుగా భావించి నిర్లక్ష్యం చేస్తుంటారు. ఈ నిర్లక్ష్యం వల్ల చికిత్స ఆలస్యమై, దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలకు దారితీస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

1. మొదటి కొన్ని సంవత్సరాల తర్వాత కూడా క్రమరహిత పీరియడ్స్







అమ్మాయిలకు రుతుస్రావం మొదలైన మొదటి ఒకటి లేదా రెండు సంవత్సరాలలో పీరియడ్స్ క్రమరహితంగా ఉండటం సాధారణం. కానీ, ఈ సమయం దాటిన తర్వాత కూడా పీరియడ్స్ చాలా అరుదుగా, ఆలస్యంగా లేదా అస్సలు రాకపోతే అది PCOS లక్షణం కావచ్చు. చాలామంది తల్లిదండ్రులు ఇది ఒత్తిడి లేదా ఆహారపు అలవాట్ల వల్ల జరుగుతుందని భావించి, సరైన సమయంలో వైద్య సహాయం తీసుకోవడం ఆలస్యం చేస్తుంటారు.

2. సాధారణ చికిత్సకు స్పందించని మొండి మొటిమలు

టీనేజ్ వయసులో మొటిమలు రావడం సహజమే. కానీ, ముఖం, గడ్డం, ఛాతీ లేదా వీపుపై మొటిమలు వచ్చి, ఎన్ని క్రీములు వాడినా తగ్గకపోతే అది PCOS లక్షణం కావచ్చు. సాధారణ మొటిమలకు భిన్నంగా, PCOS వల్ల వచ్చే మొటిమలు చాలా మొండిగా, బాధాకరంగా ఉంటాయి. ఇవి శరీరంలో ఆండ్రోజెన్ (పురుష హార్మోన్) స్థాయిలు పెరగడాన్ని సూచిస్తాయి.

3. శరీరంలో అధిక రోమాలు లేదా జుట్టు రాలడం

గడ్డం, పై పెదవి, ఛాతీ లేదా పొట్టపై అవాంఛిత రోమాలు పెరగడం హార్మోన్ల అసమతుల్యతకు స్పష్టమైన సంకేతం. అయినప్పటికీ, చాలామంది దీన్ని ఒక సాధారణ సౌందర్య సమస్యగా భావించి పట్టించుకోరు. దీనికి విరుద్ధంగా, పురుషులలో కనిపించే పద్ధతిలో జుట్టు పలచబడటం లేదా అధికంగా రాలిపోవడం కూడా టీనేజ్ అమ్మాయిల్లో కు సంకేతం కావచ్చు. అమ్మాయిలకు రుతుస్రావం మొదలైన మొదటి ఒకటి లేదా రెండు సంవత్సరాలలో పీరియడ్స్ క్రమరహితంగా ఉండటం సాధారణం. కానీ, ఈ సమయం దాటిన తర్వాత కూడా పీరియడ్స్ చాలా అరుదుగా, ఆలస్యంగా లేదా అస్సలు రాకపోతే అది లక్షణం కావచ్చు.

4. త్వరగా బరువు పెరగడం లేదా బరువు తగ్గడం కష్టం కావడం

PCOS ఉన్న చాలామంది అమ్మాయిలు సాధారణ ఆహారం తీసుకుని, వ్యాయామం చేసినా బరువు పెరగడం లేదా బరువు తగ్గడానికి చాలా ఇబ్బంది పడతారు. ఇది ఇన్సులిన్ రెసిస్టెన్స్ అనే కీలకమైన సమస్య వల్ల వస్తుంది. దీనిని చాలామంది తల్లిదండ్రులు కేవలం జీవనశైలి మార్పులుగా భావించి, దాని వెనుక ఉన్న హార్మోన్ల సమస్యను గుర్తించడంలో విఫలమవుతారు.

5. మూడ్ స్వింగ్స్, ఆత్మవిశ్వాసం తగ్గడం

మొటిమలు లేదా అవాంఛిత రోమాల వంటి కనిపించే లక్షణాల వల్ల PCOS ఉన్న టీనేజ్ అమ్మాయిలు తరచుగా మూడ్ స్వింగ్స్, ఆందోళన లేదా ఆత్మవిశ్వాసం తగ్గడం వంటి భావోద్వేగ సమస్యలను ఎదుర్కొంటారు. ఈ సమస్యలు శారీరక లక్షణాల వలెనే తీవ్రంగా ఉంటాయి. అయినప్పటికీ, వీటిని PCOSగా భావించరు. వైద్యులకు చూపించరు. వైద్యులను సంప్రదించడం వల్ల తగిన చికిత్స పొందే అవకాశం ఉంటుంది.



# జనవరిలో 'మహారాణి' రాక?



పెద్దగా చదువుకోని ఓ మహిళ ప్రభుత్వ నాయకులతో తలపడాల్సి వస్తుంది. ఈ క్రమంలో ఆమె జీవితం ఎలాంటి మలుపులు తిరిగింది? అనే కథాంశంతో రూపొందిన సిరీస్ 'మహారాణి'. బాలీవుడ్ నాయిక హ్యూమా ఖురేషీ ప్రధాన పాత్రలో నటించిన ఈ సిరీస్ ఓటీటీ ప్రేక్షకుల్ని విశేషంగా ఆకట్టుకుంది. ఇటీవలే ఈ సిరీస్‌లో 'మహారాణి 5' రాబోతున్నట్లు వెల్లడించిన సంగతి తెలిసిందే. తాజాగా ఈ సిరీస్ చిత్రీకరణను ఈ నెల 6 నుంచి హ్యూమా ప్రారంభించనుందని, వచ్చే ఏడాది జనవరిలో దీన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని సిరీస్ బృందం సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇందులో గృహిణి నుంచి శక్తిమంతమైన రాజకీయ నాయకురాలిగా మారిన రాణి భారతి పాత్రలో కనిపించనుంది హ్యూమా. ప్రస్తుతం ఆమె నటించిన 'టాక్సిక్' విడుదలకు సిద్ధంగా ఉంది.

# అప్పుడు సూర్య కంటే 3 రెట్లు ఎక్కువ సంపాదించా: జ్యోతిక



ఇండస్ట్రీలో క్యూట్ కపుల్ అనగానే గుర్తొచ్చేది సూర్య-జ్యోతికనే. సందర్భం వచ్చినప్పుడల్లా వీరిద్దరూ తమ ప్రేమను తెలుపుతూనే ఉంటారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో సూర్యతో తన బంధం, కెరీర్ ప్రారంభంలో ఉన్న పరిస్థితుల గురించి జ్యోతిక పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. కెరీర్ ప్రారంభంలో సూర్య కంటే తానే ఎక్కువ సంపాదించినట్లు తెలిపారు. 'ఆ రోజుల్లో ఆయన పారితోషికం కంటే నా రెమ్యునరేషన్ మూడు రెట్లు ఎక్కువ. ఇప్పుడు అది 30 రెట్లు తగ్గింది' అని సరదాగా చెప్పారు.

"సూర్య ఒక నటుడిగానే కాకుండా భర్తగా చాలా గొప్ప వ్యక్తి. ఆయన మనసులో సమానత్వం మొదటి నుంచే ఉంది. అది సహజంగా పుట్టుకతోనే రావాలి. అమ్మాయిలకు వంట చేయడం రాకపోయినా.. ఏదైనా పని ఇష్టం లేదని చెప్పినా.. సరేనని వదిలేయడం అనేది సాధారణంగా మనం సినిమాల్లో చూస్తుంటాం కదా.. మా ఇంట్లో అచ్చం ఇలానే జరుగుతుంది. నేను ఫెమినిస్ట్‌గా మాట్లాడటం లేదు.. కానీ మా ఇంట్లో మేమిద్దరం సమానమే. సినిమా నిర్మాణం నుంచి పిల్లల పెంపకం, సెలవుల్లో తిరగడం వరకు ప్రతి విషయంలోనూ మేం కలిసే నిర్ణయం తీసుకుంటాం. ఒకరి ఎదుగుదలను చూసి మరొకరం ఆనందించడమే మాకు అత్యంత ఇష్టమైన పని" అని ఆమె చెప్పారు. ఆఫ్‌స్క్రీన్, ఆన్‌స్క్రీన్‌లో హిట్ జోడీ అయిన సూర్య, జ్యోతిక తమిళంలో 'పూవెల్లం కేట్టుప్పార్' మొదలుకొని ఎన్నో విజయవంతమైన చిత్రాల్లో కలిసి నటించి, మెప్పించారు. ఈ సినిమా సమయంలోనే వీరిద్దరి మధ్య ప్రేమ చిగురించింది. 2006 సెప్టెంబర్ 11న వివాహం చేసుకున్నారు.

# తొలగించకపోతే చర్యలు తప్పవు: మృణాల్ ఠాకూర్



కృత్రిమ మేధ(ఏఐ)ను దుర్వినియోగం చేసి సృష్టించే డీప్ ఫేక్ ఫొటోలకు వ్యతిరేకంగా గళం విప్పారు హీరోయిన్ మృణాల్ ఠాకూర్. ఇప్పటికే నటీనటుల వ్యక్తిగత హక్కులను ఉల్లంఘిస్తూ సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ఏఐ ఆధారిత ఫొటో ప్రచారాలపై పలువురు బాలీవుడ్ తారలు న్యాయస్థానాలను ఆశ్రయించారు. ఈ నేపథ్యంలోనే తాజాగా మృణాల్ తన ఫొటోలను ఉపయోగించి కంటెంట్‌ను సృష్టించి వాటిని డిజిటల్ మాధ్యమాల్లో ఉంచేవారికి హెచ్చరిక జారీ చేశారు. "నా డీప్‌ఫేక్ ఫొటోలను సృష్టించి వాటిని సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేయడం చట్టవిరుద్ధం. ఇలాంటి పనులు ఏ మాత్రం ఆమోదయోగ్యం కాదు. తక్షణమే వాటిని తొలగించండి. లేదంటే చట్టపరమైన చర్యలు తీసుకోవల్సి వస్తుంది" అని మృణాల్ ఇన్‌స్టా స్టోరీలో రాసుకొచ్చారు.

# 'బిగ్‌బాస్'.. క్రమశిక్షణ లేని ప్రవర్తనను అంగీకరించను: నాగార్జున



బుల్లితెర రియాలిటీ షో 'బిగ్‌బాస్' తెలుగు సీజన్-10 ముస్తాబవుతోంది. దీనికి సంబంధించిన ప్రోమో షూటింగ్‌ను టాలీవుడ్ అగ్రకథానాయకుడు నాగార్జున ఇటీవల పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఓ ఇంటర్వ్యూలో ఆయన ముచ్చటించారు. బిగ్‌బాస్ విశేషాలతో పాటు తన 100వ చిత్రం గురించి పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నారు."ప్రోమో షూట్ చాలా బాగా జరిగింది. గత కొన్నేళ్లుగా నేను ఈ షోను హోస్ట్ చేస్తున్నా. ఇది పదో సీజన్ కావడంతో సరికొత్తగా, మరింత ఉన్నత స్థాయిలో ప్లాన్ చేస్తున్నాం. ఇతరుల ప్రవర్తనను నిర్ణయించడం, సూచనలు చేయడం నాకిష్టం ఉండదు. అందుకే మొదటి రెండు సీజన్లలో కొంచెం ఇబ్బందిగా అనిపించింది. ఆ తర్వాత షో ఫార్మాట్ అలవాటైంది. గత సీజన్ సూపర్ హిట్ కావడంతో, ప్రేక్షకుల డిమాండ్ మేరకు ఈసారి ఫిజికల్ టాస్కులు మరింత కఠినంగా ఉండబోతున్నాయి. షోలో కంటెస్టెంట్లు హద్దులు దాటి, క్రమశిక్షణ లేకుండా ప్రవర్తిస్తే అస్సలు అంగీకరించను" అని నాగార్జున పేర్కొన్నారు. ఇక తన 100వ సినిమా గురించి నాగార్జున అప్‌డేట్ ఇచ్చారు. ప్రస్తుతం ఆ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోందని, త్వరలోనే ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను అభిమానుల ముందుకు తీసుకొస్తామని వెల్లడించారు.

# దేశవాళీలో విరాట్‌కు అదే తొలి టీ20..

## ఎన్ని పరుగులు చేశాడో తెలుసా?



ప్రపంచ క్రికెట్‌లో ఐపీఎల్ ఓ సంచలనం. అత్యుత్తమ ప్లేయర్లను వెలుగులోకి తీసుకొచ్చింది. అటు ఆటపరంగానూ.. ఇటు సంపాదనలోనూ బెస్ట్ అని తేలింది. 2008లో బీసీసీఐ తొలి ఐపీఎల్ సీజన్‌ను ప్రారంభించింది. అయితే, ఈ మెగా లీగ్‌ను తీసుకొచ్చే ముందు బీసీసీఐ ప్రయోగాత్మకంగా 2006-2007 సీజన్‌లో ఓ టీ20 టోర్నీని ప్రారంభించింది. అప్పుడు ఇంటర్ స్టేట్ టీ20గా పిలిచేవారు. తర్వాత సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీగా నామకరణం చేశారు. అందులోనే విరాట్ కోహ్లీ తొలిసారి బరిలోకి దిగాడు. అప్పుడు అతడి వయసు కేవలం 18 ఏళ్లే.

**రెండో టాప్ స్కోరర్**

విరాట్ కోహ్లీ ఇప్పుడు మైదానంలోకి అడుగు పెడితే అభిమానుల జోష్‌ను ఆపలేం. స్టేడియమంతా కిటకిటలాడాల్సిందే. కానీ, దాదాపు 19 ఏళ్ల కిందట మాత్రం పరిస్థితి భిన్నం. ఢిల్లీ తరపున హిమాచల్ ప్రదేశ్‌పై విరాట్ కోహ్లీ తొలి దేశవాళీ టీ20 మ్యాచ్ ఆడాడు. నాడు డొమిస్టిక్‌లోనే బెస్ట్ సీనియర్ బౌలర్లను ఎదుర్కొవాల్సి వచ్చింది. అదీనూ పిచ్ బ్యాటింగ్‌కు కష్టమైన పరిస్థితుల్లో వన్‌డౌన్ బ్యాటర్‌గా వచ్చాడు. 26 బంతుల్లో 35 పరుగులు చేశాడు. ఆ మ్యాచ్‌లో శిఖర్ ధావన్ (38) తర్వాత కోహ్లీనే టాప్ స్కోరర్. మిగతా బ్యాటర్లు చాలా ఇబ్బంది పడ్డారు. దీంతో ఢిల్లీ 136 పరుగులే చేయగలిగింది. అనంతరం లక్ష్య ఛేదనలో 19 ఓవర్లలోనే మూడు వికెట్లను కోల్పోయి హిమాచల్ విజయం సాధించింది.

ఇలా దేశవాళీలో విరాట్ తలపడిన మొదటి మ్యాచ్‌లోనే తన జట్టు ఓడిపోయింది. అయితే, అతడి ఆట మాత్రం ఆకట్టుకుంది. దీంతో 2008 ఐపీఎల్ (IPL) డ్రాఫ్ట్‌లోకి వచ్చే అవకాశం దక్కింది. ఢిల్లీ ఫ్రాంచైజీ స్థానిక కుర్రాడు కోహ్లీని కాదని ప్రదీప్ సంగ్వాన్ వైపు మొగ్గు చూపింది. మరోవైపు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మాత్రం కోహ్లీని డ్రాఫ్ట్ ధరకే సొంతం చేసుకుంది. ఆర్సీబీ తీసుకోవడానికి కారణం దేశవాళీలో కోహ్లీ ఆడిన తొలి టీ20 ప్రదర్శనతోపాటు అండర్ -19 వరల్డ్ కప్‌లో సారథ్య నైపుణ్యం ఆకట్టుకొని ఉండొచ్చు. ఐపీఎల్ ప్రారంభమైన ఏడాదే.. విరాట్ నేతృత్వంలో టీమ్‌ఇండియా అండర్-19 జట్టు వరల్డ్ కప్ సాధించిన సంగతి తెలిసిందే. ఇక వరుసగా 19 ఏళ్ల నుంచి కోహ్లీ బెంగళూరుకే ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. వరుసగా రెండు కప్పలను నెగ్గడంలో అతడు కీలక పాత్ర పోషించాడు.

# సీనియర్ ఆటగాళ్లను కాపాడుకోవాలి: అజింక్య రహానే

టెస్టు క్రికెట్ జట్టులో యువ ఆటగాళ్ల కంటే సీనియర్ ప్లేయర్లు ఎక్కువ మంది ఉండాలని అజింక్య రహానే అభిప్రాయపడ్డాడు. ఇటీవల అన్ని ఫార్మాట్ల క్రికెట్‌కు వీడ్కోలు పలికిన రహానే ఇటీవల ఓ పాడ్‌కాస్ట్‌లో పాల్గొని పలు విషయాల గురించి మాట్లాడాడు. టెస్టు క్రికెట్‌లో భారత్ పూర్వ వైభవం పొందాలంటే ప్రస్తుతం ఉన్న సీనియర్ ఆటగాళ్లను జట్టులో కొనసాగించాలన్నాడు. సీనియర్లు ఒకేసారి ఆటకు దూరమవుతుండటం టీమ్‌ఇండియాకు సమస్యగా మారిందని 'జింక్స్' పేర్కొన్నాడు.

'గత రెండేళ్లుగా నేను టెస్టు క్రికెట్ ఆడకపోవడంతో ఇంట్లోనే కూర్చొని మ్యాచ్‌లు వీక్షించా. భారత జట్టు స్వదేశంలోనే మ్యాచ్‌లు ఓడిపోవడం కూడా చూశా. టెస్టు క్రికెట్ ఆడాలంటే పట్టుదల ఉండాలి. దాన్ని భారత ఆటగాళ్లు పెంపొందించుకుని పోటీతత్వంతో కూడిన క్రికెట్ ఆడాలి. ప్రతి సెషన్ పూర్తిగా ఆడాలి. చాలా జట్లు అలా చేయడం లేదు. నేను ఏ జట్టు గురించి ప్రత్యేకంగా చెప్పదల్చుకోలేదు. భారత టెస్టు క్రికెట్‌లోకి గత రెండేళ్లలో కొత్త ఆటగాళ్లు వచ్చారు. వారి సంగతి పక్కన పెట్టండి.

టెస్టు జట్టులో 7-8 మంది సీనియర్లు, ఇద్దరు లేదా ముగ్గురు యువ ఆటగాళ్లు ఉండాలనేది నా అభిప్రాయం. కానీ, ఇప్పుడు జట్టు కొత్త వాళ్లతో నిండిపోతోంది. దాదాపుగా సీనియర్ ఆటగాళ్లంతా రిటైర్ అయ్యారు. మిగిలిన అనుభవజ్ఞులైన ఆటగాళ్లను గౌరవించడం చాలా అవసరం. నిజం చెప్పాలంటే టెస్టు క్రికెట్ గురించి నాకు భయంగా ఉంది. ఇది మనుగడ సాగించాలని మనందరం కోరుకోవాలి. ముఖ్యంగా భారత్, ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, సౌతాఫ్రికాల్లో టెస్టు క్రికెట్ కొనసాగాలి" అని రహానే వివరించాడు.

గతేడాది రవిచంద్రన్ అశ్విన్, రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, ఛతేశ్వర్ పుజారా వంటి అనుభవజ్ఞులైన ఆటగాళ్లు వీడ్కోలు పలికిన సంగతి తెలిసిందే. తాజాగా రహానే కూడా రిటైర్మెంట్ ప్రకటించడంతో జట్టులో సీనియర్ల సంఖ్య తగ్గిపోయింది. ప్రస్తుతం భారత జట్టులో రవీంద్ర జడేజా, కేఎల్ రాహుల్, రిషభ్ పంత్, జస్‌ప్రీత్ బుమ్రా మాత్రమే 50 కంటే ఎక్కువ టెస్టులు ఆడారు.



# ఒక్కడినే విమర్శించడం సరికాదు.. గంభీర్‌కు మద్దతుగా మాజీ చీఫ్ సెలక్టర్



గౌతమ్ గంభీర్ హెడ్ కోచ్‌గా వచ్చినప్పటి నుంచి టీమ్‌ఇండియా పరిమిత ఓవర్ల క్రికెట్‌లో మంచి ఫలితాలే సాధిస్తోంది. టెస్టుల్లో మాత్రం పేలవ ప్రదర్శన చేస్తోంది. స్వదేశంలో న్యూజిలాండ్, సౌతాఫ్రికాతో జరిగిన సిరీస్‌ల్లో ఘోర ఓటములను మూటగట్టుకుంది. ఈ ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్‌లో భారత్ తొమ్మిది మ్యాచ్‌లు ఆడి నాలుగు విజయాలు, నాలుగు ఓటములతో పాయింట్ల పట్టికలో ఐదో స్థానంలో ఉంది. గంభీర్ ఒంటెద్దు పోకడల వల్లే టెస్టుల్లో భారత్ పేలవ ప్రదర్శన చేస్తోందని విమర్శలు వస్తున్నాయి. త్వరలో శ్రీలంకతో జరగనున్న రెండు టెస్టుల సిరీస్ గంభీర్‌కు అగ్నిపరీక్షగా మారింది. ఒకవేళ ఈ సిరీస్ కూడా కోల్పోతే అతనిపై వేటుపడే అవకాశాలు లేకపోలేదు. ఇలాంటి తరుణంలో గంభీర్‌కు మాజీ చీఫ్ సెలక్టర్ సందీప్ పాటిల్ మద్దతుగా నిలిచాడు. జట్టు వైఫల్యాన్ని ఒక్క వ్యక్తిపైనే మోపలేమన్నాడు.

"శ్రీలంక పర్యటన అందరికీ కీలకం. కేవలం గంభీర్‌నే ఎందుకు టార్గెట్ చేస్తున్నారు? అతను మంచి ఫలితాలు తేవడంలో విఫలమైతే ఆటగాళ్లు కూడా విఫలమైనట్లే. ఒక్కరినే విమర్శించడం సరికాదు. మన ఆటగాళ్లు స్పిన్నర్లను ఎదుర్కోలేకపోయారు. అందుకే న్యూజిలాండ్‌తో స్వదేశంలో సిరీస్ ఓడిపోయాం. అంతేకాకుండా కివీస్ ఆటగాళ్లు పూర్తి సన్నద్ధతతో ఇక్కడికి వచ్చారు. వారు స్పిన్‌కు అనుకూలమైన వికెట్లపై ప్రాక్టీస్ చేశారు. టీమ్‌ఇండియా మాత్రం బ్యాటింగ్, బౌలింగ్‌కు అనుకూలించే పిచ్‌లపై ప్రాక్టీస్ చేసింది. అదే భారత జట్టుకు ప్రతికూలంగా మారింది. అందుకే ఓటములను చవిచూసింది" అని సందీప్ పాటిల్ పేర్కొన్నాడు.

2007-2008 మధ్య టీమ్‌ఇండియాకు తాత్కాలిక కోచ్‌గా వ్యవహరించిన లాల్‌చంద్ రాజ్‌పుత్ కూడా గంభీర్‌కు అండగా నిలిచాడు. కోచ్ అన్నాక ఒడుదొడుకులు సహజమని, ప్రతిసారీ గెలవలేమని పేర్కొన్నాడు. ప్రస్తుతం భారత జట్టు పరివర్తన దశలో ఉందని.. ఇలాంటి సమయంలో ఆటగాళ్లకు, కోచ్‌కు తగినంత సమయం ఇవ్వాలన్నాడు. రోహిత్, కోహ్లీ వంటి దిగ్గజాలు రెండు ఫార్మాట్ల నుంచి తప్పుకోవడం కూడా టీమ్‌ఇండియాపై ప్రభావం చూపిస్తోందని లాల్‌చంద్ రాజ్‌పుత్ అన్నాడు. ఆగస్టు 15 నుంచి శ్రీలంకతో భారత్ రెండు టెస్టుల సిరీస్‌లో తలపడనుంది. ఇప్పటికే టీమ్‌ఇండియా శ్రీలంకకు చేరుకుంది.

PRINTER, PUBLISHER AND OWNED BY SHANKARAGALLU VENKATESULU, AND PRINTED AT M/S SREE VASAVI PUBLICATIONS#4/38, Main Road, Settur515, 767, Ananthapuram Dist., (A.P)
EDITOR : SHANKARAGALLU VENKATESULU. Email: anantha janasakshi2019@gmail.com, Cell : 9533633213, RNI REGD NO : APTEL/2015/61314